

పురాతనమైన సమస్తరోగాలకు

ఆయుర్వేద చికిత్స

మూల వ్యాధి, తెల్లమచ్చలు,చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల రోగులకు వనమూలికలతో వైద్యం చేయబడును.

శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము

నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :25 సంచిక :85 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు మంగళవారం 04 ఆగస్టు 2026 పేజీలు :12 వెల రూ5 /-


## అందుబాటులోకి తొలి ప్రైవేట్ ఆయిల్ పామ్

**ఖమ్మం, ఆగస్టు 3:**తెలంగాణలో తొలి ప్రైవేటు సమీకృత ఆయిల్‌పామ్ పరిశ్రమ ఖమ్మం జిల్లా అంజనాపురంలో ఈ నెల 20న ప్రారంభం కానుంది. గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ రూ.300 కోట్ల పెట్టుబడితో 113.5 ఎకరాల్లో నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా 700 మందికి ఉపాధి లభించనుంది. మలేసియా భాగస్వామ్యంతో దేశంలోనే తలమానికంగా నిలిచే సీడ్ గార్డెన్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న మరో ఆరు ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.తెలంగాణ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటి ప్రైవేటు సమీకృత ఆయిల్‌పామ్ పరిశ్రమ ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. ప్రముఖ గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ సంస్థ ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి రెవెన్యూ పరిధిలోని అంజనాపురం



గ్రామపంచాయతీలో - మిగతా3లో

## విద్యా వ్యవస్థ అంత దారుణమా...

**హైదరాబాద్, ఆగస్టు 3:**మన రాష్ట్రంలో ప్రతి సంవత్సరం సుమారు లక్షా పదివేల మంది విద్యార్థులు వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి పట్టాలు పొందుతున్నారు. కానీ ఈ పట్టాలు చేతపట్టుకుని బయటకు వస్తున్న యువతలో కేవలం పదిహేను శాతం మంది మాత్రమే పరిశ్రమల ప్రమాణాలకు సరిపోతున్నారు. మిగిలిన మెజారిటీ విద్యార్థులు కనీసం ప్రాథమిక కోడింగ్ లేదా కమ్యూనికేషన్ నైపుణ్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల పరిస్థితిని ప్రస్తావిస్తూ కఠినమైన పదాలు వాడారు. గమనించాల్సిన విషయం ఏమిటంటే గతంలో కేసీఆర్ కూడా అసెంబ్లీలో ఇదే ఆందోళన వ్యక్తం చేశారు. ఇద్దరు నేతల మాటల శైలి వేరుగా ఉన్నప్పటికీ వారిద్దరి ఆవేదన వెనుక ఉన్న ప్రధాన కారణం మన విద్యావ్యవస్థలో - మిగతా3లో



## జోగినులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల వేడుకల్లో పాల్గొన్న పొన్నం ప్రభాకర్
- అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించిన మంత్రి
- జోగినులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇస్తామని వెల్లడి



లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల సందర్భంగా బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జోగినుల కోసం కీలక ప్రకటనలు చేశారు. జోగినులకు ప్రత్యేక గుర్తింపునిస్తూ ఐడెంటిటీ కార్డులు (గుర్తింపు కార్డులు) జారీ చేయడంతో పాటు భవిష్యత్తులో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రజలందరికీ ఇది అత్యంత శుభదినమని, అమ్మవారి దివ్య ఆశీస్సులతో - మిగతా3లో

## అమెరికాలో తెలంగాణకు పెట్టుబడుల పిలుపు

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**బాల్టిమోర్ (అమెరికా):**అమెరికన్ తెలుగు అసోసియేషన్ **(ATA)** 19వ జాతీయ మహాసభల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ప్రవాస భారతీయులకు మాతృభూమికి రుణం తీర్చుకునే సమయం వచ్చిందని పిలుపునిచ్చారు.

**ముఖ్యాంశాలు:**

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి.. ప్రపంచ అభివృద్ధి చెందిన దేశాలకు పోటీగా తెలంగాణను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.సింగిల్ విండో విధానం ద్వారా అన్ని అనుమతులను వేగంగా మంజూరు చేసి, ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.పరిశ్రమలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రవాస భారతీయులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.మూసీ నది పునరుజ్జీవనం, రీజినల్ రింగ్ రోడ్ **(RRR)**, 36 రేడియల్ రోడ్లు, ఫ్యూచర్ సిటీ నిర్మాణం వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను వివరించారు.ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్' ఏర్పాటు చేస్తున్నామని, ఈ కార్యక్రమంలో ప్రవాసులు భాగస్వాములు కావాలని కోరారు.ఎన్ఆర్ఐల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక



వ్యవస్థఎన్ఆర్ఐలు, వారి కుటుంబ సభ్యులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారం కోసం చట్టబద్ధ అధికారాలతో కూడిన ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటును ప్రభుత్వం పరిశీలిస్తోందని వెల్లడించారు.తెలంగాణలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ **(SIR)** కార్యక్రమాన్ని వినియోగించుకుని, ప్రపంచంలో ఎక్కడ ఉన్నా ఆన్‌లైన్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని ప్రవాసులకు విజ్ఞప్తి చేశారు.



## విపక్షాల ఆందోళనతో మరోసారి లోక్‌సభ వాయిదా"

**న్యూఢిల్లీ:**పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. విపక్ష సభ్యుల నినాదాలు, నిరసనల నేపథ్యంలో లోక్‌సభను మరోసారి మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. సభ ప్రారంభమైన వెంటనే విపక్ష సభ్యులు తమ డిమాండ్లపై ఆందోళనకు దిగడంతో సభలో గందరగోళం నెలకొంది. పలుమార్లు సభ్యులను శాంతించాలని స్పీకర్ కోరినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో సభా కార్యక్రమాలను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కీలక బిల్లులు, ప్రశ్నోత్తరాల కార్యక్రమం మరోసారి నిలిచిపోయింది.

## కుంభవృష్టి ఖాయం, ప్రాణనష్టం తప్పదు..

- ఉజ్జయిని రంగంలో అమ్మవారి హెచ్చరిక!
- లష్కర్ బోనాల్లో కీలకమైన రంగం కార్యక్రమం
- ఈసారి తీవ్ర ఆగ్రహంతో ఉన్నానన్న ఉజ్జయిని మహంకాళి
- కుంభవృష్టి, అగ్నిప్రమాదాలు తప్పవని హెచ్చరిక
- ఆరు నెలల్లో విగ్రహ ప్రతిష్ఠ చేయాలని అమ్మవారి ఆదేశం
- తప్పితే భారీ ప్రాణనష్టం తప్పదని భవిష్యవాణి

సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయంలో లష్కర్ బోనాల ఉత్సవాల్లో భాగంగా నేడు అత్యంత కీలకమైన 'రంగం' కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. మాతంగి స్వర్ణలత పచ్చి మట్టికుండపై నిలబడి అమ్మవారి తరఫున భవిష్యవాణి వినిపించారు. ఈ ఏడాది తాను తీవ్ర ఆగ్రహంతో ఉన్నానని, ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడంపై తీవ్ర అసంతృప్తిగా ఉన్నానని అమ్మవారు తన వాణిలో హెచ్చరించారు. ప్రజల ప్రవర్తన తనను కంటతడి



పెట్టిస్తోందని, మనశ్శాంతి లేకుండా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.భవిష్యవాణిలో స్వర్ణలత మాట్లాడుతూ.. "నా విగ్రహ ప్రతిష్ఠ చేస్తానని మాటిచ్చి నిలబెట్టుకోలేదు. అయినా ప్రజలను నేను కాపాడుతూనే ఉన్నా. ఏ ఆపద వచ్చినా అడ్డుకుంటున్నా. కానీ - మిగతా3లో



## అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి మోసం చేశారు..

**సీఎం రేవంత్‌పై కేటీఆర్ ధ్వజం**

**హైదరాబాద్, ఆగస్టు 3 :** అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి కాంగ్రెస్ నేతలు మోసం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో ఈరోజు (సోమవారం) మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నియోజకవర్గం మధిరలో గడ్డం వేణు అనే యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్నారని ప్రస్తావించారు. రెండు పేజీల సూసైడ్ నోట్‌లో సీఎం, డిప్యూటీ సీఎం, రాహుల్‌గాంధీకి రాశారని.. ఈ లేఖను వారికి షేర్ చేయాలని ఆయన తన సూసైడ్ నోట్‌లో తెలిపారని అన్నారు. గడ్డం వేణు రాసింది సూసైడ్ నోట్ కాదని కాంగ్రెస్ పాలనపై ఛార్జ్‌షీట్ అని చెప్పుకొచ్చారు.

**యువత నిరాశ, నిస్పృహల్లో ఉన్నారు..**

వేణు రాసిన సూసైడ్ నోట్ సీఎం రేవంత్‌రెడ్డికి అందిందా...? రాష్ట్రంలో, దేశంలో యువత నిరాశ, నిస్పృహల్లో ఉన్నారని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. యూత్ డిక్లరేషన్ పేరుతో ఢిల్లీ నుంచి పెద్ద వాళ్లను తీసుకువచ్చి బిల్డప్పులు కొట్టారని ఎద్దేవా చేశారు. కేసీఆర్, కేటీఆర్ ఉద్యోగాలు ఊడగొడితే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ నేతలు అనలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎందుకు ఈ విషయంపై స్పందించడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రాహుల్ గాంధీ కనపడరని చెప్పుకొచ్చారు. సొంత నియోజకవర్గంలో - మిగతా3లో



## ఆ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం సంతోషకరం

**కిషన్‌రెడ్డి**

**ఢిల్లీ, ఆగస్టు 3 : PKOC**–2 డిప్‌సైడ్ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం సంతోషకరమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులకు, కార్మికుల కుటుంబ సభ్యులకు, కార్మిక సంఘాల ప్రతినిధులకు, సింగరేణి అధికారులకు. తెలంగాణ ప్రజలకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల.. - మిగతా3లో

## నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రోబోటిక్ శస్త్రచికిత్సలు పూర్తి

**సీఎం రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్, ఆగస్టు 3 :** నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రోబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి అయ్యాయని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ఘనత సాధించినందుకు నిమ్స్? డైరెక్టర్? రాహుల్? దేవరాజ్?తో పాటు వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం నెరవేరిందని వ్యాఖ్యానించారు. నిమ్స్?లో ఇప్పటివరకు నిర్వహించిన రోబోటిక్ సర్జరీల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా నిర్వహించడం ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయమని సీఎం పేర్కొన్నారు. ఇటీవలే రెండు వేల కిడ్నీ



మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు వెయ్యి రోబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవటం ద్వారా కొత్త రికార్డు నెలకొల్పిందని - మిగతా3లో

వార్తాతరంగాలు

మంగళవారం 04 ఆగస్టు 2026

## సంపాదకీయం

# సీజేపీ సైలెంట్ ఉద్యమం

నీట్ పేపర్ లీకేజీ, విద్యా వ్యవస్థలోని లోపాలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నడిపిన ఉద్యమం ఇటీవల దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఉద్యమం పైకి ఆగినట్లు కనిపించినా, విశ్లేషకులు దీన్ని కేవలం తాత్కాలిక ఎత్తుగడగా చూస్తున్నారు. సీజేపీ ఇప్పుడు వ్యవస్థలో నిలబడి, ఎన్నికల్లో పోటీ చేసి, బీజేపీకి వ్యతిరేకంగా విస్తృత కూటమి నిర్మించాలని ప్రయత్నిస్తోందని తెలుస్తోంది.విద్యార్థుల నిరసనలు మంత్రి రాజీనామాకు దారితీశాయి. ఇది ఉద్యమకారులకు తక్షణ విజయంగా కనిపించినా, సీజేపీకి అసలు లక్ష్యం అంతకు మించినదని స్పష్టమవుతోంది. రాజీనామా తర్వాత ప్రధాన ఇష్యూ కనుమరుగైంది. విద్యార్థులపై అనేక కేసులు నమోదయ్యాయి. దాడులు, రాళ్లు విసిరినవారిని గుర్తించడంతో పలువురు మళ్లీ ఉద్యమానికి రావడం కష్టమైంది. ఫలితంగా బహిరంగ నిరసనలు ఆగిపోయాయి. అయినా సీజేపీ సీనియర్ కార్యకర్తల కార్యకలాపాలు ఆగలేదు. వారు వివిధ వ్యక్తులను కలుస్తూ, వ్యూహాలు రూపొందిస్తున్నారు.సీజేపీలో అశుతోష్ రాంకా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆప్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్న ఈయన ఇప్పుడు సీజేపీలో ప్రముఖంగా కనిపిస్తున్నారు. దీపికా బలీయ కూడా ముందుకు వచ్చారు. జాట్ సమాజానికి చెందిన ఈ మహిళా నేత ఇటీవల సంయుక్త కిసాన్ మోర్చా సమావేశానికి హాజరై కేంద్ర వ్యతిరేక స్వరం వినిపించారు. అక్కడే రైతు నేత రాకేశ్ టికాయత్‌ను కలిశారు. 2020--21 రైతు ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన టికాయత్‌తో సంపర్కాలు సీజేపీకి రైతు శక్తిని చేర్చుకునే అవకాశం కల్పిస్తున్నాయి. అంతకుముందు సమాజ్‌వాదీ పార్టీ నేతలు, ఆజాద్ సమాజ్ పార్టీ, ఆప్ నాయకులతోనూ చర్చలు జరిగాయి. యాంటీ బీజేపీ కూటమిని ఏర్పాటు చేసి ఏకీకృత పోరాటం చేయాలనే లక్ష్యంతో ఈ భేటీలు సాగుతున్నాయి. రాకేశ్ టికాయత్‌కు ఉత్తరప్రదేశ్ జాట్ సమాజంలో పట్టు ఉంది. అజీత్‌సింగ్, హరియాణాలోని ఓం ప్రకాశ్ చౌతాల కుటుంబం వంటి జాట్ నాయకులతో కలిసి కూటమి ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. యూపీలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జాట్ ఓట్లను బీజేపీ నుంచి దూరం చేయడమే లక్ష్యం.2021--22 రైతు ఉద్యమంలో ఢిల్లీకి వచ్చే రోడ్లు దిగ్బంధించిన అనుభవాన్ని సీజేపీ ఉపయోగించుకోవాలని చూస్తోంది. అప్పటి సంఘటనల్లో ఎర్రకోట వద్ద జరిగిన కొన్ని సంఘటనలు, ఒక ఉద్యమకారుడి మరణం వంటివి ఇప్పటికీ చర్చనీయాంశాలే. అయితే ప్రస్తుతం సీజేపీ మరింత విస్తృత బేస్ నిర్మించడంపై దృష్టి సారించింది. విద్యార్థుల్లోని యాంటీ మోదీ సెంటిమెంట్‌ను రైతు సంఘాలు, విపక్షాలతో కలిపి యూపీ, గుజరాత్, గోవా వంటి రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీని సవాలు చేయాలని భావిస్తోంది. ప్రాంతీయ పార్టీలకు లబ్ధి చేకూర్చే వ్యూహాలు రూపొందుతున్నాయి. కాంగ్రెస్ కూడా సీజేపీతో సఖ్యతగా వ్యవహరిస్తూ ప్రోత్సహిస్తోంది.మంత్రి రాజీనామాతో సీజేపీకి స్పష్టమైన విజయంగా చెప్పుకునే అవకాశం తగ్గింది. విద్యార్థుల ఉద్యమం ఆగిపోవడం, కేసులు నమోదు కావడం పెద్ద సవాళ్లు. అయినా సైలెంట్‌గా సాగుతున్న ప్రయత్నాలు, కీలక నేతల సంపర్కాలు చూస్తే ఉద్యమం పూర్తిగా ఆగిపోలేదని స్పష్టం. కొంతమంది జంతర్‌మందతర్ ఉద్యమం వద్ద రీల్స్ చేయడం ద్వారా ఫాలోవర్ల సంఖ్య పెంచుకున్నారు. ఓ మైనర్‌కు ఇన్‌స్టాలో మొదట 5 వేల మంది ఫాలోవర్లు ఉండేవారట. జంతర్‌మంతర్ వద్ద రీల్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయడంతో అతని ఫాలోవర్లు 7.5 లక్షలకు పెరిగారట. ఫాలోవర్ల పెరుగుదలతో కొందరు కొత్త ఫోన్ కొనుక్కుని అక్కడే విజయం సాధించానని చెప్పుకున్నారు. ఇలాంటి సంఘటనలు ఉద్యమం కంటే వ్యక్తిగత ప్రచారం, కంటెంట్ సృష్టి మీద దృష్టి పెట్టినట్లు అనిపిస్తుంది. ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లు యువతను ఆకర్షించి, వారిని వేదిక వద్దకు తీసుకువచ్చే శక్తిగా మారాయి.కొంతమంది దూషించి, ద్వేషపూరిత వ్యాఖ్యలతో రీల్స్ చేసి ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కొన్నారు. అయినా కొందరు లబ్ధి పొందినట్లు కనిపిస్తోంది. ఇలాంటి విధానం ఉద్యమం యొక్క అసలు ఉద్దేశాన్ని దెబ్బతీస్తుంది. సానుకూలంగా, నిజమైన సమస్యలపై అవగాహన కల్పించే రీల్స్ చేస్తే మంచిది కానీ, ద్వేషం, తిట్లు ద్వారా దష్టి సాధించే ప్రయత్నాలు ప్రజా మద్దతును బలహీనపరుస్తాయి.తాజా జంతర్‌మంతర్ రీల్స్ ఇన్‌స్టా బేస్డ్ హెజిటేషన్ అనే ధోరణిని సూచిస్తున్నాయి. అంటే సామాజిక మాధ్యమాల్లో కనిపించే విధంగా, లైక్‌లు, ఫాలోవర్లు పెరగాలనే ఆలోచనతోనే చాలామంది పాల్గొంటున్నారు. నిజమైన సమస్యలపై పోరాటం కంటే వైరల్ కంటెంట్ సృష్టి ప్రధానమైపోతే ఉద్యమం బలహీనపడుతుంది. అదే సమయంలో సామాజిక మాధ్యమాలు సమాచారం వ్యాప్తి చేయడంలో, యువతను సమీకరించడంలో సహాయపడతాయిజంతర్‌మంతర్ వద్ద జరిగిన ఈ ఉద్యమంలో రీల్స్ పాత్ర కీలకంగా కనిపిస్తోంది. సామాజిక మాధ్యమాలు ఆధునిక ప్రజా ఉద్యమాల ఆకారం మార్చేస్తున్నాయి. అయితే వాటిని సానుకూలంగా, నిజాయితీగా ఉపయోగిస్తేనే అసలు లక్ష్యాలు నెరవేరుతాయి.రాజకీయాల్లో బలమైన శక్తిగా మారాలనే లక్ష్యంతో సీజేపీ కదులుతోంది. ఈ ప్రయత్నాలు ఎంతవరకు విజయవంతం అవుతాయో, యాంటీ బీజేపీ ఫ్రంట్ ఎలా రూపుదిద్దుకుంటుందో రాబోయే నెలల్లోనే స్పష్టమవుతుంది.

# జెన్ జీ టచ్ లో జనసేన

**కాకినాడ, ఆగస్టు 3:**ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జెన్ జీ యువత కేంద్రంగా రాజకీయ పరిస్థితులు మారుతున్నాయి. ఈ నేపథ్యంలో జనసేన పార్టీని సైతం అదే ఆధునిక స్థాయిలో తీర్చిదిద్దాలని పవన్ గట్టిగా భావిస్తున్నారు. కేవలం పాత పద్ధతుల్లో కాకుండా మారుతున్న టెక్నాలజీ, సోషల్ మీడియా, సరికొత్త ఆలోచన విధానాలకు అనుగుణంగా పార్టీ యంత్రాంగాన్ని మార్పులు చేస్తున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర అధికార ప్రతినిధుల కమిటీని రద్దు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26 మంది నాయకులను వారి బాధ్యతల నుంచి తప్పించారు. నూతన నియామకాలు పూర్తి అయ్యే వరకు టీవీ డిబేట్లు, మీడియా సమావేశాలలో ఎవరూ పాల్గొనవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పార్టీ సంస్థాగత ప్రక్షాళన దిశగా ఈ నిర్ణయం చాలా కీలకమైన అడుగుగా రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్న తరుణంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ సమూల మార్పులు చేపడుతున్నారు. ఇప్పటికే ప్రకాశం అలాగే నెల్లూరు జిల్లాల కమిటీలను రద్దు చేసిన అధినాయకత్వం, పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా కొత్త కమిటీల బాధ్యతలను క్షేత్రస్థాయి క్యాడర్ కు అప్పగిస్తోంది. ఈ వరుస నిర్ణయాల కొనసాగింపుగానే ఇప్పుడు రాష్ట్రస్థాయి అధికార ప్రతినిధుల కమిటీని పూర్తిగా రద్దు చేయడం జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలలో జనసేనకు ప్రాతినిధ్యం వహిస్తున్న 26 మంది అధికార ప్రతినిధుల బాధ్యతలను హైకమాండ్ ఉపసంహరించుకుంది. కొత్త కమిటీల నియామకం జరిగే వరకు మీడియా ముందుకు వచ్చి మాట్లాడకూడదని కఠిన నిబంధనలు పెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి పార్టీని పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయడమే ఈ ప్రక్షాళన ముఖ్య ఉద్దేశం. క్షేత్రస్థాయి నుంచి నాయకులను చురుగ్గా ఉంచడానికి ఈ కఠినమైన నిర్ణయాలు



ఎంతగానో ఉపయోగపడతాయని పార్టీ భావిస్తోంది.జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి యువతకు ఎప్పుడూ పెద్దపీట వేస్తూ వస్తున్నారు పవన్ కళ్యాణ్. అయితే ప్రస్తుత జెన్ జీ ట్రెండ్‌కి తగినట్లుగా పోరాటాలకు సిద్ధంగా ఉండే నాయకత్వాన్ని తయారు చేయాలని కోరుకుంటున్నారు. కొత్త తరపు గొంతుక పార్టీలో స్పష్టంగా వినిపించాలనే లక్ష్యంతో ఈసారి మరింత ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పూర్తిగా ప్రక్షాళన చేసే పనిలో పడ్డ ఆయన కొత్త కమిటీల నియామకం పై సుదీర్ఘంగా కసరత్తు చేస్తున్నారు. ఈసారి కేవలం రాజకీయ నాయకులే కాకుండా చదువుకున్న విద్యాధికులతో పాటు ఐటీ ఉద్యోగులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నారు. అన్ని సామాజిక వర్గాల వారికి తగిన స్థానం కల్పించడం ద్వారా ప్రజల్లోకి బలమైన సంకేతాలు పంపాలని చూస్తున్నారు. వచ్చే నెలలో ఈ కొత్త కమిటీల పూర్తి జాబితాను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. యువత శక్తిని పూర్తిగా వినియోగించుకోవడం ద్వారా పార్టీ భవిష్యత్తును మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో అడుగులు పడుతున్నాయి.దేశ రాజకీయాలను ఇటీవల కాలంలో జెన్ జీ తరహా ఉద్యమాలు ఒక కుదుపు కుదిపేశాయి. ఆ స్ఫూర్తిని దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీలో యువతతో పాటు చదువుకున్న టెక్కీలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించాలని సమాచారం అందుతోంది. ముఖ్యంగా ఐటీ రంగానికి చెందిన నిపుణులు, సామాజిక అంశాలపై పూర్తి అవగాహన ఉన్న యువ నాయకులను ప్రోత్సహించి కీలక బాధ్యతలు అప్పగించాలని ఆలోచిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యం ఇస్తూ సామాజిక సమీకరణాలను సమతుల్యం చేయడమే ఈ కొత్త కమిటీల ప్రత్యేకతగా నిలవనుంది. కేవలం సాంప్రదాయ ధోరణులకు పరిమితం కాకుండా నేటి డిజిటల్ యువతకు సులభంగా అర్థమయ్యే రీతిలో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పవన్ కళ్యాణ్ కోరుకుంటున్నారు. ఈ ఆధునిక విధానం ద్వారా యువత పెద్ద ఎత్తున పార్టీ వైపు ఆకర్షితులు అవుతారని, రాబోయే ఎన్నికలలో ఇది పార్టీ విజయానికి ప్రధాన భూమిక పోషిస్తుందని అంతా భావిస్తున్నారు.మార్పు అనేది ఎప్పుడూ ఒక మంచి పరిణామం అని నమ్మే పవన్ కళ్యాణ్, జనసేన పార్టీలో చేస్తున్న ఈ ప్రక్షాళన భవిష్యత్తు రాజకీయాలకు ఒక దిక్సూచి కానుంది. టెక్నాలజీ యుగంలో దూసుకుపోతున్న నేటి తరానికి తగినట్లుగా పార్టీ యంత్రాంగాన్ని సంస్కరించడం ద్వారా సమాజంలో సరికొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలుకుతున్నారు. అనుభవజ్ఞులైన సీనియర్ల మార్గదర్శకత్వంలోనే ఉంటూనే, నిర్ణయాలు తీసుకునే అధికారంలో యువతకు పెద్దపీట వేయడం ఈ కొత్త కమిటీల ప్రధాన ఉద్దేశం. రాబోయే కాలంలో జరగబోయే ప్రతి ఎన్నికను సవాల్‌గా తీసుకుని కూటమి ప్రభుత్వాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని జనసేన శ్రేణులు ఉత్సాహంగా ఉన్నాయి. త్వరలో ప్రకటించబోయే కొత్త రాష్ట్ర కమిటీ జాబితా రాజకీయ వర్గాలలో పెను మార్పులకు కారణం కానుంది. పవన్ కళ్యాణ్ తీసుకున్న ఈ సాహసోపేతమైన నిర్ణయాలు పార్టీని ఏ విధంగా విజయతీరాలకు చేర్చుతాయనేది వేచి చూడాలి. ఏది ఏమైనా ఈ నిర్ణయం యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపింది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

# గిరిజన పేద ప్రజలకు భూములు పంపిణీ చేయాలి

## గిరిజన సమాఖ్య డిమాండ్, వినతి పత్రం సమర్పణ

**నరసరావుపేట** : వినుకొండ నియోజకవర్గంలోని గల బొల్లాపల్లి మండలం గండి గనుమల గ్రామ సర్వేనెంబర్ 430 లో ప్రభుత్వ బంజర భూమి ఏ 169.80 సెంట్లు కలదు. కొంతకాలం క్రితం గిరిజన, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు తెలియజేసి అర్జీలు ఇవ్వడం జరిగింది. ఈ మేరకు సర్వే చేస్తామని రెవిన్యూ అధికారులు ఇంతవరకు చేపట్టడం లేదని, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో డిఆర్ఓ అధ్దయ్యకు సోమవారం వినతి పత్రం అందజేయడం జరిగింది. గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. శ్రీను నాయక్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ కి అనేకసార్లు అర్జీలు ఇవ్వడం జరిగింది. నేటి వరకు రెవిన్యూ పరంగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చాలా బాధాకరమన్నారు. ఆ భూమి కొంతమేరకు గిరిజన ప్రజలు సాగు చేసుకుంటున్నారు. మరి కొంత భూమి బీడుగా ఉంది. నిరుపేదలైన గిరిజన ప్రజలకు భూ పంపిణీ చేస్తే వారి జీవన భృతికి ఉపయోగ పడుతుందన్నారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమగ్ర సర్వే జరిపి, నిరుపేద గిరిజనులకు భూములు పంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి కోయ శ్రీన, ఉపాధ్యక్షులు పాలపర్తి కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్ నాయకులు బి. రాంబాబు నాయక్, తోపాటు పలువురు పాల్గొన్నారు.

# ఈఎస్ఐ ఆసుపత్రిని 300 పడకల టెర్షియరీ కేర్ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి:ఎంపీ చిన్ని

**ఈఎస్ఐసీ వైద్య కళాశాల ఏర్పాటు చేయాలంటూ ప్రతిపాదన**

**లోక్‌సభలో నియమం--377 కింద విజయవాడ ఈఎస్ఐ ఆసుపత్రి అభివృద్ధి అంశాన్ని ప్రస్తావించిన ఎంపీ కేశినేని శివనాథ్**

**న్యూఢిల్లీ:** విజయవాడ గుణదాలలో ఉన్న ఉద్యోగుల రాష్ట్ర బీమా (ఈఎస్ఐ) ఆసుపత్రిని 300 పడకల టెర్షియరీ కేర్ ఆసుపత్రిగా ఉన్నతీకరించడంతో పాటు అదే ప్రాంగణంలో ఈఎస్ఐసీ వైద్య కళాశాల (**ESIC Medical College**) ఏర్పాటు చేయాలని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం లోక్‌సభలో నియమం--377 కింద ప్రత్యేక అంశంగా ప్రతిపాదించారుఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, 1968లో స్థాపించబడిన విజయవాడ గుణదాల ఈఎస్ఐ ఆసుపత్రి దాదాపు ఆరు దశాబ్దాలుగా పారిశ్రామిక కార్మికులు, ఉద్యోగుల రాష్ట్ర బీమా పథకం లబ్ధిదారులు మరియు వారి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. ప్రస్తుతం ఈ ఆసుపత్రిలో 110 పడకలు మాత్రమే ఉండగా, మధ్య ఆంధ్రప్రదేశ్‌లోని ఎనిమిది జిల్లాలకు చెందిన సుమారు 2.88 లక్షల మంది బీమాదారులు, దాదాపు 10 లక్షల మంది ఆధారిత కుటుంబ సభ్యులు ఈ ఆసుపత్రి సేవలపై ఆధారపడుతున్నారని తెలిపారు.లబ్ధిదారుల సంఖ్య పెరిగినా ఆసుపత్రి సామర్థ్యం పెరగలేదు

గత కొన్నేళ్లుగా ఈఎస్ఐ లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా పెరిగినప్పటికీ ఆసుపత్రి సామర్థ్యం మాత్రం అదే స్థాయిలో కొనసాగుతోందని ఎంపీ పేర్కొన్నారు. అవసరమైన సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో లేకపోవడంతో అనేక మంది రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేయాల్సి వస్తోందని, దీనివల్ల కార్మిక కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడటంతో పాటు చికిత్సలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు.

**సామాజిక భద్రతా నియమావళి--2020తో సేవలపై మరింత డిమాండ్**

సామాజిక భద్రతా నియమావళి--2020 (**Code on Social Security**, 2020) అమలుతో ఉద్యోగుల రాష్ట్ర బీమా పథకం పరిధి మరింత విస్తరించనున్న నేపథ్యంలో భవిష్యత్తులో నాణ్యమైన ఆరోగ్య సేవలపై డిమాండ్ మరింత పెరిగే అవకాశముందని ఎంపీ తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే ఆసుపత్రి మౌలిక సదుపాయాలను విస్తరించడం అత్యవసరమని పేర్కొన్నారు.

**25 ఎకరాల ఖాళీ స్థలం విస్తరణకు అనుకూలం**

విజయవాడ ఈఎస్ఐ ఆసుపత్రి ప్రాంగణంలో దాదాపు 25 ఎకరాల ఖాళీ స్థలం అందుబాటులో ఉందని, అదనపు భూసేకరణ అవసరం లేకుండానే ఆసుపత్రిని విస్తరించే అవకాశం ఉందని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆధునిక వైద్య సదుపాయాలతో కూడిన టెర్షియరీ కేర్ ఆసుపత్రిని నిర్మించాలని కేంద్రాన్ని కోరారు. 300 పడకల ఆసుపత్రి -- ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలి ప్రస్తుతం ఉన్న 110 పడకల ఆసుపత్రిని 300 పడకల టెర్షియరీ కేర్ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు అదే క్యాంపస్‌లో ఈఎస్ఐసీ వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం మరియు ఉద్యోగుల రాష్ట్ర బీమా సంస్థ తక్షణ చర్యలు చేపట్టాలని ఎంపీ లోక్‌సభ ద్వారా విజ్ఞప్తి చేశారు.

# సి.బెలగల్‌ను కరువు మండలంగా ప్రకటించాలి

**సిపిఐ డిమాండ్**

**సి.బెలగల్, ఆగస్టు 3:** కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా, సి.బెలగల్ మండలాన్ని కరువు మండలంగా వెంటనే ప్రకటించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యవర్గ సభ్యులు రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని కోరారు.ఈ మేరకు సోమవారం సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో సి.బెలగల్ తహసీల్దార్ వెంకటలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజు మాట్లాడుతూ కర్నూలు జిల్లా రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన జిల్లాల్లో ఒకటిగా ఉందన్నారు. ముఖ్యంగా సి.బెలగల్ మండలంలో శాశ్వత నీటి వనరులు లేకపోవడంతో రైతులు పూర్తిగా వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడుతున్నారని తెలిపారు.ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నాయని, ఇప్పటికే వేలాది మంది రైతులు తీవ్ర




నష్టాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలపై పెట్టిన పెట్టుబడులు తిరిగి రాక అప్పుల ఊబిలో కూరుకుపోయి, జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రైతుల నుంచి పంటల బీమా ప్రీమియం వసూలు చేయడం అన్యాయమని, పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే పూర్తిగా భరించాలని డిమాండ్ చేశారు. రైతులపై అదనపు ఆర్థిక భారం మోపకుండా ప్రభుత్వం ప్రత్యక్ష సహాయం అందించాలని కోరారు.ప్రభుత్వం వెంటనే కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా గుర్తించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వర్షాలు కురిసిన వెంటనే రైతులు తిరిగి సాగు ప్రారంభించేందుకు ఉచితంగా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని సూచించారు.అదేవిధంగా కరువు ప్రభావంతో పశువులకు మేత కొరత ఏర్పడినందున మూగజీవాలకు పశుగ్రాసం, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని, గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలను పూర్తిగా మాఫీ చేసి, ప్రతి రైతుకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# కాళేశ్వరం భూ గర్భంలో సమస్యలు

**కరీంనగర్, ఆగస్టు 3:**తెలంగాణలో రాజకీయంగా వివాదాస్పద అంశాల్లో ప్రతిష్టాత్మక కాళేశ్వరం ప్రాజెక్ట్ అతిముఖ్యమైనది. భారీ ఖర్చుతో నిర్మించిన ప్రాజెక్టుపై బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మూడేళ్ల నుంచి మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి మరో కీలక విషయం బయటపడింది. ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, మరియు సుందిళ్ల బ్యారేజీల దిగువన భూగర్భంలో అనేక సాంకేతిక లోపాలు ఉన్నట్లు గ్రౌండ్ పెనట్రేటింగ్ రాడార్ పరీక్షలలో తేలింది. బ్యారేజీల కొన్ని వెంట్స్ (నీరు ప్రవహించే మార్గాలు) కింద ఖాళీ ప్రదేశాలు ఏర్పడి నీరు చేరడం (కేవిటీస్), పెద్ద పరిమాణంలో బోల్డర్లు, దెబ్బతిన్న రాతి పొరలు, రాళ్ల దిగువ భాగాన పూడిక పేరుకుపోవడం వంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ఈ జియోఫిజికల్ పరిశీలనల ఆధారంగా పుణెలోని ప్రసిద్ధ కేంద్ర జల, విద్యుత్తు పరిశోధనా సంస్థ డైరెక్టరు సెల్వబాలన్ ఒక సమగ్ర నివేదికను తెలంగాణ నీటిపారుదల శాఖకు పంపారు. 3 బ్యారేజీల దిగువన సుమారు 30 మీటర్ల లోతు వరకు భూగర్భంలో ఉన్న పరిస్థితులు, సీపేజీ మార్గాలు, అనామలీస్ (భిన్నమైన పరిస్థితులు)ను అధ్యయనం చేయడానికి ఈ అధునాతన జీపీఆర్ పరీక్షలను సీడబ్ల్యూపీఆర్ఎస్ నిర్వహించింది. ఈ అధ్యయనంలో భాగముగా మూడు బ్యారేజీల్లోని మొత్తం 225 వెంట్లకు గాను 217 వెంట్స్ వద్ద క్షేత్రస్థాయి అధ్యయనాలు



జరిగాయి. ఈ నివేదికలోని వివరాల ప్రకారం, మేడిగడ్డ బ్యారేజీలోని 7 వెంట్స్ దిగువన అత్యంత తీవ్రమైన అనామలీస్ నమోదయ్యాయి. కీలకమైన మేడిగడ్డలోని 7వ బ్లాక్‌కు చెందిన 17, 18, 19, 20, 21 వెంట్లలోనూ, 8వ బ్లాక్‌లోని 7వ వెంట్‌లోనూ, 5వ బ్లాక్‌లోని 35వ వెంట్‌లోనూ ఈ భూగర్భ లోపాలను గుర్తించినట్లు నివేదికలో తెలిపారు. ఇదే ప్రాజెక్టులోని అన్నారం బ్యారేజీలోని 5వ బ్లాక్‌లో ఉన్న 47వ వెంట్ ఎగువ భాగంలోనూ, సుందిళ్ల బ్యారేజీలో 25, 31, మరియు 53వ వెంట్స్ వద్ద ఎగువ, దిగువ ప్రాంతాలలో సమస్యలు ఉన్నట్లు తేలింది. ఈ 3 బ్యారేజీలలో కలిపి మొత్తం 11 వెంట్స్ కింద మాత్రమే ఎలాంటి సమస్యలు లేదా అనామలీస్ లేవని, మిగతా వాటిలో చిన్న సమస్యలు ఉన్నాయని నివేదికలో వెల్లడించినట్లు సమాచారం. మేడిగడ్డ వద్ద నీటి ఉధృత ప్రవాహాల కారణంగా ఇసుక కొట్టుకుపోయి, రాఫ్ట్ దిగువన పెద్ద ఎత్తున శూన్య ప్రాంతాలు ఏర్పడ్డాయి. 6 వెంట్స్ వద్ద పదికి పైగా విభిన్నమైన అనామలీస్ జోన్లను శాస్త్రవేత్తలు నమోదు చేశారు. ఇటువంటి పరిస్థితులు నీటి అంతర్గత సీపేజ్, పైపింగ్ వంటి ప్రమాదకర పరిణామాలకు దారితీసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అయితే, జీపీఆర్ పరీక్షలు కేవలం భూగర్భ పరిస్థితులను అంచనా వేయడానికి మాత్రమే పరిమితమని, నేరుగా స్ట్రక్చరల్ లోపాలను ఇవి నిర్ధారించలేవని సీడబ్ల్యూపీఆర్ఎస్ స్పష్టం చేసింది. అందువల్ల పునరావాస లేదా మరమ్మతు పనులు ప్రారంభించే ముందు బోర్‌హోల్, కోర్ డ్రిల్లింగ్, ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ టోమోగ్రఫీ వంటి ఇంజినీరింగ్ పరీక్షలు నిర్వహించడం అనివార్యమని సూచించింది.ప్రాజెక్టు బ్యారేజీల నిర్మాణ సమయంలో ముందస్తు భూగర్భ అన్వేషణ పరీక్షలు చేపట్టకపోవడం వల్లే ఈ సమస్యలు ముందుగా గుర్తించలేకపోయినట్లు ఇంజినీరింగ్ టీమ్ పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం ఈ నివేదికను బయటపెట్టడం గానీ, మంత్రులు, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ అధికారులు గానీ కేంద్ర జల, విద్యుత్తు పరిశోధనా సంస్థ ( సీడబ్ల్యూపీఆర్ఎస్) నివేదికపై స్పందిస్తే మరిన్ని విషయాలు బయిటకు వచ్చే అవకాశం ఉంది


# రాజకీయాల కంటే ప్రజల ప్రాణాలు ముఖ్యం

**రోగులకు శాపంగా పెద్దాసుపత్రి.**

**సీ.ఎం.ప్రారంభించిన ఎమ్మారై స్కాన్ పని చేయదు.**

**మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి**

**జయశంకర్ భూపాలపల్లి:**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించాల్సిన జిల్లా జనరల్ ఆసుపత్రి నేడు సమస్యల నిలయంగా మారిందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లోని సమస్యలపై నిత్యం పేపర్లో ప్రచురితమవుతున్న కథనాలు, ప్రజల నుండి వ్యక్తమవుతున్న సమస్యలను తెలుసుకునేందుకు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ...జిల్లా ఆసుపత్రిలో తాగునీటి సమస్య, అపరిశుభ్రమైన వాతావరణం, రోగులకు కనీస సౌకర్యాల లేమి, వైద్య సేవలపై ప్రజల్లో అసంతృప్తి నెలకొందన్నారు.బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి నెలకి రెండు సార్లు విజిట్ చేశాము, ఆసుపత్రికి జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య అధికారులతో మాజీ మంత్రులు హరీష్ రావు కానీ, ఈటెల రాజేందర్ కానీ నిత్యం సమీక్షలు నిర్వహించి జిల్లా ఆసుపత్రి అంటే ప్రజలకు భరోసా, నాణ్యమైన వైద్యం అందించి వారికీ నమ్మకాన్ని కల్పించాము.కరోనా కష్ట సమయంలో ఈ ఆసుపత్రి ఎంతో మందికి చికిత్స అందించాము. కానీ ప్రస్తుతం చిన్న సమస్య వచ్చినా ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఇది జిల్లా జనరల్ ఆసుపత్రా లేక రిఫరల్ సెంటరా అని ప్రశ్నించారు.ఆదివారం వస్తే ఆసుపత్రిలో పూర్తి స్థాయి వైద్య సేవలు అందుబాటులో ఉండవా? అత్యవసర పరిస్థితుల్లో వచ్చే పేద ప్రజలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు..ఐదు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం





చేశారు. తాగునీటి కోసం బయట నుంచి బాటిళ్లలో నీటిని తెచ్చుకుంటున్నామని తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో ట్రాన్స్‌ఫార్మర్ నిరుపయోగంగా పడివుండడం గండ్ర దృష్టికి వచ్చింది. నిరుపయోగంగా మారిన ట్రాన్స్ఫర్మర్ ను పరిశీలించారు,అలాగే టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉండటంతో పాటు కొన్ని టాయిలెట్ గదులకు తాళాలు వేసి ఉండటం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా ఆసుపత్రికి సంబంధించిన సమస్యలు తరచూ వెలుగులోకి వస్తున్నా ప్రభుత్వం, సంబంధిత అధికారులు కానీ,పక్కనే కూత వేటు దూరంలో ఉన్న జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కానీ, స్థానిక ప్రజాప్రతినిధులే కానీ, మన జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు స్పందించడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో కూర్చోని ఎం. ఆర్. ఐ స్కాన్ ప్రారంభించి నెల రోజులు పైనే అవుతున్న సంబంధిత డాక్టర్స్ లేరు,ఇంకా ఎం. ఆర్. ఐ.స్కాన్ సేవలు మొదలు కాలేదు. ప్రజల ఆరోగ్యాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా చూడాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని వీడి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆసుపత్రిలో తాగునీరు, పరిశుభ్రత, అవసరమైన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, మందులు, వైద్య పరికరాలను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా, ఒక్కసారి జిల్లా ఆసుపత్రిని తనిఖీ చేసి ఇక్కడి పరిస్థితులను వెంటనే పరిష్కారం చూపి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. రాజకీయాల కంటే ప్రజల ప్రాణాలు గొప్పవి..జిల్లా ఆసుపత్రిని బలోపేతం చేయండి,ప్రజల ప్రాణాలను కాపాడండి అని ఈ సందర్భంగా కోరారు.

# ఆ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం సంతోషకరం

- మొదటి పేజీ తరువాయి

ఒడిశాలోని నైని కోల్ బ్లాక్, తాడిచర్ల -2 బ్లాక్ సింగరేణి సిగలో చేరిన సందర్భంలో.. PKOC-2 డిప్ సైడ్ బ్లాక్‌ను కూడా సింగరేణికే దక్కేలా చొరవ తీసుకోవాలని కార్మికులు, యూనియన్ లీడర్ల నుంచి డిమాండ్లు వచ్చాయని ప్రస్తావించారు. ౹ాఖుజ-2 డిప్‌సైడ్ బ్లాక్ సింగరేణికి వచ్చే విధంగా అన్నిరకాలుగా బాధ్యత వహించానని తెలిపారు. తాను కేంద్ర మంత్రిగానే కాకుండా తెలంగాణ బిడ్డగా.. సింగరేణి శ్రేయస్సు, అభివృద్ధి, సింగరేణి కార్మికులను ప్రేమించే వ్యక్తిగా ప్రత్యేక కృషి చేశానని చెప్పుకొచ్చారు.

**25 ఏళ్లపాటు ఈ మైన్ నడుస్తుంది..**

తన సహకారం ఫలితంగా సింగరేణి విజయం సాధించడం చాలా సంతోషకరమైన విషయమని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఇవాళ (3 ఆగస్టు, 2026) వేలం ప్రక్రియ పూర్తయిపోయిందని వెల్లడించారు. ఈ విధానంలో సింగరేణి సంస్థకు మణుగూరు ౹ాఖుజ-2 డిప్‌సైడ్ బ్లాక్‌ను కేటాయిస్తున్నట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఉన్న ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థ అయిన సింగరేణి సంస్థ.. ఈ డిప్ సైడ్ బ్లాక్ వల్ల సుమారు 180 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్‌లు ఉన్నాయని వెల్లడించారు. ఈ సంవత్సరానికి 6 మిలియన్ టన్నుల చొప్పున 25 ఏళ్లపాటు ఈ మైన్ నడుస్తుందని స్పష్టం చేశారు.

**2వేల మందికి ఉద్యోగాలు...**

దాదాపు 2వేల మందికి ఉద్యోగాలు వస్తాయని కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఇక్కడ దొరికే +-8 (మంచి క్వాలిటీ) బొగ్గు కారణంగా.. మొత్తం రూ.43వేల కోట్లకు పైగా రెవెన్యూ జనరేట్ అవుతుందని చెప్పుకొచ్చారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.10,500 కోట్లకు మించి ఆదాయం కూడా వస్తుందని వివరించారు. తెలంగాణ ఇంధన భద్రతకు భరోసా దక్కడంతోపాటుగా.. సింగరేణి భవిష్యత్తు అభివృద్ధికి అవసరమైన వనరులు లభిస్తాయని వెల్లడించారు. ప్రభుత్వానికి, సింగరేణికి, విద్యుత్ రంగానికి, ఉద్యోగులకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపుగా రూ.48వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# విద్యా వ్యవస్థ అంత దారుణమా...

- మొదటి పేజీ తరువాయి

నెలకొన్న తీవ్రమైన లోపమే.సాంకేతిక విద్య ఈ స్థాయికి దిగజారడానికి ప్రధాన కారణం విద్యావ్యవస్థ పూర్తిగా వ్యాపారమయం కావడమే. గత కొన్ని సంవత్సరాలుగా పుట్టగొడుగుల్లా వెలిసిన ప్రైవేట్ కళాశాలల్లో తగినంత మౌలిక వసతులు అసలే లేవు. ఆధునిక ప్రయోగశాలలు లేకపోవడం అలాగే అనుభవం ఉన్న నాణ్యమైన అధ్యాపకుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైపు వేగంగా దూసుకుపోతుంటే చాలా కాలేజీలు ఇంకా కాలం చెల్లిన సిలబస్‌నే బోధిస్తున్నాయి. ప్రశ్నాపత్రాలు కేవలం పుస్తకాల్లోని విషయాలను గుడ్డిగా గుర్తుపెట్టుకుని రాసే రీతిలోనే ఉంటున్నాయి. దీనివల్ల విద్యార్థుల్లో సమస్యలను స్వయంగా పరిష్కరించే ధోరణి పూర్తిగా కరువవుతోంది.తల్లిదండ్రులు తమ కష్టపడిన సంపాదనతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే ఫీజు సాయాన్ని కలిపి లక్షల రూపాయలు వెచ్చిస్తున్నారు. పిల్లలను ఎంతో ప్రయాసపడి ఇంజినీరింగ్ చదివిస్తే డిగ్రీ పూర్తయ్యాక ప్రైవేట్ రంగానికి అవసరమైన నైపుణ్యాలు రావడం లేదు. దీనితో నిరుద్యోగ యువత తీవ్ర నైరాశ్యంలోకి వెళ్లిపోతూ చివరకు ప్రభుత్వ ఉద్యోగాల కోసం తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారు. ఇంజినీరింగ్ పాసైన కుర్రాడు కనీసం చిన్న ఉద్యోగానికైనా సరిగ్గా వెళ్లలేకపోతున్నాడనే ఆవేదన పాలకులలో స్పష్టంగా కనిపిస్తోంది. నాయకులు చేసిన తీవ్రమైన వ్యాఖ్యలలో ఎవరి మనోభావాలను కించపరచాలనే ఉద్దేశం లేదు. అక్కడ కనిపిస్తున్నది సమాజం ముందున్న ఒక స్పష్టమైన వాస్తవం.పరిశ్రమల అవసరాలకు తగ్గ ప్రాక్టికల్ నైపుణ్యాలు లేకపోవడం వల్ల యువత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన శిక్షణ లేని కారణంగా కనీసం ఒక చిన్న దరఖాస్తును కూడా సరిగ్గా రాయలేని స్థితిలో విద్యార్థులు బయటకు వస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చడానికి కేవలం విమర్శలు సరిపోవు కానీ సరైన ప్రణాళికలు అవసరం. కాలేజీలు కేవలం మార్కులు అలాగే సర్టిఫికెట్లు ఇచ్చే యంత్రాలుగా మారడం వల్ల సమాజానికి ఒరిగేది ఏమీ లేదు. సాంకేతిక రంగంలో ప్రపంచంతో పోటీపడే అర్హతలను అందించేలా విద్యాప్రమాణాలు పూర్తిగా మారాలి. అప్పుడే యువతకు బంగారు భవిష్యత్తు లభిస్తుంది.ప్రస్తుత తరానికి అర్థమయ్యేలా సులభమైన మంచి తెలుగులో మన విద్యావ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసుకోవాలి. యువత కేవలం డిగ్రీ పత్రాల కోసం కాకుండా నిజమైన నైపుణ్యాలు సంపాదించే దిశగా అడుగులు వేయాలి. ప్రభుత్వం కూడా కాలం చెల్లిన సిలబస్‌ను మార్చి పరిశ్రమలకు కావాల్సిన కోర్సులను కాలేజీల్లో ప్రవేశపెట్టాలి. అప్పుడే ఈ రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి ప్రపంచ వేదికపై గర్వంగా నిలబడగలుగుతాడు. నేటితరం యువతకు కావాల్సింది కేవలం డిగ్రీ కాదు కానీ అద్భుతమైన సృజనాత్మకత. ఈ దిశగా అందరూ కలిసికట్టుగా ఆలోచించి తగిన చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

## అందుబాటులోకి తొలి ప్రైవేట్ ఆయిల్ పామ్

- మొదటి పేజీ తరువాయి

ఈ మెగా ప్రాజెక్టును నిర్మించింది. దాదాపు రూ.300 కోట్ల భారీ పెట్టుబడితో 113.5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ సమీకృత పరిశ్రమను ఈ నెల 20న ప్రారంభించేందుకు సంస్థ సర్వ సిద్ధం చేసింది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సంస్థ ప్రతినిధులు ఇప్పటికే ఆహ్వానించారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 700 మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.ఈ పరిశ్రమలో ఇప్పటికే నర్సరీ కార్యకలాపాలు ముమ్మరంగా సాగుతుండగా.. దాదాపు మూడు లక్షల మొక్కలను పెంచుతున్నారు.ఇందులో భాగంగా ఇప్పటికే 1.40 లక్షల మేలైన మొక్కలను రైతులకు సరఫరా చేశారు. ఈ పరిశ్రమ పరిధి కిందికి సంగారెడ్డి జిల్లాతో పాటు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని 12 మండలాలను ప్రభుత్వం కేటాయించింది. ఈ సరికొత్త ఫ్యాక్టరీతో తెలంగాణలో ఆయిల్‌పామ్ పరిశ్రమల సంఖ్య నాలుగుకు చేరుకోనుంది. ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలోని అప్పారావుపేటలో గంటకు 90 టన్నులు, అశ్వారావుపేటలో గంటకు 30 టన్నులు, సిద్దిపేట జిల్లా నర్మెటలో గంటకు 30 టన్నులతో కర్మాగారాలు నడుస్తుండగా.. అంజనాపురం కర్మాగారం గంటకు 15 టన్నుల సామర్థ్యంతో అందుబాటులోకి వస్తోంది. ఇదే కాకుండా కల్లూరుగూడెం, బీచ్‌పల్లి, ఇంచర్ల, పెద్దరాత్‌పల్లి, సంకిరెడ్డిపల్లి, యాచారంలలో నిర్మాణ దశలో ఉన్న మరో ఆరు కర్మాగారాలను ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.ఈ ప్రాజెక్టులో ఏర్పాటు కానున్న సీడ్ గార్డెన్ దేశానికే తలమానికంగా నిలవనుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా మలేసియా కంపెనీ భాగస్వామ్యంతో గోద్రెజ్ సంస్థ ఈ విత్తన తోటను అభివృద్ధి చేస్తోందని ఆయన తెలిపారు. దీని ద్వారా రైతులకు తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడినిచ్చే హైబ్రిడ్ రకాల విత్తనాలులభిస్తాయని ఇవి అంతర్గత పంటల సాగుకు ఎంతో అనుకూలంగా ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రైవేటు సమీకృత పరిశ్రమ రాకతో తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం మరింత వేగంగాపెరగనుందని ఆయన వెల్లడించారు. సాంప్రదాయ పంటలకు భిన్నంగా అధిక లాభాలను ఇచ్చే వాణిజ్య పంటలను తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు.

## జోగినులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మంత్రి ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, విశిష్ట సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల జాతరను ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిందని తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కాస్త ఒత్తిడి పెరిగినప్పటికీ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో సేవలందించారని కొనియాడారు. జోగినులకు సమాజంలో తగిన గుర్తింపు కల్పించే దిశగా ప్రభుత్వం సానుకూలంగా అడుగులు వేస్తోందని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో జోగినులను మున్సిపాలిటీల్లో కో-ఆప్షన్ సభ్యులుగా నియమించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో దేవాదాయ, హోం, మున్సిపల్ శాఖల సమన్వయంతో బోనాల ఏర్పాట్లను మరింత వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. జోగినులకు అధికారిక గుర్తింపు కల్పించడంపై సంబంధిత శాఖ మంత్రితో చర్చించి త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తామని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## కుంభవృష్టి ఖాయం, ప్రాణనష్టం తప్పదు..

- మొదటి పేజీ తరువాయి

నా మాట మీరు వినడం లేదు. ఇది నాకు ఆగ్రహం తెప్పిస్తోంది. ఈ ఏడాది కుంభవృష్టి రూపంలో భారీ వర్షాలు కురుస్తాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. అగ్నిప్రమాదాలు కూడా సంభవిస్తాయని, వాటి వల్ల ప్రాణనష్టం ఎక్కువగా ఉంటుంది. ప్రజలు వావివరసలు మరిచి ప్రవర్తిస్తున్నారు. ఘోరాలు చేస్తున్నారు. వారిని నేను వదిలిపెట్టను" అని చెప్పారు.తనకు ఇచ్చిన మాట ప్రకారం రాబోయే ఆరు నెలల్లోగా విగ్రహ ప్రతిష్ఠ పూర్తి చేయాలని అమ్మవారు ఆదేశించారు. అలా చేయని పక్షంలో భారీ ప్రాణనష్టం జరిపిస్తానని హెచ్చరించారు. "నాకు అడ్డు వచ్చిన వాళ్లను పాదాల కింద వేసి నలిపేస్తా. మీరు గాలికి వదిలేసిన పిల్లల్ని నేను కాపాడుతా. కానీ మీరు నన్ను నిరుత్సాహపరుస్తున్నారు" అంటూ స్వర్ణలత అమ్మవారి వాణిని వినిపించారు. అంతకుముందు నిన్న తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే లష్కర్ బోనాల జాతర అత్యంత వైభవంగా ప్రారంభమైంది. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలతో సందడిగా మారింది. ప్రతి ఏటా రంగంలో వెలువడే భవిష్యవాణికి భక్తులు ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. ఈసారి అమ్మవారి హెచ్చరికలు భక్తుల్లో చర్చనీయాంశంగా మారాయి.

## నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రోబోటిక్ శస్త్రచికిత్సలు పూర్తి

- మొదటి పేజీ తరువాయి

చెప్పుకొచ్చారు. వైద్య రంగంలో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు సాధించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.

**ప్రభుత్వాస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలు: దామోదర**

నిమ్స్‌లో రెండున్నరేళ్లలో 1,000 రోబోటిక్ సర్జరీలు పూర్తి అయ్యాయని తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ ( వ్యాఖ్యానించారు. ఈరోజు (సోమవారం) రాష్ట్ర సచివాలయంలో నిమ్స్ వైద్య బృందం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వారిని మంత్రి దామోదర అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పటికే 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను నిమ్స్ పూర్తి చేసిందని వెల్లడించారు.దక్షిణ భారత ప్రభుత్వ రంగంలో తొలి రోబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌ను నిమ్స్ చేసిందని మంత్రి దామోదర చెప్పుకొచ్చారు. 90 శాతానికి పైగా రోబోటిక్ సర్జరీలు ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా ఉచితమని తెలిపారు. యూరాలజీలో 590, గ్యాస్ట్రోలో 248, ఆంకాలజీలో 162 రోబోటిక్ సర్జరీలు జరుగుతాయని వివరించారు. ఎంఎన్‌జేలోనూ విజయవంతంగా రోబోటిక్ సర్జరీలు నిర్వహిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. కొత్త టిమ్స్, గాంధీ, ఉస్మానియాలో రోబోటిక్ ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తెస్తున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

## అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి మోసం చేశారు..

- మొదటి పేజీ తరువాయి

యువకుడు సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యాయత్నం చేసుకుంటే భట్టి ఎందుకు స్పందించరని ప్రశ్నల వర్షం కురిపించారు. 16,979 ఉద్యోగాలు ఇచ్చామని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చెప్పిందన్నారు. తమ హయాంలో 2లక్షల 32వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామని ప్రస్తావించారు.

**రేవంత్‌రెడ్డికి సప్లిమెంటరీలో పాస్ కావడం అలవాటు..**

ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను పట్టుకుని సీఎం రేవంత్‌రెడ్డి క్రిమినల్ వేస్ట్ అంటే రాహుల్ గాంధీలో ఎందుకు ఎలాంటి చలనం లేదని మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. ఐటీ రంగంలో ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రపంచంలో రాణిస్తున్నారని వ్యాఖ్యానించారు. 83 క్రిమినల్ కేసులు ఉన్న రేవంత్‌రెడ్డిని సీఎం చేయడం క్రిమినల్ వేస్ట్ కాదా అని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ.. రేవంత్‌రెడ్డిని నమ్మడం క్రిమినల్ వేస్ట్ అని వ్యంగ్యంగా అన్నారు. రేవంత్‌రెడ్డికి సప్లిమెంటరీలో పాస్ కావడం అలవాటని విమర్శించారు. ఎమ్మెల్యేగా ఓడిపోతే సప్లిమెంటరీలో రేవంత్‌రెడ్డి ఎంపీ అయ్యారని చెప్పుకొచ్చారు.

వార్తాతరంగాలు

మంగళవారం 04 ఆగస్టు 2026

## నిజామాబాద్ ఆరోగ్య సేవలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష.. కీలక ఆదేశాలు



**నిజామాబాద్, ఆగస్టు 3:** జిల్లాలో ఆరోగ్య సేవల పనితీరుపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సచివాలయంలో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులతో పాటు జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీ, జనరల్ ఆస్పత్రి పనితీరు, రోగులకు అందుతున్న వైద్య సేవలు సహా సిబ్బంది అందుబాటు, అత్యవసర సేవల నిర్వహణ వంటి అంశాలపై మంత్రి విస్తృతంగా చర్చించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీలు), కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు(సీహెచ్‌సీలు), సబ్ సెంటర్ల ద్వారా ప్రజలకు అందుతున్న సేవల నాణ్యత, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల విస్తరణపై అధికారులను ప్రశ్నించి అవసరమైన సూచనలు చేశారు.జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల మౌలిక వసతుల అభివృద్ధి, కొత్త భవనాల నిర్మాణం, వైద్య పరికరాల అందుబాటు, అవసరమైన సిబ్బంది నియామకం, పెండింగ్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నిజామాబాద్ ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ఆరోగ్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా అధికారులు కృషి చేయాలని ఆయన స్పష్టం చేశారు.

## భాగ్యనగర వాసులకు రెయిన్ అలర్ట్..

### భారీ వర్షాలు కురిసే ఛాన్స్



**హైదరాబాద్, ఆగస్టు 3 :** భాగ్యనగరవాసులకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ అలర్ట్ జారీ చేశారు. ఈరోజు (సోమవారం) రాత్రి వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందని పేర్కొన్నారు. ఈనేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు.బయట ఉన్నవారు వెంటనే పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలని సీపీ సజ్జనార్ తెలిపారు. నీరు నిలిచిన రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ప్రయాణాలు చేయొద్దని హెచ్చరించారు. ముంపు ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించారు. వాహనదారులు వేగం తగ్గించి జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

### కాంగ్రెస్ తో కటీఫ్...

## మల్లన్న యాక్షన్ ప్లాన్ రెడీ



**హైదరాబాద్, ఆగస్టు 3:** చింతపండు నవీన్ కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్న ఇప్పుడు తన రాజకీయ ప్రయాణంలో అత్యంత కీలకమైన సవాలును ఎదుర్కొంటున్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన వరంగల్ ఖమ్మం నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం ఆ పార్టీతో తెగదెంపలు చేసుకుని సొంత రాజకీయం మొదలుపెట్టారు.వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న తన పదవీకాలం ముగిసేలోపు మళ్లీ అదే స్థానం నుంచి స్వతంత్ర వేదిక ద్వారా గెలవాలనే లక్ష్యంతో సుదీర్ఘ పాదయాత్రకు రూపకల్పన చేస్తున్నారు. ఈ కొత్త నిర్ణయం ఆయన భవిష్యత్తును పూర్తిగా మార్చే అవకాశం ఉంది.గతానికి ఇప్పటికి మల్లన్న పొలిటికల్ ఇమేజ్‌లో చాలా స్పష్టమైన మార్పు వచ్చింది. ఒకప్పుడు తీన్మార్ మల్లన్న అంటే డిజిటల్ మీడియా ద్వారా ప్రభుత్వాలను అక్రమాలను ప్రశ్నించే హార్డ్‌కోర్ వాయిస్‌గా యూత్‌లో విశేషమైన ఆదరణ ఉండేది. ఆ ప్లాట్‌ఫామ్ తెచ్చిపెట్టిన క్రేజ్‌తోనే ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినప్పుడే లక్షలాది ఓట్లు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆ తదనంతరం కాంగ్రెస్‌లో చేరి ప్రత్యర్థులను తట్టుకుని ఎమ్మెల్సీ పీఠాన్ని అధిరోహించగలిగారు. కానీ కాలక్రమేణా ఆయన అనుసరించిన విధానాలు మారడంతో ప్రజల్లో ఆయనపై ఉన్న సానుకూల దృక్పథం నెమ్మదిగా కరిగిపోతూ వచ్చింది.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత ఆయన ఎంచుకున్న రాజకీయ దారి ఆయన పునాదులనే కదిలించిందనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. బీసీ ఐక్యత పేరుతో కొన్ని వర్గాలను ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తూనే ఇతర కులాలను సమాజంలోని కొన్ని విభాగాలను తీవ్రంగా విమర్శిస్తూ వ్యాఖ్యలు చేశారు. ఈ చర్యలు ఆయనకున్న న్యూట్రల్ ఎడ్యుకేటెడ్ ఓటర్ బేస్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. విద్యావంతులు గ్రాడ్యుయేట్లు ఓటేసే ఎమ్మెల్సీ నియోజకవర్గంలో వ్యక్తిగత దూషణల కంటే ఉద్యోగ ఉపాధి అవకాశాలకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తారు. ఈ క్రమంలో మల్లన్న తన పాత ఇమేజ్‌ను పోగొట్టుకుని దారి తప్పిన నాయకుడిగా మిగిలిపోయారనే విమర్శలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి.రాబోయే ఎన్నికల్లో ఆయనకు కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలం ఓటు బ్యాంకు అండగా ఉండవు. ప్రధాన పార్టీలు ఈ విస్తృత నియోజకవర్గంపై పట్టు సాధించేందుకు క్షేత్రస్థాయి నుంచి పక్కా వ్యూహాలు అమలు చేస్తున్నాయి. కాంగ్రెస్ వైపు నుంచి అధికారిక అభ్యర్థి బరిలో ఉంటారు కాబట్టి పోటీ మరింత తీవ్రంగా ఉంటుంది. ఇలాంటి త్రిముఖ లేదా చతుర్ముఖ పోరులో కాంగ్రెస్ ఓటు బ్యాంక్ లేకుండా కేవలం సొంత ఇమేజ్‌తో బరిలోకి దిగడం పెద్ద సాహసమే. అందుకే పాదయాత్ర ద్వారా మళ్లీ జనం లోకి వెళ్లి కోల్పోయిన నమ్మకాన్ని పునరుద్ధరించుకోవాలని ఆయన తీవ్రంగా భావిస్తున్నారు.పాదయాత్రలు చేయడం తేలికే అయినా పట్టభద్రుల మైండ్ సెట్‌ను మార్చడం మల్లన్నకు అంత సులభం కాకపోవచ్చు. ఒకవేళ పాదయాత్ర చేసినా కూడా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఓట్లు సాధించలేకపోతే గత కొన్నేళ్లుగా ఆయన చుట్టూ ఉన్న పొలిటికల్ హడావుడి ప్రహసనంలా మారుతుంది. తన పాత ఇమేజ్‌ను తిరిగి తెచ్చుకుని విద్యావంతులను మెప్పించే సరైన అజెండాతో వస్తే తప్ప రాబోయే ఎన్నికల పోరు ఆశాజనకంగా ఉండే అవకాశం లేదు. లేకపోతే ఆయనను పట్టించుకునే వారే కరువవుతారు.

### కాక్రోచ్ తరహాలో

# క్రిమినల్ వేస్ట్ పార్టీ?

**హైదరాబాద్, ఆగస్టు 3:** తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల ఉద్యోగార్హతలు, స్కిల్స్ లోపంపై మాట్లాడుతూ చేసిన క్రిమినల్ వేస్ట్ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర తుఫాను రేపాయి. ఏటా 1.10 లక్షల మంది ఇంజినీరింగ్ పట్టాలు పొందుతున్నా కనీసం ఒక ఉద్యోగ దరఖాస్తు కూడా సొంతంగా నింపలేకపోతున్నారని, ఇది విద్యావ్యవస్థ పరిధిలో క్రిమినల్ వేస్ట్ అని ఆయన వ్యాఖ్యానించడం విమర్శలకు దారితీసింది. ఈ కామెంట్లపై ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ తో పాటు బీజేపీ నేత ఈటల రాజేందర్ వంటి వారు యువతను కించపర్చారని రేవంత్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీష్ రెడ్డిలు రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. సీఎం వెంటనే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రొఫెషనల్ అర్హతలు, కనీస పోటీ పరీక్ష రాసిన అనుభవం లేని సీఎం యువత ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని ఆరోపిస్తూ, జెన్-జీ యువత , ఇంజినీరింగ్ విద్యార్థులు ఈ వ్యాఖ్యలపై తిరగబడాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. డిజిటల్ మాధ్యమాల్లో రేవంత్ వ్యాఖ్యలపై విద్యార్థుల నిరసనను ఒక రాజకీయ ఉద్యమంగా మార్చేందుకు బీఆర్ఎస్, బీజేపీ సోషల్ మీడియా విభాగాలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి.తాజాగా సోషల్ మీడియాలో కాక్రోచ్



అనే పదాన్ని ఒక విమర్శగా ఉపయోగించినప్పుడు, దాన్ని ప్రతిఘటిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ ఎలా పుట్టుకొచ్చిందో, సరిగ్గా అలాగే ఇప్పుడు రేవంత్ వ్యాఖ్యలను రీ-బ్రాండ్ చేస్తూ క్రిమినల్ వేస్ట్ అనే ట్యాగ్‌ను విద్యార్థులు ఒక నిరసన చిహ్నంగా మలుచునేలా చేసేందుకు రాజకీయ పార్టీలు ప్రోత్సాహం ఇస్తున్నాయి. మేము క్రిమినల్ వేస్ట్ కాము.. నవ తెలంగాణ నిర్మాతలము అనే హ్యాష్‌ట్యాగ్‌లు, మీమ్‌లు, షార్ట్ వీడియోలతో జెన్-జీ తీవ్రస్థాయిలో రీ-కౌంటర్లు ఇస్తోంది. ఈ భావోద్వేగాన్ని ప్రతిపక్షాలు క్యాష్ చేసుకోవడానికి క్రిమినల్ వేస్ట్ పార్టీ పెట్టేలా యువజన సమూహాలను ఆన్‌లైన్ వేదికగా ప్రోత్సహించేందుకు సిద్ధమవుతున్నాయి.భారత రాజకీయాల్లో ముఖ్యంగా పొలిటికల్ మీమ్‌లతో ఆడుకునే ప్రస్తుత జెన్-జీ తరం ఎప్పటికప్పుడు సరికొత్త నెరేటివ్‌లను సృష్టిస్తుంది. ఒక వివాదాస్పద పదాన్ని పట్టుకుని దాన్నే ఒక ఐడెంటిటీగా మార్చుకోవడం గ్లోబల్ డిజిటల్ ట్రెండ్. గతంలో కేటీఆర్, ఇతర నేతలు ఉపయోగించిన పదాలను కాంగ్రెస్ ట్రోల్ చేయగా, ఇప్పుడు కాంగ్రెస్ సీఎం వ్యాఖ్యలను బీఆర్ఎస్ అస్త్రంగా మార్చుకుంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై విద్యార్థులు ఆత్మగౌరవ నిరసనలు తెలుపడానికి ప్రతిపక్ష పార్టీలు వెనకుండి బ్యాకింగ్, టెక్నికల్ సపోర్ట్, ట్రెండింగ్ ప్రోత్సాహాన్ని అందించడం ఖాయంగా కనిపిస్తోంది.అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు ఉద్దేశం విద్యాసంస్కరణలేనని కాంగ్రెస్ వర్గాలు సమర్థిస్తున్నాయి. డిగ్రీలు ఉన్నా స్కిల్స్ లేని విద్యార్థులను తీర్చిదిద్దడానికి జర్మనీ, ఫిన్లాండ్ మోడల్స్‌లో మొదటి రెండేళ్లు బేసిక్ విద్య, చివరి రెండేళ్లు ప్రాక్టికల్ విదేశీ లాంగ్వేజెస్, అప్రెంటిస్‌షిప్ నైపుణ్యాలు ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమనివారు పేర్కొంటున్నారు. అయితే, విధానపరమైన లోపాన్ని ఎత్తిచూపే క్రమంలో వాడిన క్రిమినల్ వేస్ట్ అనే పదం కమ్యూనికేషన్ ఫెయిల్యూర్‌గా మారి, రాజకీయ ప్రత్యర్థులకు రాజకీయ ఆయుధంగా మారింది. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు జెన్-జీ అసంతృప్తిని క్రిమినల్ వేస్ట్ ఉద్యమంగా మార్చేందుకు ఎంత ప్రయత్నించినా, అది ఎంతకాలం మనుగడ సాగిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# రంగనాథ్‌ను తప్పిస్తారా !

**హైదరాబాద్, ఆగస్టు 3:** హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణల తొలగింపు లక్ష్యంగా ఏర్పాటైన హైడ్రా చుట్టూ న్యాయపరమైన ముళ్లకంప అల్లుకుంటోంది. కేవలం ఒక్క రోజు వ్యవధిలోనే లేదా ఒకరి తర్వాత ఒకరుగా ఏకంగా ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులు ఈ ఏజెన్సీ తీరుపై, దాని అధిపతి ఐపీఎస్ అధికారి ఎ.వి. రంగనాథ్ వైఖరిపై తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేయడం రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తోంది. బుల్డోజర్ సంస్కృతి, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలకు దిగడం, కోర్టు ఆదేశాలను బేఖాతరు చేయడం వంటి చర్యలపై న్యాయస్థానం చేసిన ఘాటు వ్యాఖ్యలు హైడ్రా భవిష్యత్తును ప్రశ్నార్థకంలోకి నెట్టాయి.లోతుకుంట భూ వివాదానికి సంబంధించిన కోర్టు ధిక్కరణ కేసులో రంగనాథ్‌ను వెంటనే పదవి నుంచి తప్పించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశించినంది. హైడ్రా ను పౌరాణిక రాక్షస మృగంతో పోల్చిన న్యాయమూర్తి, తమను తాము సూపర్ కాప్స్ గా భావించుకోవడం చెల్లదని స్పష్టం చేశారు. కేవలం ఈ ఒక్క బెంచ్ మాత్రమే కాకుండా, ఇతర న్యాయమూర్తులు కూడా వేర్వేరు పిటిషన్లపై విచారణ సందర్భంగా నోటీసులు ఇవ్వకుండా చేపడుతున్న ఆకస్మిక చర్యలను, విచారణాధికారాల అతిక్రమణను తీవ్రంగా తప్పుబట్టారు. స్వయంగా కమిషనర్ రంగనాథ్ దాదాపు 62 కోర్టు ధిక్కరణ కేసుల్లో నిందితుడిగా ఉండటం న్యాయవ్యవస్థ తీవ్రంగా పరిగణించిన అంశంగా మారింది.హైడ్రా చేపట్టిన ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన డ్రీమ్ ప్రాజెక్టుగా, బ్రాండ్ హైదరాబాద్ పునరుద్ధరణగా ప్రచారం చేసుకున్నారు. ప్రారంభంలో ప్రజల నుంచి, పర్యావరణ వేత్తల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించినప్పటికీ, రోజువారీ కార్యకలాపాల్లో చట్టబద్ధమైన ప్రక్రియను పాటించకపోవడమే ప్రస్తుతం ఏజెన్సీకి గొడ్డలిపెట్టుగా మారింది. ప్రతిపక్షాల విమర్శల కంటే కూడా, న్యాయస్థానాలు వరుసగా ఇస్తున్న ప్రతికూల తీర్పులు, వ్యాఖ్యలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రాజకీయంగా, పాలనాపరంగా పెద్ద సవాలుగా పరిణమించాయిహైకోర్టు ఏకంగా సీఎస్‌ను ఉద్దేశించి న్యాయసమ్మతమైన ఆదేశాలను గౌరవించే అధికారిని నియమించండి అని స్పష్టమైన సూచన చేయడంతో ఇప్పుడు బంతి రేవంత్ రెడ్డి కోర్టులోకి చేరింది. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేసి రంగనాథ్‌ను అదే పోస్టులో కొనసాగిస్తే, అది ప్రభుత్వం , న్యాయవ్యవస్థ మధ్య మరింత ఘర్షణ వాతావరణానికి దారితీసే ప్రమాదం ఉంది. అంతేకాకుండా, ప్రభుత్వం ఆశించిన హైడ్రా అసలు లక్ష్యం పక్కదారి పట్టి, కేవలం చట్టవిరుద్ధమైన ఏజెన్సీగా ముద్రపడే ప్రమాదముంది. ఈ పరిణామాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరితగతిన నిర్ణయం తీసుకునే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎ.వి. రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించి, మరొక అధికారికి బాధ్యతలు అప్పగించడం ద్వారా కోర్టు ఆదేశాలను గౌరవించినట్లవుతుందని, అలాగే ఏజెన్సీపై పడిన మరకను చెరిపేసి చట్ట పరిధిలోనే ఆక్రమణలపై చర్యలు కొనసాగించవచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. రాబోయే రెండు మూడు రోజుల్లో హైడ్రా నాయకత్వ మార్పుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**రంగనాథ్ పనులకు ఫుల్ పబ్లిసిటీ**

హైదరాబాద్ నగరంలో చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు లక్ష్యంగా ఏర్పాటైన హైడ్రా చేపట్టిన సంస్కరణల సత్ఫలితాలు ఇప్పుడు క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు దుర్గంధంతో అలమటిస్తూ, ఆక్రమణల కోరల్లో చిక్కుకుని మురుగు నీటి కుంటలా మారిన ఉప్పల్ నల్లచెరువు'.. నేడు కన్నులపండువగా, ఆహ్లాదకరమైన వాతావరణంతో పునరుజ్జీవం పోసుకుంది. చెరువును ఆధునీకరించి, సుందరీకరించిన తీరుపై ఉప్పల్ నివాసితులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల నుంచి హైడ్రా కమిషనర్ రంగనాథ్ , సిబ్బందిపై ప్రశంసల వర్షం కురుస్తోంది.కొన్నేళ్లుగా నల్లచెరువు పరివాహక ప్రాంతాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు వేయడం, ప్లాస్టిక్ చెత్తతో నింపేయడం, అక్రమ నిర్మాణాలు వెలియడంతో చెరువు తన అస్తిత్వాన్ని కోల్పోయే స్థితికి చేరింది. వర్షం వస్తే చాలు పరిసర కాలనీలైన పీసీఎస్ కాలనీ, ఉప్పల్ ప్రధాన రహదారులు జలమయమయ్యేవి. ఈ పరిస్థితిని తీవ్రంగా పరిగణించిన హైడ్రా, జీహెచ్ఎంసీతో కలిసి సమగ్ర



కార్యాచరణను చేపట్టింది. చెరువు పరిధిలోని అక్రమ నిర్మాణాలను తొలగించడమే కాకుండా, టన్నుల కొద్దీ పూడిక, చెత్తాచెదారాన్ని స్వల్పకాలంలోనే తొలగించి చెరువు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచింది.చెరువులోకి మురుగునీరు నేరుగా చేరకుండా డైవర్షన్ ఛానెళ్లను ఏర్పాటు చేసి, గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించారు. చెరువు కట్టను బలపరిచి దాని చుట్టూ వాకింగ్ ట్రాక్, విద్యుత్ దీపాలు, సందర్శకుల కోసం సుందరమైన బెంచీలు, పచ్చదనంతో కూడిన ల్యాండ్‌స్కేపింగ్‌ను తీర్చిదిద్దారు. సాయంత్రం వేళల్లో ఉప్పల్ వాసులు, చిన్నారులు, వృద్ధులు ప్రశాంతంగా గడిపేందుకు ఈ ప్రాంతం ఒక అద్భుతమైన వాకింగ్ అండ్ రీక్రియేషన్ స్పాట్ గా రూపాంతరం చెందింది.హైడ్రా పనుల పుణ్యమా అని దుర్గంధం, దోమల బెడద నుంచి విముక్తి లభించిందని, ఆస్తి విలువలు కూడా పెరిగాయని స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా చెరువు బిఫోర్ -- ఆఫ్టర్ వీడియోలు, ఫోటోలు విపరీతంగా వైరల్ అవుతున్నాయి. కేవలం కూల్చివేతలకే పరిమితం కాకుండా.. ప్రజాధనం వృథా కాకుండా చెరువులను పునరుద్ధరించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో హైడ్రా తన ప్రత్యేక ముద్రను వేసిందని నెటిజన్లు, ఉప్పల్ వాసులు కొనియాడుతున్నారు.

### ఇప్పుడు అదిలాబాద్

## ఎయిర్ పోర్టు క్రెడిట్ వార్

**అదిలాబాద్, ఆగస్టు 3:** ఏపీలో భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ప్రారంభం కాగా, దీనిపై కూటమి ప్రభుత్వం, వైఎస్సార్ సీపీ ఇది తమ ఘనతేనని క్లెయిమ్ చేస్తున్నాయి. తమ హయాంలోనే దాదాపు ఎయిర్ పోర్ట్ పనులుపూర్తికాగా, సీఎం చంద్రబాబు ఫినిషింగ్ వర్క్ పూర్తి చేశారని వైసీపీ అంటోంది. తాము ఏది సాధించినా క్రెడిట్ తమ ఖాతాలో వేసుకోవడం వైసీపీకి అలవాటు అయిందంటూ కూటమి నేతలు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ విషయంలోనూ క్రెడిట్ గేమ్ మొదలైంది. సాధించింది తామేనని బీజేపీ నేతలు చెబుతంటే, బీజం వేసింది తానేనని, మంజూరు చేసింది కాంగ్రెస్ పార్టీ అని మాజీ ఎంపీ సోయం బాపూరావు వ్యాఖ్యానించారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ మంజూరు, పనులకు అనుమతులపై మాజీ ఎంపీ సోయం బాపూరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిలాబాద్ లో ఎయిర్ పోర్ట్ మంజూరు చేసింది కాంగ్రెస్ పార్టీనే అని, దానికి గతంలో బీజం వేసింది తానేనని అన్నారు. ఆదిలాబాద్ జిల్లా మావల మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు హాజరయ్యారు. ముందుగా గ్రామనికి చేరుకున్న నాయకులకు స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం పార్టీ బలోపేతం కోసం దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పార్టీ శ్రేణఉలకు పిలుపునిచ్చారు.మాజీ ఎంపీ సోయం బాపూరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కృషితో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నాలతో ఆదిలాబాద్ జిల్లా కు ఎయిర్ పోర్ట్ మంజూరు అయ్యిందన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడే ఆదిలాబాద్ జిల్లాకు విమానాశ్రయం కోసం అప్పటి కేంద్ర మంత్రులకు ప్రధానికి వినతిపత్రాలు ఇచ్చానని, అంటే ఈ ఎయిర్‌పోర్ట్ కోసం ముందస్తుగా బీజం వేసింది తానేనని గుర్తు చేశారు. దానికి సాక్షం బీజేపీ ఎమ్మెల్లే పాయల్ శంకర్ అన్నారు. కానీ స్థానిక ఎమ్మెల్లే, బీజేపీ నాయకులు తామే ఆదిలాబాద్ కు విమానాశ్రయం తెచ్చింది తామేనని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీ చేస్తే స్థానిక ఎమ్మెల్లే శంకర్ తానే చేస్తున్నానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ రేషన్ కార్డులు ఇచ్చిందని, రైతులకు రుణమాఫీ చేసిందన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ప్రయాణం కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని దీన్ని పార్టీ కార్యకర్తలు ప్రజల వద్దకు తీసుకెళ్లి వివరించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యేను ఓడగొట్టడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కార్యకర్తలు సైనికుల్లా పని చెయ్యాలని పిలుపునిచ్చారు

## 15న తిరంగా ర్యాలీ

స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అఖండ భారత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15 న తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ర్యాలీకి సంబంధించిన పోస్టర్ ను బిజెపి నాయకురాలు కీర్తి రెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు సెంథిల్ కుమార్, బిందు లు ఆవిష్కరించారు. యువతలో జాతీయ భవాని పెంపొందించేందుకు ర్యాలీని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పెరేడ్ గ్రౌండ్ నుంచి ప్రారంభమై గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల మీదుగా రాలి కొనసాగి కరీంనగర్ లో ముగుస్తుందని చెప్పారు. కులమతాలకు అతీతంగా యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## నిరుద్యోగుల మెరుపు సమ్మె

**హైదరాబాద్:** ఇందిరా పార్క్ చౌరస్తాలో నిరుద్యోగులు ల మెరుపు ధర్నాకు దిగారు. 7,437 పోస్టులతో కాకుండా 19 వేల పోలీస్ ఉద్యోగాలకు మరో నోటిఫికేషన్ విడుదల చేయాలి . పోలీస్ ఉద్యోగాల వయోపరిమితి పెంచాలంటూ డిమాండ్ చేసారు. నోటిఫికేషన్ ఆలస్యంతో వేలాది మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయారని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. పోలీస్ నోటిఫికేషన్లో కానిస్టేబుల్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని 36 సంవత్సరాలకు, ఎస్సై పోస్టులకు 38 సంవత్సరాలకు పెంచాలని నిరుద్యోగులు డిమాండ్ చేసారు. దరఖాస్తు రుసుమును వెంటనే తగ్గించాలని, తమ డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నిరుద్యోగుల హెచ్చరించారు.

# ఆగస్టు 10న జైల్ భరోను జయప్రదం చేయండి..

## కార్మిక రైతు వ్యవసాయకార్మిక సంఘాల పిలుపు

**దేవరకద్ర అమరచింత ఆగస్టు 3 (స్కై న్యూస్);** అమరచింత మండలకేంద్రం లోని జి యస్. భవనశీ లో సోమవారంమండలసదస్సు మున్సిపల్ కార్యదర్శి ఎమ్.ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. సి ఐ టి యు జిల్లా అధ్యక్షులు. ఆ ర్. ఎన్. రమేష్. వ్యవసాయకార్మిక సంఘశీ జిల్లా అధ్యక్షులు యస్. అజయ్. రైతు సంఘశీ జిల్లా కోశాధికారి బి. వెంకటేష్ లు మాట్లాడుతుకేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక కర్షక వ్యతిరేక విధానాలకు కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న దేశవ్యాప్తంగా జరుగుజైల్ భరో కార్యక్రమాన్ని వనపర్తి జిల్లాలో కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలను వేలాదిగా సమీకరించి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం సామ్రాజవాదులకు లొంగిపోయి అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను ప్రధానంగా మక్కజొన్నలు, పత్తి,పాలు,చేపలు జీరో టాక్స్ తోని దేశంలోకి దిగుమతి చేసుకోవడానికి అంగీకరించడం దేశ రైతాంగం ప్రయోజనాలకు విగాతం కలిగించడమే కాక వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు ధరాదత్తం చేయడం కోసం కుట్ర పన్నుతున్నాడని వారు విమర్శించారు. ఈ విధానాలను విరమిశీ చు కోనట్లైతే రైతాంగం అగ్రహానికి మోడీ ప్రభుత్వం గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. అదేవిధంగా కార్మికులు అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న 29 చట్టాలను



కుదించి పారిశ్రామిక యజమానులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడులుగా తీసుకురావడం దుర్మార్గమని అన్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసి జి రామ్ జి పేరుతోని కేంద్ర ప్రయోజిత పథకం తీసుకురావడం గ్రామీణ పేదల పొట్ట కొట్టడమేనని ఆయన విమర్శించారు. మోడీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దరాదత్తం చేయడం కోసం చాలా చురుకుగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నదని అన్నారు. దేశంలోని ఘనులు, అడవులు, ప్రకృతి వనరులను ఇప్పటికే కార్పొరేట్ శక్తులకు పెద్ద ఎత్తున కట్టబెట్టారు. విద్యుత్తును కూడా ఆదానీ, అంబానీ లాంటి పారిశ్రామికవేత్తలకు అప్పజెప్పే కుట్రలో భాగంగానే విద్యుత్ బిల్లును తీసుకొచ్చాడని ఆయన విమర్శించారు. పేదలకు రైతాంగానికి మొత్తం రాష్ట్ర ప్రయోజనాలకే విఘాతం కలిగించే విద్యుత్ బిల్లును వ్యతిరేకించవలసిన రాష్ట్ర ప్రభుత్వము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రం అడుగులకు మడుగులొత్తడానికి పూనుకొని విద్యుత్ బిల్లును రాష్ట్రంలో అమలు చేయడం కోసశీ ప్రయత్నం చేస్తున్నాడని అందులో భాగమే రాష్ట్రంలో మూడవ డిస్కం తీసుకొస్తున్నాడని అన్నారు. ఈ విధంగా రైతులు పారిశ్రామిక కార్మికులు వ్యవసాయ కూలీల ప్రయోజనాలను దెబ్బ కొట్టి పెట్టుబడిదారుల ఖజానా నింపడం తన కార్యక్రమంగా మోడీ పెట్టుకున్నాడని అందులో భాగమే రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలు అని అన్నారు. ఈ ప్రజా వ్యతిరేకమైన విధానాలకు వ్యతిరేకంగా పట్టణ కార్మికులు, గ్రామీణ రైతు వ్యవసాయ కూలీలు సంఘటితంగా ఉద్యమాలు కొనసాగించాలని అందులో భాగమే ఆగస్టు 10న జైలు నింపే కార్యక్రమాన్ని మూడు సంఘాలు చేపట్టాయని ఈ కార్యక్రమాన్ని మూడు సంఘాల కార్యకర్తలు సవాల్గా స్వీకరించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్ని సమీకరించాలని ప్రభుత్వం మెడలు వంచైన ఈ విధానాలను వెనక్కి తీసుకునే విధంగా ఉద్యమాలు పెంపొందించాలనికోరారు.ఈ కార్యక్రమం లో ఏ. బుచ్చన్న. నాగేంద్రమ్మ. కే కే.శంకర్. ఎన్ రాజు. మోహన్.. కుర్వ కాకి శ్రీను.మహేష్.భగవంతు. హరికృష్ణ. రేణుక లత తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యతోనే రాణింపు సాధ్యం...

**జాతి సంక్షేమానికి నిరంతరం కృషి**

**యాదవ సంఘం ఆధ్వర్యంలో పద్మ యాదవ్ కు సన్మానం**

**జడ్చర్ల ఆగస్టు 3( స్కైన్యూస్)** ఉన్నతమైన విద్య ద్వారానే రాణింపు సాధ్యమవుతుందని బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పద్మా యాదవ్ అన్నారు. పట్టణంలో యాదవ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు ఇటీవల బీజేపీ మహిళా మోర్చా నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షురాలుగా ఎన్నికైన ఆమెను సన్మానించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమాజంలో యాదవ సంఘం బలంగా ఉన్నప్పటికీ రాజకీయ రంగంలో తగినంత గుర్తింపు లేదని అన్నారు. ప్రజా ప్రతినిధులుగా వివిధ పార్టీలలో బాధ్యతలో ఉన్న యాదవ సంఘం ప్రతినిధులు ప్రత్యేక దృష్టికి జాతి ఐక్యతకు అభివృద్ధికి కృషి చేయాలని కోరారు అనంతరం ఆమె మాట్లాడుతూ ఎంతో సౌమ్యంగా ఉంది జాతిలో జన్మించడం ఎన్నో కష్టా లను ఎదుర్కొని విద్యను కొనసాగించి పేద విద్యార్థులకు చేయూత అందించేందుకు కిడ్స్ వరల్డ్ వర్ధమాన్ పాఠశాలను ప్రారంభించడం జరిగిందని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలలోని యాదవులను ఏకం చేయడంతో పాటు పార్టీ జాతీయ రాష్ట్ర కమిటీలు ఇచ్చిన బాధ్యతలు నెరవేరుస్తూ మహిళా చైతన్యానికి కృషి చేస్తానన్నారు. సమాజాభివృద్ధిలో





మేధావుల విద్యావంతుల బాధ్యత ఎంతో ఉందని అన్నారు. మారుతున్న శాస్త్ర సాంకేతిక రంగాలను సద్వినియోగం చేసుకొని మహిళలను వంటింటికే పరిమితం చేయకుండా విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడంతోపాటు మహిళలను వ్యాపార రంగంలో ప్రోత్సహించాలని కోరారు. జాతిలో వెనకబడిన కుటుంబాలకు ప్రోత్సాహం అందించేందుకు అండగా నిలవాలని అన్నారు రాజకీయ రంగంలో రాణించడం ద్వారా జాతి ఎంతో అభివృద్ధి చెందుతుందని రాబోయే రోజులలో విస్తృతంగా సమావేశాలను ఏర్పాటు చేసి జాతి ప్రయోజనాలను కాపాడేందుకు పనిచేస్తానని అన్నారు అనంతరం హైదరాబాదులో నిర్మిస్తున్న యాదవ హాస్టల్ భవన నిర్మాణానికి 25 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రవికుమార్ యాదవ్ జిల్లా గౌరవ అధ్యక్షులు భరత్ కుమార్ యాదవ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ తిరుపతయ్య యాదవ్ ఉపాధ్యక్షులు మద్దిలేటి యాదవ్ గుడి పేట యాదయ్య యాదవ్ జగన్మోహన్ యాదవ్ దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బత్తుల మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## గౌడ భవనం కోసం స్థలం కేటాయింపు జరిగేలా సహకరించండి...

**ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు కి వినతి...**

**మహబూబాబాద్ ఆగస్టు 3(స్కైన్యూస్ )** జిల్లా కేంద్రంలో గౌడభవన నిర్మాణం కోసం పట్టణ పరిధిలో 2 ఎకరాల భూమిని కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు కు ఐక్యగౌడసంఘాల ఆధ్వర్యంలో గౌడ కులప్రముఖులు వినతి పత్రం సమర్పించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన



ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు అత్యంత సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకవెల్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం నాయకులు. తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు జెర్రిపోతుల వెంకన్నగౌడ్, టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు చిత్తనూరి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ లు ముత్యం వెంకన్నగౌడ్, గాడిపెల్లి చరణ్ గౌడ్, గోపా రాష్ట్రనాయకులు బిక్కి వెంకటేశ్వర్లుగౌడ్, మోకుదెబ్బ జిల్లాఅధ్యక్షులు ముంజాల రాజేందర్ గౌడ్, గౌడసంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గండి వీరేందర్ గౌడ్, గౌడసంఘం జిల్లాబాద్యులు పెద్ది వెంకన్న గౌడ్, గోపా జిల్లా ప్రధానకార్యదర్శి బెల్లంకొండ శ్రీనివాస్ గౌడ్, జై గౌడ్ జిల్లా అధ్యక్షుడు గుదె వీరన్నగౌడ్, జర్నలిస్ట్ సంఘాల బాధ్యులు ఉమ్మగాని మధుగౌడ్, బాలగాని నవీన్ గౌడ్, చిర్రగోని ఉదయ్ గౌడ్, గౌడ యువజనసంఘం జిల్లా గౌరవఅధ్యక్షులు నలమాస సాయిగౌడ్, ఉపాధ్యక్షులు గుదే యుగంధర్ గౌడ్, జై గౌడ్ జిల్లా యూత్ అధ్యక్షులు కాంచాని శంకర్ గౌడ్. నెల్లికుదరు మండలం అధ్యక్షులు తండ నర్సయ్య గౌడ్, జై గౌడ్ జిల్లా నాయకులు మూల సురేష్ గౌడ్, గాడిపల్లి అనిల్ గౌడ్, గండి రాజేష్ గౌడ్, గౌడ సంఘాల ముఖ్యనాయకులు పాల్గొన్నారు

## ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థానంలో అన్న ప్రసాదం దాతలు గౌని గోపాల్ రాములమ్మ

**దేవరకద్ర ఆగస్టు 3 (స్కై న్యూస్);** శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థానంలో సోమవారం అన్నప్రసాద దాతలు గౌని గోపాల్ జన్మదినం సందర్భంగా గౌని రాములమ్మ పిల్లలు గౌని సిరి చందన గౌని వినయ్ తేజ్ లు ఆలయ కార్య నిర్వాహకులు శివానంద చారి సమక్షంలో భక్తులకు అన్న ప్రసాదములు నిర్వహించారు. ఈ



సందర్భంగా ఆలయ కార్య నిర్వహణ అధికారి, అర్చకులు అన్న ప్రసాదం నిర్వహించిన దాతలకు శాలువాలతో ఘనంగా చేశారు. ఈవో మాట్లాడుతూ స్వామి సన్నిధానంలో అన్న ప్రసాదములు అందజేసిన కుటుంబాన్ని శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి చల్లగా చూడాలని కోరారు.

## శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అఖండ భజన సప్తాహ కార్యక్రమము కరపత్రం ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**మల్దకల్, ఆగస్టు 3(స్కై న్యూస్):** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు మల్దకల్ మండలం కేంద్రంలోని శ్రీ శ్రీ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు అఖండ భజన సప్తాహ కార్యక్రమము తేదీ : 8-08-2026 శనివారం నుండి 15-08-2026 శనివారం జరిగే అఖండ జ్యోతి సప్తాహ భజన




కరపత్రము ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఎమ్మెల్యే కి సర్పంచ్ శాలువా కప్పి పుష్పగుచ్ఛ ఇచ్చి ఘనంగా సత్కరించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ సకాలంలో వర్షాలు పడాలని రైతులు పండించిన పంటలు మంచి గిట్టుబాటు ధర రావాలి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి గద్వాల సస్యశ్యామలముగా ఉండాలని కోరుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సిరి సంపదలతో కలిగి ఉండాలని ఈ సప్తాహ భజన దేవాలయ ప్రాంగణంలో నిర్వహించడం జరుగుతుంది అని పేర్కొన్నారు.ఈ సప్తహ భజన కార్యక్రమమును దిగ్విజయము చేసి స్వామి వారి కృపకు పాత్రలు కాగలరని కోరుచున్నాము.ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ ప్రహ్లాద రావు, జిల్లా కన్వీనర్ నల్లారెడ్డి, సర్పంచ్ చిట్టెమ్మ, నాయకులు వెంకటన్న నరేందర్, మధునాయకి, తిమ్మరాజు, పరుశరాముడు, నాగరాజు, నారాయణ, నర్సింహులు, ప్రవీణ్, తిమ్మప్ప, శ్రీను, రాజు, కృష్ణమూర్తి , నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**జోగులాంబ గద్వాల, ఆగస్టు 3 (స్కై న్యూస్):**గద్వాలలోని తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ లో డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాల సాధన లక్ష్యంగా 125 రోజుల ఉచిత ఫౌండేషన్ కోర్స్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ శిక్షణకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాలకు చెందిన అభ్యర్థులు **www.tgbcstudycircle.cgg.gov.in** వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో ఈనెల 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆగస్టు 18న విడుదల చేయనున్నట్లు, ఆగస్టు 20 నుంచి 24 వరకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించి, ఆగస్టు 25 నుంచి కోచింగ్ ప్రారంభం కానుందని వివరించారు. అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, గ్రామీణ ప్రాంత అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంత అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.00 లక్షల లోపు ఉండాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం 40 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. ఈ ఫౌండేషన్ కోర్స్లో గ్రూప్-×, గ్రూప్-××, గ్రూప్-×××, గ్రూప్-×ఌ, బ్యాంకింగ్, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్, పోలీస్ రిక్రూట్మెంట్ తదితర రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. కోచింగ్ కాలంలో అభ్యర్థులకు ప్రతి నెల రూ.1,000 చొప్పున బుక్ ఫండ్, రవాణా భత్యంగా స్టైపెండ్ అందజేయనున్నట్లు తెలిపారు. మొత్తం సీట్లలో 75 శాతం బీసీ అభ్యర్థులకు, 25 శాతం ఇతర వర్గాల అభ్యర్థులకు కేటాయించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు ఇది మంచి అవకాశమని, అర్హులైన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్ణీత గడువులోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 08546-293022, 9908560268 ఫోన్ నంబర్ల లో సంప్రదించాలన్నారు.

## తల్లిపాలే శిశువుకు తొలి టీకా.. తొలి ఆహారం



**డాక్టర్ స్రవంతి**

**రంగారెడ్డి జిల్లా ఆగస్టు 3 (స్కై న్యూస్):** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఫరూఖ్నగర్ మండలం చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ శిశువు పుట్టిన తొలి గంటలోనే తల్లిపాలు ప్రారంభించి, తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ముర్రుపాలు శిశువుకు తొలి టీకా వంటివని, అవి రోగనిరోధక శక్తిని పెంచి విరేచనాలు, న్యూమోనియా వంటి



వ్యాధుల నుంచి రక్షిస్తాయని తెలిపారు. తల్లిపాలు తల్లి ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి గర్భిణులు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించగా, హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు గర్భిణులు సమతుల్య పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ శ్రీరామ్, ఏఎన్ఎంలు, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## పదోన్నతి బాధ్యతలను మరింత పెంచుతాయి

**జిల్లా ఎస్పీ డాక్టర్.సంగ్రామ్ సింగ్ జి పాటిల్.**

**నాగర్ కర్నూల్ ఆగస్ట్ 3( స్కై న్యూస్)** పదోన్నతి కేవలం ఉద్యోగ రీత్యా ఉన్నత స్థానానికి ఎదగడమే కాకుండా, బాధ్యతలను మరింత పెంచుతుందని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ అన్నారు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న సుధాకర్ రెడ్డి పదోన్నతి పొందిన సందర్భంగా ఆయన స్టార్స్ అలంకరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పోలీస్ సిబ్బంది తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు.పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రతి బాధితుడి కష్టాన్ని సానుభూతితో వినడం, వారికి




తక్షణ సహాయం అందించడం, న్యాయం జరిగేలా కృషి చేయడం పోలీస్ సిబ్బంది ప్రధాన కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, నిరుపేదలు వంటి బలహీన వర్గాలకు పోలీసులు అండగా నిలవాలని సూచించారు. పోలీస్ శాఖలో క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావం వంటి విలువలను పాటిస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ రామ్ లాల్ , సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత చేప రొయ్య, పిల్లలపై కోసం 116 కోట్లు మంజూరి:మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి

**మంత్రి వాకిటి శ్రీహరి కృషితో ఉచిత చేపపిల్లల పంపిణీ నిధులు మంజూరు**

**ఉచిత చేప, రొయ్య పిల్లల పంపిణీ కోసం 2026-2027 ఏడాదికిగాను రూ.116 కోట్లు మంజూరు చేసిన ప్రజా ప్రభుత్వం.**

**మంత్రి వాకిటి శ్రీహరి కృషితో నిధులు మంజూరుకావడంపట్ల హర్షం వ్యక్తం చేస్తున్న మత్స్యకార సహకార సంఘాలు, మత్స్యకారులు**



**దేవరకద్ర ఆగస్టు 3 (స్కై న్యూస్);** మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో రాష్ట్రంలో ఉన్న లక్షలమందికిపైగా మత్స్యకారులకు ఉపాధి చేకూరుతుందంటున్న దేవరకద్ర నియోజకవర్గ మత్స్య కారుల తరుపున రాష్ట్ర మత్స్య శాఖామంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి కి, దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపిన దేవరకద్ర నియోజకవర్గ మత్స్య శాఖ అధ్యక్షులు తెలుగు వెంకటేష్ ముదిరాజ్ తెలిపారు.

# దళితులపై పాలకులు వివక్ష వీడాలి

**ఏజెన్సీలో గిరిజనులతో పాటు దళితులకు సమాన హక్కులు కల్పించాలి**

**ఎస్సీ సబ్‌ప్లాన్ పునరుద్ధరణ, ఇండస్ట్రియల్ రుణాల సబ్సిడీ వెంటనే విడుదల చేయాలి**

**ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తాం**

**డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి శ్రీనివాస్**

**కలెక్టరేట్ ముట్టడి విజయవంతం**






**కొత్తగూడెం ఆగస్ట్ 3( స్కై న్యూస్):** దళితుల అభివృద్ధి, సంక్షేమం విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వివక్షపూరిత విధానాలను విరమించి, రాజ్యాంగం కల్పించిన హక్కులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దళితుల సమస్యల పరిష్కారం కోసం డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా అనంతరం జిల్లా అధికారులకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా పేరాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులతో పాటు తరతరాలుగా నివసిస్తున్న దళితులకు కూడా సమాన హక్కులు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు, అభివృద్ధి అవకాశాలు కల్పించాలని కోరారు. సాగు చేస్తున్న అసైన్డ్ భూములకు పట్టాలు మంజూరు చేసి భూ హక్కులను రక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ సబ్‌ప్లాన్ పథకాన్ని పునరుద్ధరించి నిధులను పూర్తిగా విడుదల చేయడంతో పాటు, దళిత యువ పారిశ్రామికవేత్తలకు మంజూరైన ఇండస్ట్రియల్ రుణాల సబ్సిడీని వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే బెస్ట్ అవైలబుల్ స్కీమ్ నిధులు విడుదల చేసి, సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకంలో దళిత నిరుపేదలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రైవేటు రంగంలో ఎస్సీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని, గ్రామాల్లో బెల్ట్ షాపులను నిర్మూలించాలని ఆయన కోరారు. దళితుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే జిల్లా, రాష్ట్ర స్థాయిలో భారీ ధర్నాలు, రాస్తారోకోలు, కలెక్టర్ కార్యాలయాలు ముట్టడిస్తామని అన్నారు అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ అంకితకు అందజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం జిల్లా కార్యవర్గ సభ్యులు గనిగళ్ళ వీరాస్వామి విశంశెట్టి పూర్ణచంద్రరావు కంచర్ల జమలయ్య డిహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు దొంతమాల చెన్నయ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి కే రత్నకుమారి పోలమూరు ధనలక్ష్మి మద్దాల హరిత జంగం మోహన్ రావు మామిడాల ధనలక్ష్మి వరుసు రామకృష్ణ పొలామూరి శ్రీనివాస్ మండల రాజు, రవికిషోర్ మేదిని లక్ష్మీ దారా లక్ష్మి ఇమ్మానుయేల్ నాగమణి తదితరులు పాల్గొన్నారు

## విజయవంతమైన విజయ సంకల్పయాత్ర

**కెవి నరసింహ MJPVC ఎం జె పి వి సి వ్యవస్థాపక అధ్యక్షులు**



**మక్తల్ ఆగస్టు 3 ( స్కై న్యూస్):** కొల్వూర్ గ్రామం మగనూరు మండలం నారాయణ పేట జిల్లా పరిధిలోని కొల్వూరు గ్రామపంచాయతీ ఆవరణలో బాపన్ చెరువు చౌరస్తా నుండి పూలే అంబేద్కర్ చౌరస్తా వరకు ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విజయ సంకల్ప యాత్ర నిర్వహించడం జరిగింది ఈ సంకల్ప యాత్రలో మాత్మ జ్యోతిబాపూలే విగ్రహం తీసుకు రావడం జరిగింది ఈ యాత్ర శోభయానంగా డబ్బు చప్పులతో కరకర ధ్వనులతో యాత్ర కొనసాగింది ఈ యాత్రలో గ్రామ పెద్దలు సర్పంచ్లు ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లు యువకులు తదితరులు పాల్గొన్నారు సాయంత్రం 6 గంటలకు మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహం పూలే అంబేద్కర్ చౌరస్తా దగ్గర దిమ్మపైన ప్రతిష్టించడం జరిగింది అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అనేకమంది వక్తలు మాట్లాడటం జరిగింది విగ్రహం ప్రతిష్టించిన తర్వాత వక్తలకు శాలువలతో సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో కోల్వూర్ గ్రామ సర్పంచ్ ముద్దు రాములు ఉపసర్పంచ్ వార్డ్ మెంబర్లు యువకులు గ్రామ పెద్దలు రాజు కార్తీక్ తిరుమలేష్ రాకేష్ శంకర్ రాజు మోసిన్ రాము నవీన్ మహేష్ రఘు వినోద్ ఉస్సేన్ ఉసెనప్ప బాలు సునీల్ ఆనంద్ సురేష్ ఉమేష్ రాజా రాజేశ్వరి యాంకే పద్మ ఎం జె పి వి సి నాయకులు వివిధ సంఘాల నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

## ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు మోక చూపించాలి...



**నాగర్ కర్నూల్ ఆగస్టు 3( స్కైన్యూస్)** నియోజకవర్గంలోని తాడూరు మండల పరిధిలో బలన్ పల్లి గ్రామంలో 1999 లో ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేయడం జరిగింది నాటినుండి నేటి వరకు మొక చూపించక పోవడం వల్ల లబ్ధిదారులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే వారి సమస్యను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందికొండ గీత కోరారు సోమవారం ఆర్డిఓ కార్యాలయం ధర్నా నిర్వహించి వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే నెంబర్ 419 /2 లో 52 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇండ్ల స్థలాలు పంపిణీ చేసిందని ఇప్పటివరకు స్థలాలు చూపించకపోవడం వల్ల వారు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ప్రజాప్రతినిధులు అధికారులు వెంటనే స్పందించిన సమస్యను పరిష్కరించాలని కోరారు. లబ్ధిదారుల ఇంటి స్థలాలకు పూర్తి హక్కులు కల్పించాలని వారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి అంతటి కాశన్న ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ప్రధాన కార్యదర్శి బారు గోపాల్ అధ్యక్షుడు ప్రభాకర్ నాయకులు పరుశరాములు బాలస్వామి ఆగ్నేష్ వెంకటేశ్వరమ్మ రాములమ్మ లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు

## గ్రామ దేవత ఊర లక్ష్మమ్మ ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయల విరాళం

**మంత్రి వాకిటి శ్రీహరి సోదరుడు వాకిటి శేషగిరి నుంచి నగదు సిమెంట్ అందజేత**



**మక్తల్ ఆగస్టు 3 ( స్కై న్యూస్ )** నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని కొత్త గార్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ దేవత ఊరే లక్ష్మవ్వ ఆలయ నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సోదరుడు. మాజీ ఉపసర్పంచ్ వాకిటి శేషగిరి సోమవారం లక్ష రూపాయల నగదు తో పాటు 50 బస్తాల సిమెంట్ ను గ్రామ పెద్దలకు అందజేశారు . ఈ సందర్భంగా వాకిటి శేషగిరి మాట్లాడుతూ. మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయల ఆర్థిక సాయం 50 బస్తాల సిమెంటును అందించినట్టు తెలిపారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నిర్మిస్తున్న ఆలయాలకు కూడా మంత్రి వాకిటి శ్రీహరి ఆర్థిక సాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అశోక్ గౌడ్. గజ్జలి అశోక్. అంజి. కురువ గోపాల్. లక్ష్మన్న. గ్రామ పెద్దలు కృష్ణారెడ్డి. కాంగ్రెస్ నాయకుడు కావాలి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసిన వి ఎల్ ఓ, బి ఎల్ ఏ లను తాసిల్దార్ ఎల్లప్ప సన్మానించారు



**చిన్నచింతకుంట ఆగస్టు 3 (స్కై న్యూస్);** చిన్న చింతకుంట మండల కేంద్రంలోనీ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఎస్ ఐ ఆర్ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసిన చిన్న చింతకుంట బి ఎల్ ఓ, బి ఎల్ ఏ లను శాలువతో సన్మానించిన తహసీల్దార్ ఎల్లయ్య డిప్యూటీ తహసీల్దార్ చంద్ర శేఖర్ ఆర్ ఐ, లు తిరుపతయ్య ఎం డి అమీర్, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎండి.మహమూద్,దేవరకద్ర నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్ , వార్డు సభ్యులు ఎస్.శేఖర్ ఎం డి గౌస్, దేవి,సంతోషమ్మా , నర్సింహులు,బాలకృష్ణ, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పొర్ల వెంకటేశ్ ఉపాధ్యక్షులు అహ్మద్, చిరంజీవి, కోశాధికారి అశోక్ నాయకులు ఖాజా ,జి.ప్రతాప్, ప్రవీణ్,మోషే,తదితరులు పాల్గొన్నారు.

# దళితుల హామీలను అమలు చేయాలి

**అసైన్డ్ భూములకు సంపూర్ణ హక్కులు కల్పించాలి....**









**నాగర్ కర్నూల్ ఆగస్టు 3 (స్కై న్యూస్)** ఎన్నికల ముందు ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కిరణ్ కుమార్ బండి లక్ష్మీపతి డిమాండ్ చేశారు సోమవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ప్రభుత్వం అంబేద్కర్ అభయహస్తం పథకం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి 12 లక్షల రూపాయలను అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. అనేక దశాబ్దాలుగా దళితులు సాగు చేసుకుంటున్నా అసైన్డ్ భూములకు ఆంక్షలును తొలగించి సంపూర్ణ యాజమాన్య హక్కులు కల్పించాలని బ్యాంకు రుణాలు సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో దళిత కుటుంబాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సబ్ ప్లాన్ నిధులను అర్హులకు అందించాలని దళితులకు విద్య ఉపాధి మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని డపు కళాకారులకు అధికారిక గుర్తింపు కార్డులు అందించాలని నెలకు పదివేల గౌరవ వేతనం అందించాలని చేశారు. దళితులకు స్వయం ఉపాధి చిన్న పరిశ్రమల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలను విడుదల చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు లంకేశ్వరం శ్రీనివాసులు జిల్లా నాయకులు కొత్త రామస్వామి చిన్నపాగ శ్రీనివాసులు బాల పిరు శివశంకర్ కురుమయ్య శ్రీను దుర్గా బండి బలపిరు తదితరులు పాల్గొన్నారు

## మక్తల్ పట్టణంలో వీధి కుక్కల సమస్యపై మున్సిపల్ అధికారులకు వినతిపత్రం సమర్పించిన బీజేపీ మక్తల్ శాఖ టీం



**మక్తల్ ఆగస్టు 3 ( స్కై న్యూస్):**నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో రోజురోజుకు తీవ్రమవుతున్న వీధి కుక్కల సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ, మున్సిపల్ చైర్‌పర్సన్ మేడం గారికి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ విషయంపై ఆమె సానుకూలంగా స్పందించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ గారికి మరియు మున్సిపల్ మేనేజర్ గారికి కూడా బీజేపీ మక్తల్ శాఖ టీం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించడం జరిగింది.గత నెల 29వ తేదీన పదిమందికి పైగా ప్రజలు వీధి కుక్కల దాడికి గురయ్యారు. వారిలో కొందరు నారాయణపేట జిల్లా ఆసుపత్రిలో, మరికొందరు మహబూబ్‌నగర్ ఆసుపత్రిలో, ఒకరు రాయచూర్ ఆసుపత్రిలో చికిత్స పొందగా, మరికొందరు స్థానికంగా చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లారు.ఈ ఘటన జరిగిన రోజే మున్సిపల్ కమిషనర్ గారికి ఫోన్ ద్వారా సమాచారం అందించగా, కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాన్ని చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మరుసటి రోజు ప్రత్యక్షంగా కలిసి విద్యార్థులపై కూడా వీధి కుక్కలు దాడి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించి, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన చర్యలు చేపట్టలేదు.ప్రతిరోజూ ప్రజలు, మహిళలు, చిన్నారులు, విద్యార్థులు వీధి కుక్కల బారిన పడుతున్నారని, కౌన్సిల్ సమావేశం పేరుతో సమస్యను వాయిదా వేయడం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.ముఖ్యంగా ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఉదయం పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లనున్న నేపథ్యంలో ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.వీలైనంత త్వరగా వీధి కుక్కలను సురక్షిత ప్రదేశాలకు తరలించి, వాటికి అవసరమైన వైద్య చికిత్స అందించి, ప్రజలకు భరోసా కల్పించేలా తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.లేనిపక్షంలో ప్రజల తరఫున బీజేపీ మక్తల్ శాఖ టీం ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తుందని, ఆ పరిస్థితికి పూర్తి బాధ్యత మున్సిపల్ యంత్రాంగానిదేనని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు:కౌన్సిలర్లు: రాజశేఖర్ రెడ్డి, పీకే నరసింహ, తప్ప కృష్ణ.బీజేపీ నాయకులు, కార్యకర్తలు: బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, బ్యాటరీ రాజు, కే నరేందర్ మహేష్ సాగర్, శ్రీకాంత్, మంజునాథ్, ఆంజనేయులు, నవీన్, జావిద్, అశోక్, గోవిందు, భీమేష్, పాపిరెడ్డి పాల్గొన్నారు.

# ఆయుధాల వినియోగంపై పట్టు సాధించాలి

**ఆర్ఐ విజయ్ భాస్కర్**



**నారాయణపేట ఆగస్టు 3: (స్కైన్యూస్)**ఆయుధాల వినియోగంపై పోలీసులు పట్టు సాధించా లని ఆర్ ఐ విజయ్ భాస్కర్ అన్నారు.జిల్లా ఎస్పీ వినీత్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం, శారీరక దారుఢ్యాన్ని మెరుగుపర చడం, ఆయుధాల విని యోగంలో మరింత ప్రావీ ణ్యం సాధించడం లక్ష్యంగా జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్ లో మూడు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు.ఈ సందర్భంగా ఆర్ ఐ విజయ్ భాస్కర్ మాట్లా డుతూ పోలీసు ఉద్యోగం అత్యంత బాధ్యతాయు తమైనదని, ప్రతి పోలీసు సిబ్బంది తమ వృత్తి నైపుణ్యాన్ని ఎప్పటిక ప్పుడుమెరుగుపరుచుకుంటూ ఆధునిక పోలీసింగ్‌కు అనుగుణంగా పనిచేయా లని సూచించారు. విధి నిర్వహణలో ఆత్మవిశ్వాసం తో పాటు ఆయుధాల విని యోగంపై పూర్తి అవగాహ న, నైపుణ్యం కలిగి ఉండ డం అత్యంత అవసరమ న్నారు.ప్రతి పోలీసు సిబ్బం ది శారీరకంగా, మానసి కంగా దృఢంగా ఉండేందు కు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, పరేడ్, డ్రిల్, ఫైరింగ్, వెపన్ హ్యాండ్లింగ్ వంటి అంశాల్లో నిరంతరం సాధన చేయాల ని తెలిపారు. శిక్షణ ద్వారా అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు.పోలీసు శాఖ లో క్రమశిక్షణ, సమయపా లన, బాధ్యతాయుతమైన విధి నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలతోమర్యాదపూర్వకంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించడం ద్వారా పోలీసు శాఖపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించవచ్చని అన్నారు.అంతేకాకుండా, చట్టాలపై అవగాహన, ఆధునిక దర్యాప్తు విధా నాలు, ప్రజా సంబంధాల మెరుగుదల, ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని కూడా ప్రతి పోలీసు సిబ్బంది పెంపొం దించుకోవాలని సూచిం చారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధి నిర్వహణ లో సమర్థవంతంగా అమ లు చేసి ప్రజలకు నాణ్యమై న, వేగవంతమైన పోలీసు సేవలు అందించాలని పిలుపునిచ్చారు.ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో ట్రైనర్ హెడ్ కానిస్టేబుల్ రాములు పోలీ సు సిబ్బందికి డ్రిల్, వెపన్ హ్యాండ్లింగ్, క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం తదితర అంశాలపై శిక్షణ అందించా రు.ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ ఐ శ్వేత, శిరీష, ట్రైనర్ హెడ్ కానిస్టేబుల్ రాములు, వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రాళ్ల బండి అంజమ్మ కు విశ్వబ్రాహ్మణుల ఘన నివాళి



**హైద్రాబాద్ ఆగస్ట్ 3** :విశ్వబ్రాహ్మణ జాతిరత్నం పురోహిత రత్నం రాళ్ల బండి లంకేశ్వర చారి మాతృమూర్తి కీర్తిశేషులు రాళ్ల బండి అంజమ్మ కు దశదినకర్మ కు బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశా చారి హాజరై మాతృమూర్తికి ఘనంగా నివాళులు అర్పించారు. రాళ్ల బండి లంకేశ్వర చారి పంతులు విశ్వబ్రాహ్మణ జాతిలో ఆదర్శ పురోహిత రత్నం లాంటి వారి తల్లి మరణం జాతికి తీరని లోటని ఆ తల్లి ఆత్మకు శాంతి చేకూర్చాలని కుందారం గణేష్ చారి వలబోజు నరసింహ చారి నివాళులు అర్పించి ఆమె ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో లంకేశ్వరాచారి మల్లేశ్వర చారి భార్గవాచారి వాళ్ళ బాలా చారి విఠోబా జ్యోతి విజయలక్ష్మి మరియాలా వాస్తవ్యులు పులి మామిడి, బాల బ్రహ్మాచారి రామ బ్రహ్మాచారి భగవంతు చారి కలకొండ బిక్షపతి మహంకాళి నరసింహ చారి, విశ్వబ్రాహ్మణ దమ్మైగూడ భవన కమిటీ చైర్మన్ ఎం ఎన్ చారి తదితరులు పాల్గొన్నారు.

# పీవీకే 5 ఇంక్లైన్ ఉద్యోగులతో ఏరియా నూతన జీ ఎం సి హెచ్. వెంకటరమణ పరిచయ సమావేశం





**సింగరేణి ఆగస్ట్ 3( స్కై న్యూస్):** కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సి హెచ్. వెంకటరమణ సోమవారంన ఫస్ట్ షిఫ్ట్ లో పీవీకే నెం.5 ఇంక్లైన్ గనిని సందర్శించి ఉద్యోగులతో పరిచయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పీవికే నందు అమ్మవారి ఆలయం లో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గని ఉద్యోగులు, అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో కలిసి వారి పనితీరు, గని నిర్వహణ, భద్రతా ప్రమాణాలు, ఉత్పత్తి లక్ష్యాలు ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ప్రతి ఉద్యోగి సురక్షితంగా విధులు నిర్వహిస్తూ ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సమష్టిగా కృషి చేయాలని జనరల్ మేనేజర్ గారు సూచించారు.గనిలో పనిచేసే ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ప్రమాద రహిత వాతావరణం కల్పించడం అందరి బాధ్యత అని అన్నారు. సింగరేణి ప్రతిష్టను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అధికారులు, ఉద్యోగులు ఒక జట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.అలాగే ఉద్యోగుల సంక్షేమం, పని పరిస్థితుల మెరుగుదల, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఉద్యోగుల సూచనలు, సలహాలకు ప్రాధాన్యత ఇస్తూ అందరితో సమన్వయంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం సి హెచ్. వెంకటరమణ తో పాటు ఎస్.ఓ టు జీఎం .ఎం. గోవిందరావు , ఏజెంట్ పీవీకే రామ్ భరోస్ మెహతో , ఏరియా ఇంజనీర్ వి. రామకృష్ణ , గ్రూప్ ఇంజనీర్ గోదావరి శ్రీనివాస్, మేనేజర్ పి. రవికిరణ్ సేఫ్టీ ఆఫీసర్ ఆర్. అనిల్ సాగర్ , పిట్ ఇంజనీర్ శ్రీనివాస్ , ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ భూక్య రమేష్ , ఐఎన్టీయూసీ పిట్ సెక్రటరీ చిలక రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఆర్జీలను పెండింగ్ లో ఉంచవద్దు..

**జోగులాంబ గద్వాల, ఆగస్టు 3 (స్కై న్యూస్):**ప్రజావాణి ఆర్జీలను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్ లతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ వారం మొత్తం ప్రజల నుంచి 70 ఫిర్యాదులు వచ్చాయన్నారు. గత కొద్ది వారాలుగా వచ్చిన ప్రజావాణి ఆర్జీల పరిష్కారంలో చెప్పుకోదగ్గ పురోగతి ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో పరిష్కరించాల్సి ఉందన్నారు. జిల్లాతో పాటు సీఎం ప్రజావాణికి వచ్చిన ఆర్జీలను



ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. మండల స్థాయిలో వచ్చిన ఫిర్యాదులను అక్కడే పరిష్కరించాలని, ముఖ్యంగా భూ సంబంధ సమస్యలపై వచ్చిన ఆర్జీలను సంబంధిత మండలాల రెవిన్యూ అధికారులు పరిష్కరిస్తే ప్రజలు ఇక్కడి వరకు రావాల్సిన అవసరం ఉండదన్నారు. గతంలో ప్రజావాణిలో ఇచ్చిన తమ ఫిర్యాదులు పరిష్కారం కాకపోవడంతో చాలామంది ప్రజలు అవే సమస్యలపై మళ్ళీ ప్రజావాణికి వస్తున్నారని, ఇలాంటి పరిస్థితులు ఉండరాదు అంటే సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో ఆర్జీలను పరిష్కరించాల్సి ఉందన్నారు. ఆయా శాఖల అధికారులు ప్రతి బుధవారం తమ సిబ్బందితో సమావేశాలు నిర్వహించుకొని తమ శాఖల పరిధిలో వచ్చిన ఆర్జీల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాది హత్యకు నిరసనగా మక్తల్ కోర్టులో లాయర్ల విధుల బహిష్కరణ

**దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్**



**మక్తల్ ఆగస్టు 3 ( స్కై న్యూస్ )** నాగర్ కర్నూల్ జిల్లా పెంటవెల్లిలో న్యాయవాది మల్లయ్య హత్యకు నిరసనగా నారాయణపేట జిల్లా మక్తల్ కోర్టులో సోమవారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. న్యాయవ్యాధులపై వరుసగా దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ పెంట్రవెల్లి లో న్యాయవాది మల్లయ్యను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల భద్రత కు ప్రభుత్వం మరింత కఠిన చర్యలు తీసుకోవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని తెలిపారు. ఇలాంటి ఘటనాలు పునరావృతం కాకుండా సమర్థవంతమైన రక్షణ చర్యలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రంకుల ఆనంద్. సూర్య ప్రకాష్. జి సురేందర్. వెంకటేష్ గౌడ్. ఎస్ శివకుమార్. సురేందర్ చారి తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాది హత్యకు నిరసనగా కోర్టు వీధుల బహిష్కరణ

**నారాయణపేట ఆగస్టు 3: (స్కైన్యూస్)** కొల్లాపూర్ బార్ అసోసి యేషన్ లో ఉన్న న్యాయ వాది బి.మల్లయ్య ను హత్య చేయడాన్ని నిరసి స్తూ సోమవారం నారాయ ణపేట జిల్లా లోని అన్ని కోర్టులో న్యాయవా దులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా నారాయణ పేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్ ఉపాధ్యక్షుడు నందు నామాజీ కార్యదర్శి చెన్నా రెడ్డి మాట్లాడుతూ హత్య ను తీవ్రంగా ఖండించా రు.రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల పరిరక్షణ చట్టం తీసుకు వచ్చిన ఫలితం లేకుండా పోయిం దనీఅన్నారు.న్యాయవాదుల పరిరక్షణ కోసం చట్టాన్ని పటిష్టంగా అమలు చేయా లని కోరారు.ఈ కార్యక్ర మంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నా రు.

# టీబీజీకేఎస్ పోరాట ఫలితమే మణుగూరు పీకే డీప్ సైడ్ ప్రాజెక్టు దక్కింది


**ఏఐటీయూసీ , ఐఎన్ టియుసి అసత్యపు ప్రచారాలు మానుకోవాలి**

**టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కూసాన వీరభద్రం**



**కొత్తగూడెం ఆగస్ట్ 3( స్కై న్యూస్)** టీబీజీకేఎస్ పోరాట ఫలితమే మణుగూరు పీకే డీప్ సైడ్ ప్రాజెక్ట్ సింగరేణికి వేలంపాట ద్వారా దక్కిందని టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కుసాన వీరభద్రం అన్నారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు సంఘాలైన ఏఐటియుసి , ఐఎన్ టియుసి సంఘాల వారి వల్లే మణుగూరు డీప్ సైడ్ ప్రాజెక్ట్ సింగరేణికి దక్కిందని వారు అంటున్నారని అలాంటి అసత్యపు ప్రచారాలు చేయవద్దని ఆయన హితువు పలుకుతూ , ఏఐటియుసి,ఐఎన్ టియుసి సంఘాలకు చేతనైతే మిగతా బ్లాక్ లను వేలంపాటలో కాకుండా ప్రభుత్వంపై పోరాటం చేసి డైరెక్ట్ గా సింగరేణి సంస్థకు కేటాయించే విధంగా చేయాలని ఆయన డిమాండ్ చేశారు . వేలంపాట ద్వారా సింగరేణి దక్కించుకున్న మణుగూరు బ్లాక్ ను వారి వల్లే వచ్చింది అనటం వారి అవివేకానికి నిదర్శనమని ఆయన అన్నారు. ఏఐటియుసి , ఐఎన్టియుసి సంఘాలు కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని , వారు చేసే పనులను కార్మికులు గమనిస్తున్నారని వారికి తగిన సమయం వచ్చినప్పుడు గుణపాఠం చెపుతారని ఆయన అన్నారు ఇప్పటికైనా కార్మికుల శ్రేయస్సుకోసం పని చేయాలని ఆయన సూచించారు .

# ఏబీవీపీ బషీర్బాగ్ నగర కార్యదర్శిగా మరోసారి నియమితులైన సురేందర్..



**హైద్రాబాద్ ఆగస్ట్ 3 :**అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) బషీర్బాగ్ నగర కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఐత నిఖిల్ జీ హాజరై, హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో చదువుతున్న విద్యార్థి నాయకుడు సురేందర్‌ను బషీర్బాగ్ నగర కార్యదర్శిగా వరుసగా రెండోసారి నియమించారు.ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ, తనపై మరోసారి విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఏబీవీపీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమస్ఫూర్తితో పనిచేస్తానని, విద్యార్థుల హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తానని అన్నారు.బషీర్బాగ్ నగర శాఖను తెలంగాణ రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నగర శాఖగా తీర్చిదిద్దే దిశగా పనిచేస్తానని తెలిపారు. విద్యార్థులకు అండగా నిలిచి, సంస్థ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# కంచె చేను మేస్తే...

**కౌన్సిలర్ అక్రమ నిర్మాణా న్ని అడ్డుకోండి**



**నారాయణపేట ఆగస్టు 3: (స్కైన్యూస్)** నారాయణపేట మున్సిపాలిటీలో కంచె చేను మేస్తోంది.అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన మున్సిపల్ పాలక వర్గ సభ్యుడు ప్రస్తుత కౌన్సిలర్ రాజేష్ ఘాట్,ఆయన సోదరుడు మురళి మున్సిపాలిటీ స్థలాన్ని ఆక్రమించుకుని అక్రమ నిర్మాణం చేస్తున్నాడు.ఈ విషయంపై చంద్రకాంత్ చామకూర మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. లైన్ వాడలోని తన ఇంటి నెంబర్ 4బి 11బి69 ముందు కౌన్సిలర్ రాజేష్ ఘాట్,సోదరుడు మురళి అక్రమంగా గోడ నిర్మిస్తున్నారని పేర్కొన్నారు.గత 70 ఏళ్ల నుంచి అక్కడ ఎలాంటి నిర్మాణం లేదని ఇప్పుడు కౌన్సిలర్ అధికార బలంతో అక్రమ నిర్మాణం చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కల్పిస్తున్నారని తెలిపారు.ఈ అక్రమ నిర్మాణాన్ని వెంటనే ఆపి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను కోరారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ డిక్లరేషన్ హామీల అమలులో విఫలం: డి హెచ్ పి ఎస్

**దేవరకద్ర అమరచింత ఆగస్టు 3 (స్కై న్యూస్);** కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్ హామీల అమలులో విఫలమైందని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్ విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ల వద్ద ధర్నా, వినతి పత్రాలు సమర్పించాలన్న రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి కలెక్టర్ ఆఫీస్ లో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేసి, రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మాట్లాడుతూరాష్ట్రవ్యాప్తంగా దళితులు అనేక సమస్యలనుఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నికల ముందు చేవెళ్లలో ఎస్సీ డిక్లరేషన్ ఇచ్చి మూడేళ్లు కావస్తున్న ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. దళితుల సమగ్ర అభివృద్ధికి



వెంటనే తగు చర్యలు తీసుకోవాలన్నారు. చేవెళ్ల డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అభయ హస్తం పథకం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి రూ. 12 లక్షలు ఆర్థిక సహాయం అందించాలని, అసైన్డ్ భూములపై పూర్తి హక్కులు కల్పించాలని, రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో దళితులకు ప్రాధాన్య ఇవ్వాలని, ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ పథకాన్ని పునరుద్ధరించాలని, ఇండస్ట్రియల్ రుణాలకు, సబ్సిడీని వెంటనే విడుదల చేయాలన్నారు. దళితులు సాగు చేస్తున్న పోడు భూములకు తక్షణమే పట్టాలు ఇవ్వాలని ఎస్సీ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వంపై పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. డిహెచ్పిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు డి. శేఖర్, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సెల్ సభ్యుడు విశ్వం బాబు,మాజీ సర్పంచ్ శాంతన్న,సామాజిక నేత గంధం నాగరాజు,చిన్న కురుమన్న, రమేష్,వంశీ,సౌలు,రవి,శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ శాఖ భూ సమస్యలు వేగంగా పరిష్కరించాలి

**ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి**

**దేవరకద్ర మదనపురం ఆగస్టు 3 (స్కై న్యూస్);** మదనపురం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, అన్ని ప్రభుత్వ శాఖల పనితీరును సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ, విద్య, వైద్య ఆరోగ్యం, విద్యుత్, హౌసింగ్, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా, పశుసంవర్ధక, ఆర్అండ్‌బీ, ఉద్యానవన, ఎక్సైజ్, ఇరిగేషన్, ఫారెస్ట్, వెటర్నరీ తదితర అన్ని శాఖల అధికారులు తమ శాఖల పురోగతిని సమావేశంలో వివరించారు, అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించకుండా జవాబుదారీతనంతో చేస్తూ, ప్రభుత్వ పథకాల సంబంధించి సర్పంచులతో చర్చించి, సమన్వయంతో పని చేయాలి అన్నారు.ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలి అన్నారు.అన్ని శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి అన్నారు. రెవెన్యూ శాఖ భూ సమస్యలు, ప్రజల దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు ఎంతగానో మెరుగుపరిచింది, తద్వారా ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్స్ పెరిగాయి అన్నారు.ఉపాధి హామీ పథకం కు సంబంధించి, నూతన వి బి–జి రామ్ జి పనులపై అధికారులు సర్పంచ్ లకు అవగాహన కల్పించాలి అన్నారు.సర్పంచ్ లతో చర్చించి, ప్రతి గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులను ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాలి అన్నారు.నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ కు ప్రాధాన్యం ఇవ్వాలి అన్నారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య



సేవలు సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలి, రాబోయే సీజన్ ను దృష్టిలో ఉంచుకుని, మెడిసిన్ (డ్రగ్స్)ను అందుబాటులో పెట్టుకోవాలి అన్నారు.రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలి, త్వరలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్స్, ఏ బి స్విచ్లు, పోల్స్ తదితర విద్యుత్ ఉపకరణాలు వస్తున్నాయి మండలాల వారిగా కార్యక్రమం నిర్వహిస్తాం అన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి అన్నారు.ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతర నీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలి తెలిపారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి తెలిపారు.పశువైద్య సేవలను గ్రామస్థాయిలో మరింత సమర్థవంతంగా అందించాలి అన్నారు.అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాలు, మండల కేంద్రాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సాధించాలి అన్నారు.రోడ్లు, భవనాల నిర్మాణ పనులను, నిర్ణీత గడువులో పూర్తి చేయించేలా అధికారులు కృషి చేయాలి తెలిపారు.ఉద్యానవన పంటలను ప్రోత్సహించి, రైతులకు ఉద్యానవన పంటల గురించి అవగాహన కల్పించి, ఉద్యాన పంటల సాగును మరింతగా పెంచేలా హార్టికల్చర్ అధికారులు పనిచేయాలి అన్నారు.విద్య, వైద్యం, ఇరిగేషన్ శాఖలపై ప్రత్యేక దృష్టి పెట్టి మన ప్రభుత్వం పని చేస్తుంది తెలిపారు.మదనపురం మండలంలో 90% ఇండ్లకు గృహ జ్యోతి కింద ఉచిత విద్యుత్ ఇస్తున్నం అన్నారు.గత ప్రభుత్వం మదనపురం మండలంలోని సరళసాగర్, నెల్విడి, కూరుమూర్తి రాయ ఎత్తిపోతల పథకాలను పట్టించుకోలే, మన ప్రభుత్వం ఎత్తిపోతల పథకాల మరమ్మత్తుల కోసం 5 కోట్లు మంజూరు చేసింది తెలిపారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర విధానాలతో పౌర స్వేచ్ఛ కు విఘాతం

**సిపిఐ (ఎమ్ ఎల్) రామచంద్రన్ పార్టీ అధికార ప్రతినిధి నకిరేకంటి చిట్టిబాబు**



**రాజమండ్రి ఆగస్ట్ 3;** సిపిఐ (ఎమ్ ఎల్) రామచంద్రన్ పార్టీ ఆంధ్రప్రదేశ్ పార్టీ ముఖ్యుల సమావేశం జైరాం అధ్యక్షతన కాటవరం లో జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడుతూ దేశంలో అమలవుతున్న ప్రభుత్వ విధానాలవల్ల పౌర స్వేచ్ఛ దెబ్బ తింటుదని,ప్రశ్నించే వారిని దేశ ద్రోహులు,అర్బన్ నక్సలైట్ అని ముద్ర వేయడం ప్రజాస్వామ్యనికి మంచిది కాదని ,ప్రతి నిరసన జంతర్ మంతర్ లా మారినప్పుడే ప్రజాస్వామ్యం,పౌర హక్కులు నిలబడుతాయని అన్నారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎల్లుట్ల ఉపేందర్ మాట్లాడుతూ బీజేపీ 12 ఏళ్ల పాలనలో ప్రజల ప్రభుత్వ రంగ సంస్థల ను అమ్మేవేయడం జరిగిందని, సహజ వనరులు,అడివి,సముద్ర ఓడరేవులు అదానీ, అంబానీ చేతిలో పెట్టిన మోదీ. ప్రజల హక్కును తుంగలో తొక్కారని ,రాజంగం కల్పించిన ప్రాథమిక సౌకర్యాలు కుడు,గూడు,విద్య,వైద్యం, ఉపాధి అవకాశాలు లేకుండా ,ప్రజలను కాందిశీకులగా మార్చి వేశారని మండి పడ్డారు, ఈ దళారీ, దోపిడి పాలక వర్గాల కు వ్యతిరేకంగా విప్లవ ఐక్య ఉద్యమ లకు సన్నద్ధం కావాలని పిలుపు ఇచ్చిన సిపిఐ (ఎమ్ ఎల్) రామచంద్రన్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కమిటీ ఏర్పాటు కార్యదర్శి గా బి జయరాం,ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది, పార్టీ కార్యవర్గ సభ్యులుగా బత్తుల అప్పలరాజు, పల్లే సురేష్, సత్యవతి, భీమ్ రెడ్, చంద్ర శేఖర్,ఎం రమణ,సత్తిబాబు లను రాష్ట్ర కమిటీ సభ్యులు గా ఎన్నుకోవడం జరిగింది.

# ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

**తెలంగాణ స్టేట్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆందోళన**




**హైద్రాబాద్,ఆగస్టు 3(స్కైన్యూస్ )** నాంపల్లి,గృహకల్ప లో తెలంగాణ స్టేట్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ హైద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు నరేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగులతో కలసికాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు ఐతున్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఉద్యోగులను విస్మరిస్తుందని ఆరోపించారు.కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో పాతపెన్షన్ విధానాన్ని అమలు చేస్తుంటే తెలంగాణ రాష్ట్రంలో ఎందుకు అమలు చేస్తాలేరని ప్రశ్నించారు. ప్రభుత్వం మొండివైఖరిని నిరాశిస్తూ.. ఆగస్ట్ 23న హైద్రాబాద్ లో పెద్ద ఎత్తున భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని,ప్రభుత్వం పై తమ పోరాటం తీవ్రతరం చేస్తామని నరేందర్ హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో కె మల్లేష్ , అర్ శివ కుమార్ నాయక్ మరియు కోఆపరేటివ్ డిపార్ట్మెంట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రజల వినతులపై వెంటనే స్పందించాలి

**జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాలు**



**మహబూబ్‌నగర్, ఆగస్టు 3(స్కైన్యూస్ ):**జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదులను ఎస్పీ శ్రద్ధగా విని, సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల స్వరూపాన్ని తెలుసుకొని, చట్టబద్ధంగా, త్వరితగతిన పరిష్కరించేలా అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు లేదా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును నిష్పాక్షికంగా పరిశీలించి, చట్టబద్ధమైన విధానంలో న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ శాంతి భద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు.ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు సత్వర, పారదర్శకమైన, నాణ్యమైన సేవలు అందించేందుకు మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

# ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి జిల్లా కలెక్టర్

"వాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 30 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా సత్వరం పరిష్కరించాలన్నారు. శాఖల వారీగా ఆయా అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డి.ఆర్.ఓ.రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

**మహబూబ్‌నగర్ ఆగస్టు 3(స్కైన్యూస్ )** ప్రపంచ ఆగస్టు 1 నుంచి 7 వరకు తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ రూపొందించిన ప్రచార పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు మధుసూదన్ నాయక్,జె.ఎల్.బి.హరిప్రియ,అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి జరీన్ బేగం, వివిధ శాఖల జిల్లా అధికారులు, సీడీపీవోలు , జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది, డీహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఐఏఎస్ మాట్లాడుతూ, తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని తెలిపారు. శిశువు జన్మించిన తొలి గంటలోనే తల్లిపాలు ఇవ్వడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. పుట్టినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు




కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం తగిన పౌష్టికాహారంతో పాటు రెండేళ్ల వయస్సు వరకు తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన సంపూర్ణ పోషకాలను అందించడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంపొందించి, అనేక అంటువ్యాధుల నుంచి రక్షిస్తాయని తెలిపారు. అలాగే తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి ఆరోగ్యానికీ అనేక ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు.ఈ ఏడాది ప్రపంచ తల్లిపాల వారోత్సవాల థీమ్ "తల్లిపాలకు ప్రాధాన్యత ఇద్దాం -- సుస్థిరమైన సహాయ వ్యవస్థలను ఏర్పాటు చేద్దాం" అనే సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా చేర్చేందుకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి జరీన బేగం మాట్లాడుతూ, మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 7 వరకు జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, వారి కుటుంబ సభ్యులు తల్లిపాల ప్రాధాన్యతను గుర్తించి, శిశువు జన్మించిన తొలి గంటలోనే తల్లిపాలిచ్చే అలవాటును ప్రోత్సహించాలని, అలాగే మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలే అందించాలని కోరారు.

# మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి బర్త్డే వేడుకలు!

**వెల్లి విరిసిన అభిమానం జనసందోహం నడుమ.. రామవరంలో కాపు సీతాలక్ష్మి జన్మదిన వేడుకలు**

**కేటీఆర్ ఆశీస్సులతో ప్రారంభమై.. రామవరంలో అభిమానుల కోలాహలంతో ముగిసిన వేడుకలు**









**కొత్తగూడెం ఆగస్ట్ 3( స్కై న్యూస్):**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రామవరం లో గులాబీ శ్రేణుల కోలాహలంతో మురిసిన. మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి పుట్టినరోజు వేడుకలు. ఆమె నివాసంలో అత్యంత వైభవంగా, పండుగ వాతావరణంలో జరిగాయి.ఉదయం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రలను కాపు సీతాలక్ష్మి దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి, వారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం సాయంత్రం రామవరంలోని స్వగృహంలో కేక్ కట్ చేసి అభిమానుల నడుమ వేడుకలు జరుపుకున్నారు.తరలివచ్చిన నాయకులు.. వెల్లువెత్తిన శుభాకాంక్షలు తెలిపారు ?ఈ వేడుకలకు బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, టీబీజీకేఎస్ కార్మిక నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కాపు సీతాలక్ష్మికి పూలమాలలు, శాలువాలు కప్పి, మిఠాయిలు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నివాస ప్రాంగణమంతా నాయకులు, అభిమానుల జైకారాలతో మారుమోగింది.నాపై మీరు చూపిస్తున్న అభిమానమే నా బలం: అని కాపు సీతాలక్ష్మి అన్నారు.ఈ సందర్భంగా కాపు సీతాలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఏటా లాగే ఈ సంవత్సరం కూడా నా పుట్టినరోజును మీరంతా పండుగలా నిర్వహించడం నాకెంతో సంతోషాన్నిచ్చింది. దూర ప్రాంతాల నుంచి వచ్చి, మీ అమూల్యమైన సమయాన్ని కేటాయించి శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకునికి, అభిమానికి హృదయపూర్వక కృతజ్ఞతలు అని ఉద్వేగభరితంగా తెలిపారు.

# మణుగూరు పీకే బ్లాక్ సింగరేణికి దక్కడం హర్షణీయం

**ఐక్య పోరాటాలతోనే బొగ్గు గనుల ప్రైవేటీకరణకు అడ్డుకట్ట**

**సంస్థ మనుగడ, కార్మికుల భవిష్యత్తు కోసం నిరంతర కృషి**

**కొత్త బొగ్గు బ్లాకుల సాధనకు ఉద్యమాలు తీవ్రతరం చేస్తాం**

**కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**









**కొత్తగూడెం ఆగస్ట్ 3( స్కై న్యూస్) :** మణుగూరు పీకేఓసి డిప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకే కేటాయించడం ప్రభుత్వంపై తాను చేసిన వత్తిడి, కార్మికుల ఐక్య పోరాటాల ఫలితమేనని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సింగరేణి గుర్తింపుసంఘం గౌరవ అధ్యక్షులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పీకేఓసి డిప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు అప్పగిస్తూ నిర్ణయం జరగడంపట్ల అయన హర్షం వ్యక్తం చేశారు. సింగరేణి పరిరక్షణ కోసం, సంస్థ మనుగడ కోసం చేపట్టిన వరుస ఆందోళనల వల్లే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని పేర్కొన్నారు. పీకేఓసి డిప్ సైడ్ బ్లాక్‌ను సింగరేణికి దక్కేలా చూసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలతో పలుమార్లు చర్చలు జరిపినట్లు వెల్లడించారు. అలాగే సిపిఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన దశలవారీ ఉద్యమాలు, ఆందోళనలు ఈ విజయంలో కీలక పాత్ర పోషించాయని చెప్పారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడుకునేందుకు కార్మిక లోకం ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. సింగరేణి ఆస్తులను, గనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు జరిగిన కుట్రలను ఉద్యమ స్ఫూర్తితో తిప్పికొట్టామని స్పష్టం చేశారు. లాభాల బాటలో ఉన్న సింగరేణిని దెబ్బతీసే యత్నాలను ఏమాత్రం సహించేది లేదని హెచ్చరించారు. ఈ విజయాన్ని కొందరు తమ గొప్పగా ప్రచారం చేసుకోవడం తీవ్ర హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో సింగరేణికి కొత్త బొగ్గు బ్లాకులు దక్కే వరకు తమ పోరాటం ఆగేది లేదని, సంస్థ ప్రయోజనాల కోసం నిరంతరం శ్రమిస్తామని ఆయన పునరుద్ఘాటించారు.

# నిర్వాసితులకు పరిహారం వెంటనే చెల్లించాలి

**అధికారులు తప్పిదంతో ఆగిన రైతు భరోసాను చెల్లించాలి**

**జి.వెంకట్రాంరెడ్డి ధర్మరాజ్, గోపాల్ రెడ్డి, నిర్వాసితుల సంఘం జిల్లా నాయకులు**



**నారాయణపేట ఆగస్టు 3: (స్కైన్యూస్)** మక్తల్-నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం కొరకై సేకరించిన భూములకు నష్టపరిహారం చెల్లించాలని ఆర్డీవో కార్యా లయం ముందు సోమవా రం భూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ధర్నాకు హాజరైన రైతులను ఉద్దేశించి జీ వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఊట్కూరు పేరుపల్ల రిజర్వాయర్ల పరిధిలోని రైతులకు పరిహారం ఇవ్వడం ఆలస్యం అవుతుందన్నారు. నిధులు ఉన్నప్పటికిని గత నెల రోజులకు పైగా అధికారులు తరచూ వాయిదాలు చెబుతూ రైతాంగాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ప్రధానంగా రెవెన్యూ డివిజన్ పరిధిలో ఈ నిర్లక్ష్యం జరుగుతుందని ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని విడాలన్నారు. నిర్వాసితులకు భూము లపరిహారం సమస్య తో పాటు, కోల్పోయిన ఇతర ఆస్తులు బోరుబావులు మోటార్లు పైపులైన్లు భారీ వృక్షాలు, పామాయిల్ తోటల రైతులకు పరిహారం అందలేదని, అలాగే పరిహా రం పొందిన భూమి కంటే కాంట్రాక్టర్లు అదనంగా భూముల్ని వాడుకొని పంట లకు నష్టం కలిగిస్తున్నారని మట్టి కాంట్రాక్టర్లపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా భూమి కోల్పోయిన మొత్తం సర్వే నంబర్ను హోల్డ్ లో పెట్టి రైతు భరోసా రాకుండా నష్టం కలిగించిన వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆర్డీవో మెమొరండం స్వీకరిస్తూ వారం రోజుల్లో పూర్తిగా పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, సిఐటియు జిల్లా కార్యదర్శి బి బలరాం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, దామరగిద్ద మండలం మాజీ ఉపాధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సంఘం నాయకులు నర్సప్ప, కృష్ణయ్య,నరసింహులు,సాయి బన్న, నిడుగుర్తి,లక్ష్మీ పల్లి,బాపూర్,ఊట్కూరు,గడి మున్కంపల్లి, రైతులు పాల్గొన్నారు.

# కేశంపేట మండలంలో ఎస్ ఐ ఆర్ పరిశీలన



**కేశంపేట ఆగస్టు 3(స్కై న్యూస్):** కేశంపేట మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలలో ఇప్పలపల్లి, దేవునిగుడి తండా, పోమల్ పల్లి, కొండారెడ్డిపల్లి, కాకునూరు, తొమ్మిది రేకుల, లింగంధన, నిర్దవెల్లి , లేమామిడి, బోధునం పల్లి, కేశంపేట్, చింతకుంటపల్లి, వేముల్ నర్వ గ్రామాలలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అందే బాబయ్య పరిశీలించారు.ఈ సందర్భంగా బిఎల్ఓ ల తో సమావేశమై ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, నమోదు, మార్పులు, తొలగింపులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పసుల నరసింహ యాదవ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కంచుకోట మహేష్, మండల జనరల్ సెక్రెటరీ కల్వకోలు తిరుపతి, మండల ఉపాధ్యక్షులు కంచుకోట నరసింహ,సీనియర్ నాయకులు కరెడ్ల నరేందర్ రెడ్డి, కాణం ఉదయ్, మున్నూరు యుగంధర్, భక్తవత్సల్, శివాజీ, కానుగుల మహేష్, ఆకుల గోపాల్, వేణుగోపాల్, గోపాల్ రెడ్డి, మరియు భారతీయ జనతా పార్టీ నాయకులు పాల్గొన్నారు

## స్థానిక యువతకు ఉపాధి కల్పించే పెట్టుబడులకు

# పూర్తి సహకారం ఉంటుంది...

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**మంథనిలో మంత్రి విస్తృతంగా పర్యటన**





**పెద్దపల్లి, ఆగస్టు 3(స్కైన్యూస్ ):**ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించే అభివృద్ధి కార్యక్రమాలను నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంథని పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా శివకిరణ్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మన ఊరు--మన కోచింగ్ సెంటర్ ఉచిత కానిస్టేబుల్, ఎస్సై కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం ఎస్ఎల్బీ గార్డెన్‌లో టీ వర్క్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాల విద్యార్థుల క్రీడా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేసి ఉచిత హెల్మెట్లను పంపిణీ చేశారు. మంథని క్యాంపు కార్యాలయంలో హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్, ఇతర పరిశ్రమల ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, అధికారులతో కలిసి పరిశ్రమల అభివృద్ధి అంశాలపై సమీక్ష నిర్వహించారు. హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమం ప్రాజెక్ట్ షైన్ కింద చేపడుతున్న బొక్కలవాగు చెక్‌డ్యామ్ అప్‌గ్రేడేషన్, సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో నూతన డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొని వైద్య సేవల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. రత్నాపూర్ గ్రామంలో ప్రతిపాదిత కోకాకోలా పరిశ్రమ ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించారు.

**ఉద్యోగం సాధించే వరకు అండగా ఉంటాం**

'మన ఊరు--మన కోచింగ్ సెంటర్' ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని, ప్రస్తుతం మరో 7 వేలకుపైగా పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఈ అవకాశాన్ని యువత పూర్తిగా వినియోగించుకోవాలని, రాబోయే మూడు నెలలు జీవితాన్ని మార్చే కాలంగా భావించి స్పష్టమైన లక్ష్యంతో సిద్ధం కావాలని సూచించారు. కోచింగ్ సెంటర్‌లో అత్యుత్తమ శిక్షణతో పాటు అవసరమైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్, వసతి, భోజన సౌకర్యాలను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజూ కనీసం 15 గంటలు క్రమశిక్షణతో చదివి ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం వరకు తన బాధ్యత అని, ఉద్యోగం సాధించడం మాత్రం వారి సంకల్పం, కష్టపడే తత్వంపైనే ఆధారపడి ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. తాను దారి చూపగలనని, కానీ విజయాన్ని అందుకునేది వారి కృషి ద్వారానేనన్నారు. వచ్చే మూడు నెలలు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, మంచి ఆలోచనలతో, క్రమశిక్షణతో చదివి ఉద్యోగం సాధిస్తే వారి కుటుంబాల్లో ఆనందం నింపినట్లవుతుందని, అదే తనకు నిజమైన సంతృప్తినిస్తుందన్నారు.

**పరిశ్రమలకు ప్రభుత్వం పూర్తి సహకారం**

మంథని క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ ప్రతినిధులు, ఇతర పరిశ్రమల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. పరిశ్రమలకు అవసరమైన విద్యుత్, నీరు, రహదారులు, ఇతర మౌలిక వసతులు అన్నింటినీ ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. రాష్ట్రానికి మరిన్ని నాణ్యమైన పెట్టుబడులు రావడం, స్థానిక యువతకు అధిక ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

**బొక్కలవాగు అభివృద్ధితో నీటి సంరక్షణ -- ప్రజలకు మెరుగైన వాతావరణం**

హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ సంస్థ తమ సీఎస్ఆర్ కార్యక్రమం ప్రాజెక్ట్ షైన్ కింద చేపడుతున్న బొక్కలవాగు చెక్‌డ్యామ్ అప్‌గ్రేడేషన్, సుందరీకరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. బొక్కలవాగు వద్ద గార్డెనింగ్, ఓపెన్ జిమ్ అప్‌గ్రేడేషన్, వాకింగ్ ట్రాక్, చిన్నారుల కోసం పార్కు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా బొక్కలవాగులో పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు డీ-సిల్టింగ్ పనులు కూడా చేపడుతున్నామన్నారు. బొక్కలవాగు బండ్ అభివృద్ధి పనులకు గతంలో 2011-12లో అనుమతులు లభించాయని, ప్రస్తుతం వాటిని ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. ఈ అభివృద్ధి పనులను సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా చేపట్టాలని హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ సంస్థను కోరగా, సంస్థ ప్రతినిధులు సానుకూలంగా స్పందించి రూ.2 కోట్ల నిధులు అందించారని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా నీటి సంరక్షణ మెరుగుపడటంతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం, మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రభుత్వం, పరిశ్రమలు కలిసి పనిచేస్తే సమాజానికి మరింత మేలు చేయగలమని పేర్కొంటూ ఈ కార్యక్రమాన్ని చేపట్టిన హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ సంస్థను అభినందించారు. తెలంగాణ వ్యాప్తంగా మరిన్ని పరిశ్రమలు కూడా ఇలాంటి సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. బొక్కలవాగు సుందరీకరణ, గార్డెనింగ్, డీ-సిల్టింగ్, వాకింగ్ ట్రాక్, జిమ్, చిన్నారుల పార్కు తదితర అభివృద్ధి పనులను అత్యున్నత నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండరాదని స్పష్టం చేశారు. అనంతరం మంథని ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో నిర్వహించిన నూతన డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొని ప్రభుత్వ వైద్య సేవల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక వసతులు, వైద్య పరికరాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

**మంథని అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

మంథని పట్టణంలో రోడ్ల విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పలు మౌలిక వసతుల పనులను ప్రభుత్వం ప్రాధాన్యతతో చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీవో సురేష్ , మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, సయేందర్ రెడ్డి,తహసిల్దార్ ఆరిఫ్ ఉద్దీన్ ,ప్రజాప్రతినిధులు, హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ ప్రతినిధులు, ఇతర పరిశ్రమల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నాణ్యమైన గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు

# అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

**: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**




**మహబూబ్ నగర్, ఆగస్టు 3(స్కైన్యూస్ ):**జిల్లాలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు నాణ్యనతతో రూపొందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఆటోమేటిక్ స్కోరింగ్, గ్రేడింగ్ విధానంలో జిల్లాకు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.సోమవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు పీపుల్స్ ప్లాన్ క్యాంపెయిన్--2026ను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రతి శాఖపై ఉందన్నారు. గ్రామ పంచాయతీ, మండల పంచాయతీ, జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు.గ్రామాభివృద్ధి ప్రణాళికలు 16వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, గ్రామ పంచాయతీల సొంత ఆదాయ వనరులు, అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాల సమన్వయంతో రూపొందించాలని తెలిపారు. ఈ ప్రణాళికల్లో ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాలు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు తదితర భాగస్వాములందరూ చురుకుగా పాల్గొనాలని కోరారు.జిల్లా, మండల స్థాయిలో ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, ఇప్పుడు గ్రామ స్థాయిలో గ్రామసభల ద్వారా గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన చేపట్టాలని తెలిపారు. ప్రతి గ్రామంలో గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలు, అభివృద్ధి ప్రాధాన్యతలను ప్రణాళికల్లో ప్రతిబింబించేలా చర్యలు తీసుకోవాలన్నారు.విద్య, వైద్యం, మహిళా మరియు శిశు సంక్షేమం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి తదితర అన్ని శాఖలకు సంబంధించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలు, అందుబాటులో ఉన్న నిధులు, చేపట్టే కార్యకలాపాల వివరాలను డేటా కలెక్షన్ ఫార్మాట్ల ద్వారా గ్రామ, మండల స్థాయి అధికారులకు అందించాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు గ్రామసభలు, మండలసభల్లో తప్పనిసరిగా పాల్గొని నాణ్యమైన ప్రణాళికల రూపకల్పనకు సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులందరూ తమ పరిధిలోని మండల, గ్రామ స్థాయి అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి, పీపుల్స్ ప్లాన్ క్యాంపెయిన్ విజయవంతానికి కృషి చేయాలని కలెక్టర్ కోరారు.ఈసారి గ్రామాభివృద్ధి ప్రణాళికలకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం ఆటోమేటిక్ స్కోరింగ్, గ్రేడింగ్ విధానం అమల్లో ఉంటుందని తెలిపారు. గ్రామ పంచాయతీలు రూపొందించే ప్రణాళికలు ఏ, బి, సి, డి గ్రేడ్లలో ఏ స్థాయిలో ఉన్నాయో ఆన్‌లైన్ విధానంలో మూల్యాంకనం జరుగుతుందని పేర్కొన్నారు. అందువల్ల అన్ని శాఖల కార్యక్రమాలు, పథకాలు, నిధులు, కార్యకలాపాలు సమగ్రంగా ప్రణాళికల్లో పొందుపరిస్తేనే అత్యుత్తమ గ్రేడ్ సాధించవచ్చున్నారు.శాఖల వారీగా అమలు చేస్తున్న పథకాల కార్యనిర్వహణ, నిధుల విడుదల, చెల్లింపులు, అమలు ప్రక్రియలో ఎలాంటి మార్పు ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆయా శాఖల కార్యాచరణ యథావిధిగా కొనసాగుతుందని, గ్రామాభివృద్ధి ప్రణాళికలో కేవలం సమగ్ర సమాచారాన్ని పొందుపరచడమే ఈ ప్రక్రియ ఉద్దేశమని తెలిపారు. ఈ విషయాన్ని అన్ని స్థాయి అధికారులకు స్పష్టంగా తెలియజేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. ఎల్. బి హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, డి.ఆర్.ఓ.నిర్మల,భూ సేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, జెడ్. పి. సి. ఈ. ఓ, ఇంచార్జి డి. పి.ఓ వెంకట రెడ్డి, డి. ఆర్. డి.ఓ నరసింహులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బోనాలు... తెలంగాణ సంస్కృతికి ప్రతీక

పండుగలు కేవలం ఆనందాన్ని పంచే సందర్భాలు మాత్రమే కావు. అవి ఒక సమాజం చరిత్రను, సంస్కృతిని, విశ్వాసాలను, జీవన విధానాన్ని తరతరాలకు అందించే సజీవ సంప్రదాయాలు. అలాంటి సంప్రదాయాల్లో తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, హైదరాబాద్ నగర ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెప్పే పండుగ ఆషాఢ బోనాలు. ఇది ఒక మతపరమైన ఉత్సవం మాత్రమే కాదు. భక్తి, సంస్కృతి, స్త్రీశక్తి, సామాజిక ఐక్యత, ప్రజల విశ్వాసం, తెలంగాణ అస్తిత్వం-- ఈ ఆరు విలువల సమ్మేళనం. తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో ముడిపడిన ఈ పండుగ నేడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సాంస్కృతిక వేడుకగా ఎదిగింది.

హైదరాబాద్ ఒక విశ్వనగరం. ప్రపంచంలోని అనేక దేశాల ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారు. అత్యాధునిక సాంకేతికత, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ పెట్టుబడులతో పాటు తన సాంస్కృతిక మూలాలను సజీవంగా నిలబెట్టుకున్న అరుదైన నగరం హైదరాబాద్. చార్మినార్ వైభవం, గోల్కొండ చరిత్ర, భాగ్యనగర ఆత్మ-- ఇవన్నీ బోనాల సందర్భంగా మరింత సజీవంగా కనిపిస్తాయి. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయం నుంచి లాల్‌దర్వాజ, అక్కన్న మాదన్న దేవాలయం, గోల్కొండ ఎల్లమ్మ, బల్కంపేట ఎల్లమ్మ, కట్టమైసమ్మ, పోచమ్మ, పెద్దమ్మ ఆలయాల వరకూ ప్రతి వీధి భక్తి పారవశ్యంతో కళకళలాడుతుంది. ఇది కేవలం ఉత్సవం కాదు; హైదరాబాద్ తన మూలాలను మరువలేదని ప్రపంచానికి చెప్పే గొప్ప ప్రకటన. 1813 ప్రాంతంలో హైదరాబాద్‌లో ప్లేగు వ్యాధి విజృంభించినప్పుడు ప్రజలు అమ్మవారిని ప్రార్థించి, వ్యాధి నివారణ అనంతరం కృతజ్ఞతగా బోనం సమర్పించారనే కథనం ప్రచారంలో ఉంది. కాలక్రమేణా అది ఒక కుటుంబ ఆచారం నుంచి సమాజ ఉత్సవంగా, తదుపరి తెలంగాణ సాంస్కృతిక గుర్తింపుగా రూపాంతరం చెందింది. 'బోనం' అంటే భోజనం. కానీ దాని వెనుక ఉన్న భావం అంతకంటే గొప్పది. తల్లి తన బిడ్డకు ప్రేమతో అన్నం పెట్టినట్లే, భక్తుడు అమ్మవారికి కృతజ్ఞతతో నైవేద్యం సమర్పించడం.

ఈ పండుగలో మహిళల పాత్ర అత్యంత విశిష్టమైనది. తలపై బోనం మోసుకుని అమ్మవారికి సమర్పించే ప్రతి మహిళలో భక్తి మాత్రమే కాదు, కుటుంబానికి, సమాజానికి ఆధారమైన శక్తి ప్రతిఫలిస్తుంది. తెలంగాణ సంస్కృతిలో స్త్రీకి ఉన్న గౌరవాన్ని బోనాలు అత్యంత అందంగా ఆవిష్కరిస్తాయి. పోతురాజు వీరనృత్యం ధైర్యానికి ప్రతీక. రంగం భవిష్యత్తుపై ప్రజల విశ్వాసానికి ప్రతీక. ఘటాల ఊరేగింపులు సామూహిక భక్తికి ప్రతీక. డప్పుల మోత తెలంగాణ జానపద సంస్కృతికి ప్రతిధ్వని. ఈ సంప్రదాయాలన్నీ కలిసి బోనాలను ప్రపంచంలోనే ప్రత్యేకమైన ప్రజా సాంస్కృతిక ఉత్సవంగా నిలబెడుతున్నాయి.

## శ్రీ దుర్గమ్మ తల్లి బోనాల మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని దుండిగల్‌లో నిర్వహించిన శ్రీ దుర్గమ్మ తల్లి బోనాల మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కూన శ్రీశైలం గౌడ్ ఆ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నరు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీ దుర్గమ్మ తల్లి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలం గౌడ్ శాలువాతో ఘనంగా సత్కరించి తమ కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేష్ ముదిరాజ్, 296 డివిజన్ ప్రెసిడెంట్ జక్కుల మల్లేష్, కాంగ్రెస్ నాయకులు ఆకుల ప్రేమ్, ఉదయ్ గౌడ్, బాల్ రెడ్డి, నవీన్ గౌడ్, ఆకుల మల్లేష్, కావలి శివకుమార్, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రేణుకా ఎల్లమ్మ కళ్యాణంలో పాల్గొన్న ఆకారపు అరుణ్ పటేల్



**ఉప్పల :** రామంతాపూర్, శ్రీనగర్ కాలనీలోని భారత్ నగర్లో అత్యంత వైభవంగా జరిగిన రేణుకా ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం లో ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. నియోజకవర్గ ప్రజలందరిపై ఆ ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో అరుణ్ పటేల్ తో పాటు వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజి రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు మెంగ శోభా,మెంగ రవి, అరుణ్ సాయి, యస్ రామ్ రెడ్డి,రాపోలు శ్రీనివాస్ కాలనీవాసులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## బాలాజీ ఎంక్లేవ్ ప్రత్యేక సానిటేషన్ డ్రైవ్ లో బన్నాల





**ఉప్పల్ :** బీరప్ప గడ్డ డివిజన్లోని బాలాజీ ఎంక్లేవ్ కాలనీలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ లో కాలనీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వేణుగోపాల్ రెడ్డి,ఓంకార్ సింగ్ వారి కాలనీ సభ్యులతో కలిసి పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్,గత నెల బాలాజీ ఎన్క్లేవ్ కాలనీ పర్యటనలో భాగంగా కాలనీలోని పలు వీధుల్లో రోడ్డు సైడ్ చెత్తా చెదారాలు నిండిపోయి ఉన్న విషయాన్ని కాలనీ అధ్యక్ష కార్యదర్శులు మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ కు తెలపడం జరిగింది.అందులో భాగంగా ఆదివారం బాలాజీ ఎంక్లేవ్ కాలనీలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నీ కార్పొరేటర్ గీతా ప్రవీణ్ ఏర్పాటు చేసి కాలనీ లోని పలు వీధుల్లో చెత్త మరియు గార్బేజ్ తొలగించడం జరిగింది. అదేవిధంగా బాలాజీ ఎంక్లేవ్ పార్క్ మరియు నార్త్ కళ్యాణ్ పూరి ఎంట్రన్స్ లో గార్బేజ్ నిండిపోతున్న విషయాన్ని కార్పొరేటర్ దృష్టికి తేవడం జరిగింది, అందులో భాగంగా బాలాజీ ఎంక్లేవ్ నార్త్ కళ్యాణ్పురి వారి సౌజన్యంతో కెమెరాలను ఏర్పాటు చేయిస్తామని మాజీ కార్పొరేటర్ తెలపడం జరిగింది కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు గుమ్మకొండ వేణుగోపాల్ రెడ్డి, ఓంకార్ సింగ్, కమిటీ సభ్యులు రమణ గుప్తా, టీజీ వెంకటేష్ డి.శంకర్, సిహెచ్ ప్రవీణ్ రావు, శరభయ్య, శ్రీనివాస చారి, డి వరప్రసాద్, పి సిద్దేశ్వర రావు గౌతమ్, శానిటేషన్ సూపర్వైజర్ శ్రీనివాస్ వారి సిబ్బంది పాల్గొన్నారు.

బిజినెస్

## దేశ సరిహద్దు జిల్లాల బ్యాంకులకు ఆర్‌బీఐ కీలక ఆదేశాలు



దేశంలో నకిలీ కరెన్సీ చలామణిని అరికట్టేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) మరో కీలక నిర్ణయం తీసుకుంది. పొరుగు దేశాలతో సరిహద్దులు పంచుకుంటున్న జిల్లాల్లోని అన్ని బ్యాంకు శాఖల్లో నోట్ల ప్రామాణికతను పరిశీలించే (అథెంటికేషన్), వేరుచేసే (సార్టింగ్) యంత్రాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. నకిలీ నోట్లను గుర్తించడంలో కొన్ని బ్యాంకుల పనితీరు సంతృప్తికరంగా లేదని గమనించిన ఆర్‌బీఐ, ఈ మేరకు నూతన సర్క్యులర్‌ను విడుదల చేసింది. బ్యాంకులకు వచ్చే ప్రతి నోటు ప్రామాణికతను యంత్రాల ద్వారా విధిగా నిర్ధారించుకోవాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఒకవేళ నకిలీ నోటును గుర్తిస్తే, దాన్ని వెంటనే స్వాధీనం చేసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగదారుడికి తిరిగి ఇవ్వకూడదని లేదా బ్యాంకులోనే ధ్వంసం చేయకూడదని తేల్చిచెప్పింది. గుర్తించిన నకిలీ నోట్ల వివరాలను నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా సంబంధిత అధికారులకు నివేదించాలని సూచించింది. ఈ నిబంధనల అమలులో భాగంగా, బ్యాంకుల్లో నగదు లావాదేవీలు నిర్వహించే ప్రతి ఉద్యోగికి అసలు నోట్ల భద్రతా ఫీచర్లపై సమగ్ర శిక్షణ ఇవ్వాలని ఆర్‌బీఐ ఆదేశించింది. ఈ శిక్షణ ప్రక్రియను 2026 అక్టోబర్ 31 నాటికి పూర్తి చేయాలని గడువు విధించింది. నకిలీ నోట్లపై నిఘా ఉంచేందుకు ఏర్పాటు చేసిన 'ఫోర్జ్ నోట్ విజిలెన్స్' (ఎఫ్ఎన్‌వీ) సెల్స్ ద్వారా డేటాను విశ్లేషించి, నకిలీ కరెన్సీ ఎక్కువగా చలామణి అవుతున్న ప్రాంతాలను (హాట్‌స్పాట్‌లు) గుర్తించాలని పేర్కొంది. బ్యాంకులో ఎవరైనా నకిలీ నోటు అందజేస్తే, దానిపై స్టాంప్ వేసి, సదరు వ్యక్తికి నిర్దేశిత నమూనాలో రసీదు ఇవ్వాలని ఆర్‌బీఐ తెలిపింది. ఈ ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని బ్యాంకు శాఖల్లో వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించింది. ఈ పటిష్ట చర్యల ద్వారా నకిలీ కరెన్సీని గుర్తించి, నివేదించే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆర్‌బీఐ లక్ష్యంగా పెట్టుకుంది.

## ఫ్లిప్‌కార్ట్ వినియోగదారులకు రివార్డుగా నెట్‌ఫ్లిక్స్ మొబైల్ ప్లాన్

ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్.. ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్‌తో జట్టు కట్టింది. తన ప్లస్ లాయల్టీ మెంబర్లకు నెట్‌ఫ్లిక్స్ మొబైల్‌ప్లాన్‌ను ఉచితంగా అందించనుంది. నెలవారీ షాపింగ్ ఆధారంగా ఈ రివార్డును ఇవ్వనుంది. ఆగస్టు 1 నుంచి కొత్త రివార్డు ప్రోగ్రామ్‌ను ప్రారంభించనుంది. ఒక క్యాలెండర్ నెలలో నాలుగు సార్లు రూ.299, లేదా అంతకంటే ఎక్కువ మొత్తం షాపింగ్ చేసిన వినియోగదారులకు ఈ మొబైల్ ప్లాన్ ఉచితంగా లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్, ఫ్లిప్‌కార్ట్ గ్రాసరీ, ఫ్లిప్‌కార్ట్ మినిట్స్‌లో ఆర్డర్లకు ఇది వర్తిస్తుంది. నాలుగో ఆర్డర్ పూర్తయిన నాటి నుంచి 30 రోజుల పాటు మొబైల్ ప్లాన్ చెల్లుబాటు అవుతుంది. ఆ తదుపరి నెల కూడా నిర్ణీత ఆర్డర్ల విలువ దాటగానే నెట్‌ఫ్లిక్స్ మొబైల్ ప్లాన్‌ను అన్‌లాక్ చేయొచ్చు. ప్రతి నెలా 4 ఆర్డర్లు పూర్తి చేయడం ద్వారా ఈ ప్రయోజనాన్ని ఉచితంగా కొనసాగించొచ్చు. ఫ్లిప్‌కార్ట్ ప్లస్ సభ్యులు కానివారూ ఈ ప్రయోజనాన్ని పొందొచ్చు. ఇందుకోసం 12 నెలల వ్యవధిలో 15 ఆర్డర్లు పూర్తి చేయాల్సి ఉంటుంది. అప్పుడే ప్లస్ మెంబర్‌షిప్‌కి అర్హత సాధిస్తారు. అయితే, మొబైల్ ప్లాన్‌లో ఒక మొబైల్/టాబ్లెట్‌లో ఏదో ఒకదాంట్లో మాత్రమే చూసేందుకు వీలవుతుంది.

# ఒక్కరోజులో రూ.39 లక్షల కోట్లు..
# మైక్రోసాఫ్ట్ సంచలనం!

టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ షేర్ మార్కెట్లో సరికొత్త రికార్డు సృష్టించింది. కంపెనీ షేర్లు ఒక్క ట్రేడింగ్ సెషన్‌లో ఏకంగా 15.5 శాతం దూసుకెళ్లడంతో.. మైక్రోసాఫ్ట్ మార్కెట్ విలువ దాదాపు 450 బిలియన్ డాలర్లు (సుమారు రూ.39 లక్షల కోట్లు) పెరిగింది. ఒకే రోజులో ఏ లిస్టెడ్ కంపెనీ సాధించని స్థాయిలో మార్కెట్ క్యాపిటలైజేషన్ పెరగడం ఇదే తొలిసారి. గతంలో ఎన్విడియా నెలకొల్పిన సుమారు 441 బిలియన్ డాలర్ల రికార్డును మైక్రోసాఫ్ట్ అధిగమించింది. మైక్రోసాఫ్ట్ షేర్లలో ఈ భారీ ర్యాలీకి ప్రధాన కారణం కంపెనీ ప్రకటించిన బలమైన త్రైమాసిక ఫలితాలే. జూన్‌తో ముగిసిన 2026 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో కంపెనీ ఆదాయం 18 శాతం పెరిగి 90 బిలియన్ డాలర్లకు చేరింది. ముఖ్యంగా క్లౌడ్ విభాగం 'అజూర్' అంచనాలను మించి వృద్ధిని నమోదు చేయడం ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని పెంచింది.

**అజూర్ వృద్ధి 43 శాతం**

మైక్రోసాఫ్ట్‌కు కీలక ఆదాయ వనరుగా మారిన అజూర్ క్లౌడ్ సేవల ఆదాయం నాలుగో త్రైమాసికంలో ఏడాది ప్రాతిపదికన 43 శాతం పెరిగింది. ఇది మార్కెట్ అంచనాలను అధిగమించింది. అంతేకాదు, వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అజూర్ వృద్ధి దాదాపు 45 శాతంగా ఉండొచ్చని కంపెనీ అంచనా వేసింది. దీంతో కృత్రిమ మేధ (ఏఐ) సేవలకు సంస్థలు భారీగా ఖర్చు చేయడం కొనసాగిస్తున్నాయనే సంకేతం ఇన్వెస్టర్లకు లభించింది. మరో కీలక మైలురాయిగా.. అజూర్ వార్షిక ఆదాయం తొలిసారిగా 100 బిలియన్ డాలర్లను దాటింది. మైక్రోసాఫ్ట్ క్లౌడ్ మొత్తం వార్షిక ఆదాయం కూడా 200 బిలియన్ డాలర్ల స్థాయిని అధిగమించింది. దీంతో కంపెనీ భారీగా చేస్తున్న డేటా సెంటర్లు, చిప్‌లు, ఏఐ మౌలిక సదుపాయాల పెట్టుబడులు కేవలం ఖర్చులుగానే మిగలకుండా ఆదాయాన్ని సృష్టిస్తున్నాయనే అభిప్రాయం బలపడింది. జూలై 30న ర్యాలీ అనంతరం మైక్రోసాఫ్ట్ మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు 3.35 ట్రిలియన్ డాలర్లకు చేరింది. తాజా మార్కెట్ డేటా ప్రకారం ఎన్విడియా సుమారు 5 ట్రిలియన్ డాలర్లకు పైగా మార్కెట్ విలువతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.



# మా ఏఐ మోడల్.. 3 కంపెనీలను హ్యాక్ చేసింది

క్లాడ్ చాట్‌బాట్ సృష్టికర్త, ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఆంత్రోపిక్ సంచలన విషయాన్ని బయటపెట్టింది. టెస్టింగ్ దశలో ఉన్న తమ ఏఐ మోడళ్లు పొరపాటున మూడు ఇతర కంపెనీల నెట్‌వర్క్‌లలోకి ప్రవేశించి హ్యాక్ చేశాయని ప్రకటించింది. తమ ఏఐ వ్యవస్థ ఇంకో ఏఐ కంపెనీ మోడల్‌ను హ్యాక్ చేసిందని చాట్‌జీపీటీ రూపకర్త ఓపెన్‌ఏఐ ఇటీవల వెల్లడించిన నేపథ్యంలో.. తాము కూడా అప్రమత్తమై సైబర్‌సెక్యూరిటీ సమీక్ష చేపట్టినట్లు తెలిపింది. రికార్డులు పరిశీలిస్తుండగా.. ఈ ఏడాది ప్రారంభంలో హ్యాకింగ్ జరిగినట్లు గుర్తించామంది. హ్యాకింగ్ వల్ల ప్రభావితమైన సంస్థలను తాము ఇప్పటికే సంప్రదించామని ఆంత్రోపిక్ వెల్లడించింది. అయితే వాటి వివరాలు మాత్రం వెల్లడించలేదు. ఆయా సంస్థలు బలహీనమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించడం వల్ల వాటి మౌలిక సదుపాయాలను క్లాడ్ దెబ్బతీసిందని పేర్కొంది. ఇది దురుద్దేశంతో చేసిన పని కాదని.. ఒక మోడల్ సామర్థ్యం ఏమిటో తెలియాలంటే దానిని విడుదల చేయడానికి ముందు భద్రతా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపింది. ఆ సమయంలో అనుకోకుండా ఈ సైబర్ భద్రత ఘటన చోటుచేసుకున్నట్లు వివరించింది. దీంతో అత్యాధునిక ఏఐ మోడళ్లతో సైబర్ భద్రతకు సవాళ్లు ఏర్పడవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.




# చీఫ్ సెలెక్టర్ రేసులో అశ్విన్..
# వరల్డ్‌కప్ ముందే బాధ్యతలు చేపట్టేనా!

వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ కంటే ముందు చీఫ్ సెలెక్టర్‌గా సేవలందిస్తున్న అజిత్ అగార్కర్ పదవీకాలం ముగియనుంది. సెప్టెంబర్‌తో అగార్కర్ కాలపరిమితి పూర్తి కానున్నందున తదుపరి ప్రధాన సెలెక్టర్ ఎవరు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆశావహులు చాలామందే ఉన్నప్పటికీ మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ రేసులో అందరికంటే ముందున్నాడనే కథనాలు వస్తున్నాయి. బీసీసీఐ కూడా అగార్కర్ స్థానంలో మాజీ ఆఫ్ స్పిన్నరైన యశ్‌కు బాధ్యతలు అప్పగించనుందనే వార్తలు నెట్టింట వైరలవుతున్నాయి. సీనియర్లను పక్కన పెట్టేసి.. కుర్రాళ్లకు పెద్దపీట వేయడంతో పాటు స్క్వాడ్ ఎంపిక కూడా అస్సలు బాగుండడం లేదనే ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లండ్ గడ్డపై టీ20 సిరీస్ ఓటమితో హెడ్‌కోచ్ గౌతం గంభీర్, ప్రధాన సెలెక్టర్ అగార్కర్ పనితీరపై విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో, పదవీకాలం ముగింపు దశలో ఉన్న గవార్కర్‌ను పొడిగిస్తారా? లేదా? అనేదానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా.. అప్పుడే అగార్కర్ వారసుడు ఎవరు? అనే చర్చ మొదలైంది. ఎందుకంటే.. మరో నెల రోజుల్లో(సెప్టెంబర్) చీఫ్ సెలెక్టర్‌గా అగార్కర్ పదవీకాలం ముగియనుంది. దాంతో, కాబోయే ప్రధాన సెలెక్టర్ ఎవరు? పోటీలో ఎవరెవరు ఉన్నారు? అనేది ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.



అగార్కర్ అనంతరం మాజీ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ ప్రధాన సెలెక్టర్ పదవిని చేపట్టే అవకాశముందనే వార్తలు వినిపిస్తున్నాయి. వచ్చే వన్డే ప్రపంచకప్ 2027 ముందే అశ్విన్ నియామకం జరుగుతుందని ఆన్‌లైన్‌లో కథనాలు వస్తున్నాయి. దాంతో.. ఒక్కసారిగా అశ్విన్ ఎక్స్‌లో ట్రెండ్ అవుతున్నాడు. రిటైర్మెంట్ అనంతరం సొంత యూట్యూబ్ ఛానెల్లో క్రికెట్ విశ్లేషణలు చేస్తున్న స్పిన్ దిగ్గజం మాత్రం ఈ వైరల్ వార్తలపై స్పందించలేదు. బీసీసీఐ సైతం అగార్కర్ మార్పుపై ఎలాంటి ప్రకటన ఇంకా చేయలేదు.

## భారత్‌కు తొలిసారి విచ్చేస్తున్న బ్రెజిల్.. కోల్‌కతాలో ఫ్రెండ్లీ మ్యాచ్..!



సాకర్ అభిమానులకు గుడ్‌న్యూస్. ఊహించినట్టుగానే బ్రెజిల్ ఫుట్‌బాల్ జట్టు భారత పర్యటన ఖరారైంది. ఆ దేశ సీనియర్ టీమ్ మొట్టమొదటిసారి ఇండియాకు రానుంది. ఫుట్‌బాల్‌ను అమితంగా ఇష్టపడే కోల్‌కతావాసులను అలరించేందుకు సాల్ట్ లేక్ స్టేడియంలో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడనుంది బ్రెజిల్ జట్టు. అక్టోబర్‌లో బ్లూ టైగర్స్‌తో ఈ మ్యాచ్ విషయాన్ని శుక్రవారం బ్రెజిలియన్ ఫుట్‌బాల్ సమాఖ్య అధికారికంగా వెల్లడించింది. ఫిఫా వరల్డ్‌కప్ జోష్ ముగిసినా.. భారత్‌లో మళ్లీ ఫుట్‌బాల్ సందడి మొదలవ్వనుంది. మేటి జట్లలో ఒకటైన బ్రెజిల్ అక్టోబర్‌లో ఇండియాకు వస్తోంది. భారత జట్టుతో మ్యాచ్ కోసం ఆ దేశ సీనియర్ జట్టు రావడం ఖరారైందని బ్రెజిలియన్ ఫుట్‌బాల్ సమాఖ్య వెల్లడించింది. ఫుట్‌బాల్ అంటే పడిచచ్చే జనమున్న కోల్‌కతాలో అక్టోబర్ 3వ తేదీన బ్లూ టైగర్స్‌ను బ్రెజిల్ ఢీకొట్టనుంది. 'ది గోట్ ఇండియా టూర్' పర్యటనలో లియోనల్ మెస్సీ బృందం అభిమానులతో మమేకమైన సాల్ట్ లేక్ మైదానంలో ఈ మ్యాచ్ జరుగనుంది. 'బ్రెజిల్ జాతీయ జట్టు షెడ్యూల్ కొనసాగుతోంది. ఆస్ట్రేలియాతో ఫ్రెండ్లీ మ్యాచ్ అనంతరం మా తర్వాతి అడుగు భారత్‌లో. మా ఫుట్‌బాల్ చరిత్రలో అదొక మరపురాని అధ్యాయం కానుంది. అక్టోబర్ 3వ తేదీన భారత గడ్డపై బ్రెజిల్ టీమ్ మొట్టమొదటి మ్యాచ్ ఆడనుంది. ఇందుకు కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియం వేదిక కానుంది. ఏళ్ల తరబడి బ్రెజిల్ ఫుట్‌బాల్ జట్టుకు భారీగా అభిమానులున్న కోల్‌కతాలో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడడం చాలా ప్రత్యేకం కానుంది. ఈ పర్యటన కోసం మేము ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నాం. మిమ్మల్ని కోల్‌కతాలో కలుస్తాం' అని సీబీఎఫ్ ఒక ప్రకటనలో పేర్కొంది. నెయ్‌మర్ సారథ్యంలోని బ్రెజిల్ ఫిఫా వరల్డ్‌కప్ 2026లో నాకౌట్ దశలోనే వెనుదిరిగిన విషయం తెలిసిందే.

స్పోర్ట్స్

## శతక్కొట్టిన లంక బ్యాటర్.. చిత్తుగా ఓడిన పాకిస్తాన్




సొంతగడ్డపై శ్రీలంక మహిళల జట్టు గర్జించింది. దంబుల్లా వేదికగా జరిగిన తొలి టీ20లో శ్రీలంక ఓపెనర్ ఇమేషా దులాని (64 బంతుల్లో 101 నాటౌట్) అజేయ సెంచరీ చేయడంతో పాకిస్తాన్‌పై ఆరు వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. ఇమేషాకు తోడుగా కెప్టెన్ చమేరి ఆటపట్టు (22 బంతుల్లో 39) రాణించడంతో పాక్ విధించిన 177 పరుగుల లక్ష్యాన్ని 19 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. పాక్ బౌలర్లలో నష్రా సంధు 2 వికెట్లు తీసింది. కాగా తన టీ20 కెరీర్‌లో తొలి సెంచరీ సాధించి ఇమేషా దులాని లంక తరఫున టీ20 క్రికెట్‌లో సెంచరీ సాధించిన రెండో మహిళా క్రికెటర్‌గా నిలిచింది. ఇంతకముందు 2024లో మలేషియాతో జరిగిన మ్యాచ్‌లో చమేరి ఆటపట్టు (119 నాటౌట్) లంక తరఫున శతక్కొట్టిన తొలి వుమెన్ బ్యాటర్‌గా నిలిచింది. సమరవిక్రమ (86 నాటౌట్, 2024లో ఐర్లాండ్‌పై) మూడో స్థానంలో ఉంది. అంతకముందు తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ వుమెన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. ఓపెనర్లు షావాల్ జుల్ఫికర్ (41 బంతుల్లో 63) అర్ధసెంచరీ చేయగా, మునీబా అలీ (24 బంతుల్లో 42) రాణించింది. ఎమన్ నసీర్ (21), అయేషా జఫర్ (17) పర్వాలేదనిపించారు. లంక బౌలర్లలో కవిషా దిల్హరి 2 వికెట్లు తీయగా, కాయా కవింది, సుగందిక, చమోడి ప్రబోద తలా ఒక వికెట్ తీశారు. ఇరుజట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ ఆదివారం జరగనుంది.



## త్రేత యుగంలో డిజైనర్ బ్లౌజ్‌లు,,


## 'రామాయణం' ట్రైలర్‌పై సోషల్ మీడియాలో చర్చ!

బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణం' ట్రైలర్ విడుదలైనప్పటి నుంచీ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రంలో రాణి కైకేయి పాత్రలో నటిస్తున్న ప్రముఖ నటి లారా దత్తా తొలి లుక్‌పై నెటిజన్లు రకరకాల కామెంట్లు చేస్తున్నారు. త్రేత యుగంలో సాగిన పురాణ గాథ ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాలో, లారా దత్తా ధరించిన మోడ్రన్ డిజైనర్ బ్లౌజ్, స్టైలిష్ హెయిర్‌స్టైల్ పట్ల పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. త్రేత యుగ కాలానికి తగినట్లుగా కాకుండా, ప్రస్తుత కాలానికి తగ్గట్టుగా నీట్‌గా కుట్టిన డిజైనర్ బ్లౌజ్, స్ట్రైట్ హెయిర్, సెలూన్ స్టైల్ హెయిర్‌స్టైల్‌తో లారా కనిపించడంపై విమర్శలు వస్తున్నాయి. త్రేత యుగంలో ప్లెయిన్ రా సిల్క్ చీరలు, హెవీ స్టోన్ ఎంబ్రాయిడరీ, కాంట్రాస్ట్ బ్లౌజ్‌లు ఎవరూ డిజైన్ చేసేవారు? అంటూ కొందరూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఇక లారా దత్తా లుక్ చూస్తుంటే రామాయణంలా కాకుండా, ఏవో ఏక్తా కపూర్ టీవీ సీరియల్ షూటింగ్‌లో పాల్గొన్నట్లుగా ఉందని మరికొందరు కామెంట్ చేశారు. ఇక సినిమా మేకర్స్ తీసుకున్న ఈ సృజనాత్మక స్వేచ్ఛ, కాస్ట్యూమ్ డిజైన్ పై వస్తున్న విమర్శలపై చిత్ర యూనిట్ ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి! మహర్షి వాల్మీకి రామాయణం, తులసీదాస్ రామచరితమానస్ ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నితీష్ తివారీ దర్శకత్వం వహిస్తుండగా, నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. ఈ భారీ బడ్జెట్ చిత్రంలో రణబీర్ కపూర్, యశ్, సాయి పల్లవి, రవి దూబే, అరుణ్ గోవిల్, వివేక్ ఒబెరాయ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా 2026 దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.




# అభిమానులకు అప్‌డేట్..
# కార్తీ 'సర్దార్ 2' టీజర్ లాంచ్‌కి టైం ఫిక్స్!

కోలీవుడ్ టాలెంటెడ్ హీరో కార్తీ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా సీక్వెల్ చిత్రం 'సర్దార్ 2'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో గ్లామరస్ బ్యూటీ మాళవిక మోహనన్ కథానాయికగా నటిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్. లక్ష్మణ్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా, ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ ఎప్పటికప్పుడు ఆసక్తికరమైన అప్‌డేట్స్ ఇస్తూ ప్రేక్షకుల్లో హైప్ క్రియేట్ చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి ఓ సాలిడ్ ట్రీట్ రాబోతున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ క్రమంలోనే హీరో కార్తీ తాజాగా ఒక పవర్-ప్యాక్డ్ కొత్త పోస్టర్‌ను తన సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తూ అభిమానులకు అదిరిపోయే గుడ్ న్యూస్ చెప్పారు. 'సర్దార్ 2' సినిమా టీజర్‌ను నేడు శుక్రవారం సాయంత్రం సరిగ్గా 7 గంటలకు విడుదల చేయబోతున్నట్లు ఆయన కన్ఫర్మ్ చేశారు. దీంతో కోలీవుడ్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లోని కార్తీ అభిమానులు ఈ హై-వోల్టేజ్ టీజర్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొదటి పార్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ కావడంతో, ఈ సీక్వెల్‌పై అంచనాలు తారాస్థాయికి చేరాయి. ఈ చిత్రంలో టాలెంటెడ్ నటుడు ఎస్.జె. సూర్య పవర్‌ఫుల్ విలన్ పాత్రలో నటిస్తుండటం సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతోంది. ఇక మొదటి భాగానికి అద్భుతమైన నేపథ్య సంగీతం అందించిన సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ సామ్ సీఎస్, ఈసారి కూడా తన మ్యూజిక్‌తో అదరగొట్టడానికి సిద్ధమయ్యారు. అన్ని హంగులను పూర్తి చేసుకుని ఈ సినిమాను సెప్టెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా అత్యంత గ్రాండ్‌గా పాన్ ఇండియా లెవెల్‌లో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. నేడు రాబోతున్న టీజర్ సినిమాపై ఉన్న అంచనాలను రెట్టింపు చేయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.





## ఎంఎస్ రాజు 'అగాధ' ట్రైలర్‌కు డేట్ ఫిక్స్..

## ఆధ్యాత్మిక థ్రిల్లర్‌పై అంచనాలు పెంచుతున్న మేకర్స్!

సీనియర్ దర్శకుడు, నిర్మాత ఎంఎస్ రాజు మరోసారి దర్శకుడిగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'అగాధ'. మిస్టికల్ డివైన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రలో నటిస్తుండగా, ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. తాజాగా ఈ సినిమా ట్రైలర్ విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. మేకర్స్ వెల్లడించిన వివరాల ప్రకారం ఆగస్టు 3, 2026 మధ్యాహ్నం 12 గంటలకు 'అగాధ' ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. ఈ ట్రైలర్ ద్వారా సినిమా కథ, ఆధ్యాత్మిక నేపథ్యం, మిస్టరీ ఎలిమెంట్స్‌పై మరింత స్పష్టత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. విడుదలకు ముందే ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచేలా ట్రైలర్ ఉండబోతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ ఇాూ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, అజయ్ కెఆర్ సమర్పిస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను ఎంఎస్ రాజు స్వయంగా నిర్వహించడం విశేషం. తన కెరీర్‌లో ఎన్నో విజయవంతమైన చిత్రాలు అందించిన ఆయన, ఈసారి విభిన్నమైన ఆధ్యాత్మిక థ్రిల్లర్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్లతో పాటు శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్, సిజ్జు, రోషన్, శ్రేయా రాణి రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రతి పాత్రకూ కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని చిత్రబృందం చెబుతోంది. భారీ స్థాయిలో రూపొందిన 'అగాధ' చిత్రం ఆగస్టు 14, 2026న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఒకేసారి విడుదల కానుండటంతో ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో తీసుకురాబోతున్నారు. ఇప్పటికే ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసిన చిత్రబృందం, ట్రైలర్ విడుదల అనంతరం మరింత దూకుడుగా ప్రమోషన్స్ నిర్వహించనుంది. మిస్టరీ, ఆధ్యాత్మికత, థ్రిల్లింగ్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కిన ఈ చిత్రం ఎంఎస్ రాజుకు దర్శకుడిగా మరో విజయాన్ని అందిస్తుందా అనే ఆసక్తి సినీ అభిమానుల్లో నెలకొంది.

# షూటింగ్‌లో రష్మిక మందన్నాకు గాయం.. వైద్యుల సూచనలు ఇవే..!




టాలీవుడ్‌ను గాయాలు వెంటాడుతున్నాయి. ఇప్పటికే పలువురు హీరోలు అనుకోకుండా ఆస్పత్రి పాలవ్వగా.. స్టార్ హీరోయిన్ రష్మిక మందన్నా సైతం గాయపడింది. 'మైసా', 'రణబాలి' చిత్రాలతో బిజీగా ఉన్న రష్మిక షూటింగ్‌లో యాక్షన్, నృత్య సన్నివేశాలు తెరకెస్తుండగా తీవ్రంగా గాయపడింది. సత్వరం చికిత్స అందించి.. ఆమెకు పూర్తిగా ఆరు వారాలు విశ్రాంతి సూచించారు డాక్టర్లు. దాంతో, తెలుగింటి కోడలు కొన్ని వారాలు షూటింగ్‌కు దూరం కానుంది. 'గీతగోవిందం', 'పుష్ప', 'గర్ల్‌ఫ్రెండ్' ఫేమ్ రష్మిక మందన్నా షూటింగ్ సమయంలో గాయపడింది. మైసా, రణబాలి చిత్రాల కోసం కష్టమైన యాక్షన్, నృత్య సన్నివేశాలు తీస్తుండగా రష్మిక గాయపడింది. దాంతో, వెంటనే ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లారు. రష్మికను పరీక్షించిన వైద్యులు గాయం తీవ్రత పెద్దదేనని, కనీసం ఆరువారాలు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.

# 'బట్వారా 1947' పోస్టర్ వైరల్..

## కనికా కపూర్‌ను చూసి కియారా అద్వానీ అనుకున్న నెటిజన్లు!



బాలీవుడ్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 'బట్వారా 1947' సినిమా విడుదలకు ముందే సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషీ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో సన్నీ డియోల్ ప్రధాన పాత్ర పోషిస్తుండగా, ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన ఓ క్యారెక్టర్ పోస్టర్ ఇప్పుడు నెట్టింట పెద్ద చర్చకు దారితీసింది. చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్న నటి కనికా కపూర్ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఫ్లోరల్ సూట్, లైట్ బ్రౌన్ దుపట్టాతో ఎలాంటి గ్లామర్ హంగులు లేకుండా సింపుల్ లుక్‌లో కనిపించిన కనికాను చూసిన నెటిజన్లు ఒక్కసారిగా షాక్ అయ్యారు. పోస్టర్‌లో ఆమె రూపం బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కియారా అద్వానీని పోలి ఉండటంతో సోషల్ మీడియాలో పోలికలపై పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. "ఇది కనికా కపూర్ కాదు.. కియారా అద్వానీయే కదా?", "పోస్టర్‌లో కియారా పేరు ఎందుకు లేదు?", "ఏఐతో పోస్టర్ డిజైన్ చేశారా?" అంటూ పలువురు నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు మాత్రం లైటింగ్, మేకప్, ఫోటో ఎడిటింగ్ కారణంగానే ఈ పోలికలు వచ్చాయని అభిప్రాయపడుతున్నారు. ఈ పోస్టర్ వైరల్ కావడంతో కనికా కపూర్ కూడా సరదాగా స్పందించారు. సోషల్ మీడియాలో తనను కియారా అద్వానీతో పోలుస్తూ వచ్చిన ఓ కామెంట్‌కు ఆమె నవ్వుతున్న ఎమోజీతో రిప్లై ఇచ్చారు. దీంతో ఈ చర్చకు మరింత ఊపు వచ్చింది. అయితే కనికా కపూర్ ఇతర ఫొటోలను పరిశీలిస్తే ఆమెకు కియారా అద్వానీతో పెద్దగా పోలికలు కనిపించవని అభిమానులు చెబుతున్నారు. ఈ ఒక్క పోస్టర్‌లో మాత్రమే కెమెరా యాంగిల్, లైటింగ్, మేకప్ కారణంగా ఇద్దరి రూపాల్లో సారూప్యత కనిపించిందని అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీకి చెందిన కనికా కపూర్ 'బట్వారా 1947' చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. అంతకుముందు 'ఏక్ దుజే కే వాస్తే 2' వంటి టెలివిజన్ సీరియల్స్, పలు వెబ్ సిరీస్‌లు, మోడలింగ్ రంగంలో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. పలు బ్యూటీ పేజెంట్లలో విజేతగా నిలిచిన ఆమె చిన్నప్పటి నుంచే నటిగా రాణించాలని కలలు కనగా, ఇప్పుడు భారీ బాలీవుడ్ ప్రాజెక్ట్‌తో సినీ రంగంలోకి అడుగుపెడుతున్నారు.

వార్తాతరంగాలు



# వికసిత భారత్ కోసం డ్రగ్స్‌కు దూరం



దేశ యువత మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారికి దూరంగా, శారీరకంగా, మానసికంగా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడే 'వికసిత భారత్' సంకల్పం నెరవేరుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో నేటి తరం యువత చూపిస్తున్న నిబద్ధత, సామాజిక స్పృహ తన నమ్మకాన్ని మరింత బలపరిచాయని ఆయన ప్రశంసించారు. నేడు 'నశా ముక్త్ యువ ఫర్ వికసిత భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని ప్రధాని వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించి ప్రసంగించారు. దేశవ్యాప్తంగా యువతను ఏకతాటిపైకి తెచ్చి, మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. 'మై భారత్' వాలంటీర్ల నేతృత్వంలో ఇది ఒక ప్రజా భాగస్వామ్య (జన్ భాగీదారీ) ఉద్యమంగా రూపుదిద్దుకుంది. "మనం ఒక గొప్ప, ముఖ్యమైన సంకల్పం కోసం ఇక్కడ సమావేశమయ్యాం. ఈ కార్యక్రమం కేవలం ఒక వ్యక్తి, కుటుంబం లేదా సమాజం కోసం కాదు. ఇది దేశం కోసం. వికసిత భారత్ దిశగా దేశం అడుగులు వేస్తున్నప్పుడు, యువత డ్రగ్స్ సమస్యకు దూరంగా ఉండటం అత్యవసరం" అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాశీతో ఈ కార్యక్రమానికి ఉన్న అనుబంధాన్ని ప్రధాని గుర్తుచేసుకున్నారు. "కాశీ ఎంపీగా, ఈ కార్యక్రమం గతేడాది పవిత్ర కాశీ క్షేత్రంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం కావడం నాకు చాలా సంతోషాన్నిచ్చింది. దీనివల్ల ఈ కార్యక్రమానికి శాస్త్రీయ దృక్పథంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, సాధువుల ఆశీస్సులు, సాంస్కృతిక వారసత్వం కూడా తోడయ్యాయి" అని ఆయన అన్నారు. 2025 జులైలో వారణాసిలో జరిగిన యూత్ స్పిరిచ్యువల్ సమ్మిట్‌లో దేశంలోని 125 ఆధ్యాత్మిక సంస్థలు ఐదేళ్ల రోడ్‌మ్యాప్‌తో 'కాశీ డిక్లరేషన్'ను ఆమోదించాయని, వారంతా లక్షలాది పౌరులకు సేవ చేస్తున్నారని మోదీ వివరించారు. యువతను దేశానికి 'అమృత తరం' (అమృత్ పీఢి)గా అభివర్ణించిన ప్రధాని.. "రాబోయే 20-25 ఏళ్లలో మీ జీవితాలకు మీరే దిశానిర్దేశం చేసుకుంటారు. 2047 నాటికి వికసిత భారత్ సంకల్పాన్ని సాకారం చేసేది మీరే. ఆ విజయాన్ని సంపూర్ణంగా ఆస్వాదించేది కూడా మీరే. దేశానికి మీ శక్తి, సృజనాత్మకత, ప్రతిభ ఎంతో అవసరం. కాబట్టి దేశం కోసం, మీ సొంత జీవితాల కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండండి" అని పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో భాగంగా ప్రతి ఆదివారం దేశవ్యాప్తంగా క్రీడా కార్యక్రమాలు, వాకథాన్‌లు, ధ్యాన శిబిరాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 'మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే యువతే వికసిత భారత్‌కు అసలైన బలం' అనే సందేశాన్ని దేశంలోని ప్రతి యువకుడికి చేర్చడమే ఈ ఉద్యమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# జెన్-జీ ఎప్పుడూ బీజేపీతోనే ఉన్నారు



జెన్ జీ ఎల్లప్పుడూ బీజేపీతోనే ఉన్నారని, సమాజంలోని ప్రతి వర్గం ప్రధాని మోదీకి అండగా నిలుస్తుందనే నమ్మకం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్ ఆదివారం అన్నారు. మోదీ ప్రారంభించిన 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్'ను గోయెల్ ప్రశంసించారు. దేశ యువత ఉత్సాహం భారతదేశాన్ని మాదకద్రవ్య రహితంగా మారుస్తుందని ఆయన అన్నారు. "జెన్ జీ ఎల్లప్పుడూ మాతోనే ఉన్నారు. జెన్ జీ మద్దతు, యువత శక్తి లేకుండా ప్రధాని మూడుసార్లు గెలిచి ఉండేవారు కాదు. సమాజంలోని ప్రతి వర్గం ప్రధాని మోదీతో నిలబడుతుందనే పూర్తి విశ్వాసంతో మేము ఉన్నాం. భారతదేశాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చాలనే మన యువత ఉత్సాహం వికసిత్ భారత్‌కు పునాది వేస్తుంది. ప్రధాని మోదీ దార్శనికతకు అనుగుణంగా యువతీ యువకులు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా సాగే ఈ సామూహిక పోరాటంలో చేరతారని నాకు పూర్తి నమ్మకం ఉంది" అని పీయూశ్ గోయెల్ అన్నారు.

**రాహుల్ గాంధీ భయపడుతున్నారు!**

మరోవైపు ప్రధాని మోదీకి యువతలో పెరుగుతున్న ఆదరణ చూసి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భయపడుతున్నారు అని గోయెల్? అన్నారు. రాహుల్ గాంధీ గతంలో తనకు తానే యువ నాయకుడిగా చెప్పుకుంటారు. కానీ ఇప్పుడు ఆ స్థాయి ఆదరణ ఆయనకు లేదు అని ఎద్దేవా చేశారు. యువ ఓటర్ల మద్దతు ఎప్పుడూ బీజేపీకే ఉంటుందని అన్నారు. భారత్?ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్న ప్రధాని మోదీ దార్శనికతకు వారు జై కొడుతున్నారని పేర్కొన్నారు.

**డ్రగ్స్ రహిత సమాజం కోసం**

1997 నుంచి 2012 మధ్య జన్మించిన యువతను జెన్ జీ ఉంటారు. ప్రధాని మోదీ ఈ రోజు 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్? భారత్ సంకల్ప్? అభియాన్?' ప్రారంభించి, 28 వేలకుపైగా ప్రాంతాల్లోని కోటి మందికి పైగా యువతతో వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా మాట్లాడారు. తాము ప్రారంభించిన ఈ కార్యక్రమం వ్యక్తిగత శ్రేయస్సుతో పాటు, కుటుంబాలు, సమాజం, యావత్ దేశ విస్తృత ప్రయోజనాలను అందిస్తుందని పేర్కొన్నారు. వికసిత్ భారత్? సంకల్ప్ అభియాన్? కోసం మాదకద్రవ్య రహిత సమాజం ఉండాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ముఖ్యంగా యువత శారీరకంగా ఆరోగ్యంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, ఆత్మవిశ్వాసంతో ఉండాలని అన్నారు. మాదకద్రవ్యాల వంటి వినాశకరమైన అలవాట్లకు శాశ్వతంగా దూరంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్‌లో భాగంగా చేపట్టిన మాదక ద్రవ్య రహిత యువత కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న ప్రధాని డ్రగ్స్ రహిత సమాజం దేశాభివృద్ధికి ఎంత అవసరమో వివరించారు. గతేడాది కాశీలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ఇప్పుడు 125 ఆధ్యాత్మిక సంస్థల సహకారంతో దేశవ్యాప్తంగా విస్తరిస్తోందన్నారు. యువత భవిష్యత్తును నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు కేంద్రప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోందని చెప్పారు. ఈ ఉద్యమం కేవలం ఓ వ్యక్తి కోసమో, ఓ కుటుంబం కోసమో కాదని వాటన్నింటికి మించి దేశం కోసమని ప్రధాని మోదీ తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే యువత శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా, ఆత్మవిశ్వాసంతో ఉండటమే కాకుండా డ్రగ్స్ లాంటి మహమ్మారులకు దూరంగా ఉండటం అత్యంత ఆవశ్యకమని ప్రధాని చెప్పారు. "ఓ యువకుడు డ్రగ్స్ మహమ్మారి బారినపడితే, అప్పుడు ఆ యువకుడే మాత్రమే కాదు ఓ కల కూడా ఓడిపోతుంది. ఓ కల అంతరించిపోతుంది. ఓ కుటుంబం ఓడిపోతుంది. కుటుంబమంతా నాశనం అవుతుంది. సమాజం కూడా అసహ్యించుకుంటుంది. మత్తు కేవలం శరీరానికి మాత్రమే నష్టం చేయదు. మత్తు ఓ తల్లి నవ్వును కూడా లాగేసుకుంటుంది" అని మోదీ అన్నారు.

## విద్యార్థుల ఆందోళనలో ఉగ్రవాదుల కుట్ర

# పోలీసు యూనిఫాంలో చొరబడేందుకు యత్నం

బంగాల్‌లో రెండ్రోజుల క్రితం పట్టబడ్డ అనుమానిత ఉగ్రవాది హమీమ్ మోండల్ పోలీసుల విచారణలో కీలక విషయాలు వెల్లడించాడు. ఇటీవల దిల్లీలో జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల చేపట్టిన ఆందోళనల్లోకి చొరబడి, అల్లర్లు సృష్టించేందుకు అతడు ప్లాన్ చేసినట్లు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఐజీ గౌరవ్ శర్మ తెలిపారు. బంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారిని సైతం లక్ష్యంగా చేసుకున్నాడని వెల్లడించారు. అతడికి సహకరించిన యువతిని కూడా అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

**బంగాల్ సీఎం లక్ష్యంగా ప్రణాళికలు**

బంగాల్లోని తూర్పు బర్ధమాన్ జిల్లాలో హమీమ్ మోండల్ అనే అనుమానిత ఉగ్రవాదిని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెండు రోజుల క్రితం అరెస్టు చేశారు. ఉగ్రసంస్థ జైషే మహ్మద్ హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు అతడు పనిచేస్తున్నట్లు ఐజీ గౌరవ్ శర్మ తెలిపారు. ముఖ్యమంత్రి సువేందు అధికారి కదలికలపై నిఘా ఉంచి, ఆయనకు ఎక్కడ భద్రత తక్కువగా ఉంటుందో సమాచారం సేకరించాలని పాకిస్థానీ హ్యాండ్లర్లు హమీమ్‌ను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. పోలీసు యూనిఫాంలో దిల్లీ జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసనల్లోకి చొరబడి, విధ్వంసం సృష్టించేందుకు కూడా అతడు ప్లాన్ చేశాడని చెప్పారు.

**పోలీసుల అదుపులో ఝార్ఖండ్ యువతి**



అయితే అతడు జంతర్‌మంతర్ వద్దకు వెళ్లాడా? లేదా? అనే విషయాన్ని తెలుసుకోవడానికి ఉగ్ర హ్యాండ్లర్‌లతో వారు చేసిన చాట్‌లను పరిశీలిస్తున్నామని ఐజీ గౌరవ్ శర్మ వివరించారు. హమీమ్‌కు సహకరించిన ఝార్ఖండ్ యువతి అర్పితా సర్కార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హనీట్రాప్ ద్వారా రాజకీయ నాయకులు, ప్రముఖుల నుంచి సమాచారం సేకరించి వాటిని హమీమ్‌కు పంపుతోందని పోలీసులు తెలిపారు. యువతి అర్పిత సర్కార్ హమీమ్‌కు ప్రియురాలని అధికారులు వెల్లడించారు. బంగాల్ మంత్రి ఉమేష్ రాయ్ కుమారుడిని హనీట్రాప్ ద్వారా కిడ్నాప్ చేసి, భారీగా డబ్బు వసూలు చేసేందుకు వీరిద్దరూ ప్లాన్ చేసినట్లు విచారణలో వెల్లడైంది. చిన్నస్థాయి నేతలను పరిచయం చేసుకొని వారి ద్వారా ప్రముఖ నేతలపై నిఘా పెట్టడం, తమ వారిని రాజకీయ పార్టీల్లో కార్యకర్తలుగా నియమించడం వంటి పనులకు హమీమ్ ఆమెను వినియోగించుకునేవాడు.

**దర్యాప్తు ముమ్మరం చేసిన అధికారులు**

పాకిస్థాన్‌కు చెందిన షెహజాద్ భట్టి గ్యాంగ్‌తో వీరికి సంబంధాలు ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. రానా, ఉజైర్, అబిద్ జట్, అనే పేర్లతో ఉన్న పాక్ హ్యాండ్లర్ల ద్వారా వీరికి ఆదేశాలు వచ్చినట్లు గుర్తించారు. ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా నిందితులిద్దరూ సమాచారాన్ని పంచుకునేవారని కనుగొన్నారు. సోషల్ మీడియా ద్వారా పరిచయమైన ఈ ఇద్దరూ, తర్వాత పాకిస్థాన్ ఆపరేటర్ల వలలో పడి తీవ్రవాద భావజాలాన్ని అలవర్చుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వీరు ఎస్?టీఎఫ్ కస్టడీలో ఉన్నారు. ఈ ఉగ్రవాద నెట్‌వర్క్‌కు సంబంధించి మరిన్ని వివరాలు రాబట్టేందుకు అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రసంస్థ జైషే మహ్మద్‌కు చెందిన ఐదుగురు ముష్కరులను గుజరాత్ ఏటీఎస్ అధికారులు గతంలో అరెస్టు చేశారు. పటన్ జిల్లా సిద్ధ్‌పూర్ తాలూకా ఖడియాల్ గ్రామంలో వీరందరినీ అదుపులోకి తీసుకున్నారు. వారిని బిలాల్ అబిద్‌భాయ్ షేరా, మహ్మద్ అయూబ్ కడివాలా, మహ్మద్ పాలన్‌పురి, షఫియా రాయిస్ ముక్తి, మహ్మద్ హసన్ కర్దియాగా గుర్తించారు. అహ్మదాబాద్‌ను కేంద్రంగా చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా తమ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు ఈ ముఠా ప్రయత్నించినట్లు ఏటీఎస్ అధికారులు పేర్కొన్నారు.

## ఈనెల 5న సీజేపీ కోర్ కమిటీ సమావేశం

కాక్రోచ్ జనతా పార్టీ తదుపరి కార్యాచరణపై దృష్టి పెట్టింది. ఈ నెల 5న భవిష్యత్తు కార్యాచరణను ఖరారు చేసేందుకు కాక్రోచ్ జనతా పార్టీ కోర్ కమిటీ సమావేశం జరగనుంది. ఛత్రపతి శంభాజీనగర్‌లోని అభిజీత్ దీప్కే నివాసంలో ఈ భేటీ జరగనుందని సీజేపీ వర్గాలు తెలిపాయి. వాలంటీర్లు, విద్యార్థులతో మాట్లాడి వారి ఆలోచనలు, సూచనలతో సమావేశానికి రావాలని సీజేపీ కోర్ కమిటీ సభ్యులకు సూచించినట్లు పేర్కొన్నాయి. ఈ ఉద్యమాన్ని క్షేత్రస్థాయికి ఎలా తీసుకెళ్లాలి? విద్యార్థులపై నమోదైన కేసుల ఉపసంహరణ విషయమై కేంద్రంపై ఎలా ఒత్తిడి తీసుకురావాలనే అంశాలపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. ఈ భేటీ తర్వాత జబీూ భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మరోవైపు జబీూ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే చిన్నారులతో కలిసి స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకొన్నారు. విద్యార్థులు, స్థానికులతోపాటు పొరుగు జిల్లాల నుంచి వచ్చిన సందర్శకులను కలిశారు. దిల్లీ జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా జబీూ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలకు దేశవ్యాప్తంగా జెన్-జీల నుంచి విశేష స్పందన లభించటమే కాకుండా గతవారం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన రాజీనామా చేయాల్సి వచ్చింది.

**అభిజీత్ దీప్కే కుటుంబ ఆర్థిక వ్యవహారాలపై దర్యాప్తు చేపట్టాలని డిమాండ్**

మరోవైపు కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కుటుంబ ఆర్థిక వ్యవహారాలపై దర్యాప్తు చేపట్టాలని సూరత్‌కు చెందిన ఆర్టీఐ కార్యకర్త అమిత్ తివారీ విజ్ఞప్తి చేశారు. మహారాష్ట్రలో రిటైర్డ్ ఉద్యోగి అయిన దీప్కే తండ్రి భగవాన్‌రావు కుమారుడి అమెరికా ఉన్నత విద్యకు అవసరమైన నిధులు ఎలా సమకూర్చారో పరిశీలించాలని ఆదాయపు పన్ను అధికారులకు ఫిర్యాదు చేశారు. అదే సమయంలో సీజేపీకి సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ ప్రకటించిన రూ.కోటి న్యాయ సహాయ నిధిపై కూడా విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ నిధిపై జీఎస్‌టీ వర్తిస్తుందా అనే విషయాన్ని కూడా సంబంధిత అధికారులు పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఇటీవల నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులు, నిర్వాహకులకు న్యాయ సహాయం అందించేందుకు ప్రజల విరాళాలతో ఆన్‌లైన్ లీగల్ ఎయిడ్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సీజేపీ వెల్లడించింది. ఈ నేపథ్యంలో సిబల్ విరాళాన్ని ప్రకటించారు. సీజేపీ నమోదైన రాజకీయ పార్టీ కాదని, అలాంటప్పుడు నిధులు స్వీకరించడం చట్టబద్ధమేనా అనే అంశాన్ని పరిశీలించాలని ఆర్టీఐ కార్యకర్త ఎన్నికల సంఘాన్ని కోరారు.

**దీప్కేకు స్వల్ప అస్వస్థత**

అంతకుముందు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే శనివారం అస్వస్థతకు గురయ్యారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లోని ఆయన నివాసంలో వైద్యులు పరీక్షించి విశ్రాంతి తీసుకోవాలని సలహా ఇచ్చారు. దీప్కేకు రక్తపోటు స్వల్పంగా తగ్గిందని, వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారని వైద్యులు వివరించారు. ఉదయం తన నివాసం పార్కింగ్ ప్రాంతంలో తనను కలిసేందుకు వచ్చిన కొందరితో మాట్లాడుతున్న సమయంలో ఆయన అసౌకర్యానికి గురైనట్లు తెలిపారు. ఉదయం 11.45 గంటల సమయంలో పార్కింగ్ వద్దకు వచ్చిన వారిని కలిసేందుకు కిందకు వచ్చిన దీప్కే కొద్దిసేపటికే అసహనంగా అనిపించడంతో ఇంటి వెనుక భాగానికి వెళ్లి వాంతి చేసుకున్నారు. దీప్కేను డాక్టర్ విశాల్ లహానే పరీక్షించారు. రక్తపోటు 100/60 స్థాయిలో స్వల్పంగా తక్కువగా ఉందని తెలిపారు. ప్రస్తుతం జ్వరం లేదని, విశ్రాంతి తీసుకుంటే కోలుకునే అవకాశం ఉందని లహానే వివరించారు.

**నీట్ ఎఫెక్ట్- రూ.7.5 కోట్లతో భద్రతకు టెండర్ల ఆహ్వానం**

మరోవైపు నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వివాదం నేపథ్యంలో ఎన్‌టీఏ (చీూా) పరీక్షల భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ప్రణాళికలు రచించింది. ఇందుకోసం ప్రధాన కార్యాలయం, ప్రాంతీయ కార్యాలయాలు, సర్వర్ గదులు, స్ట్రాంగ్‌రూమ్‌లు, ప్రశ్నపత్రాల నిల్వ కేంద్రాలకు 24 గంటల భద్రత కల్పించేందుకు సుమారు రూ.7.5 కోట్లతో టెండర్‌ను పిలిచింది. రెండేళ్ల పాటు అమలయ్యే ఈ ఒప్పందానికి ఆగస్టు 17 వరకు బిడ్లను ఆహ్వానించింది. భద్రతతో పాటు హౌస్‌కీపింగ్, సెక్యూర్ ప్రింటింగ్ (అత్యంత సురక్షితంగా ప్రశ్నపత్రాల ముద్రణ) కోసం టెండర్లను ఆహ్వానిస్తోంది.

## జంతర్ మంతర్ వేదికగా విధ్వంసానికి పాక్ ప్లాన్

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) పోలీసులు భారీ ఉగ్రకుట్రను భగ్నం చేశారు. పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్న హమిమ్ మండల్ అనే ఉగ్రవాద అనుమానితుడిని తూర్పు బర్ధమాన్ జిల్లాలో అరెస్ట్ చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఇటీవల జరిగిన నిరసనల్లో పోలీసుల వేషధారణలో చొరబడి అల్లర్లు సృష్టించాలనేది ఈ ఉగ్రవాద కుట్ర ప్రధాన లక్ష్యమని ఎస్టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ గౌరవ్ శర్మ తెలిపారు. అంతేకాకుండా, రాష్ట్ర ముఖ్యమంత్రి కదలికలపై నిఘా ఉంచాలని, రక్షణ లేని ప్రాంతాల వివరాలు సేకరించాలని పాకిస్థాన్ హ్యాండ్లర్లు హమిమ్‌ను ఆదేశించినట్లు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి నిందితుడిని కోర్టు 14 రోజుల ఎస్టీఎఫ్ కస్టడీకి అప్పగించింది. మరోవైపు, హమిమ్ ప్రియురాలు అర్పితా సర్కార్‌ను శుక్రవారం జార్ఖండ్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. షాజాద్ భట్టీ గ్యాంగ్‌కు చెందిన పాకిస్థాన్ హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు వీరిద్దరూ ఈ కుట్రకు పాల్పడ్డారు. రాజకీయ నాయకులు, ప్రముఖులను హనీట్రాప్ చేసి, వారి నుంచి రహస్య సమాచారం రాబట్టడంలో అర్పితా సర్కార్ సిద్ధహస్తురాలని పోలీసుల విచారణలో తేలింది. రాష్ట్ర మంత్రి ఉమేష్ రాయ్ కుమారుడిని హనీట్రాప్ చేసి కిడ్నాప్ చేయడానికి, కుటుంబం నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయడానికి వారు ప్లాన్ చేశారు. నిందితుల వద్ద నుంచి బ్రిటన్, మెక్సికో దేశాలకు చెందిన అంతర్జాతీయ సిమ్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పాకిస్థాన్ హ్యాండ్లర్లు రానా, ఉజైర్, అబిద్ జాట్, హమాద్‌లతో ఎన్‌క్రిప్టెడ్ యాప్స్ ద్వారా వీరు సంభాషణలు జరిపినట్లు ఎస్టీఎఫ్ గుర్తించింది. సోషల్ మీడియా ద్వారా రాడికలైజ్ అయిన వీరిద్దరూ గత నాలుగేళ్లుగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమై ప్రేమలో ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వీరి ఉగ్రమూలాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

## బీజేపీలో ఎక్కువ మంది చందా దొంగలే

అయోధ్యలోని రామమందిరానికి సంబంధించిన విరాళాల చోరీ ఆరోపణల వ్యవహారంలో బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది కాంగ్రెస్. ఆ పార్టీలో ఉన్నవారందరూ చందా దొంగలు కాకపోవచ్చు కానీ, ఎక్కువ మంది కచ్చితంగా అధికార పార్టీలోనే ఉన్నారని పేర్కొంది. రామమందిరంలో జరిగిన ఆ చోరీ కేవలం విరాళాలకు మాత్రమే పరిమితం కాలేదని, ఇది శిలా పూజ సమయం నుంచే మొదలైందని ఆరోపించింది. ఈ మేరకు సీనియర్ కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ ఆదివారం పలు వ్యాఖ్యలు చేశారు. "నేను స్వయంగా అవధ్ ప్రాంతానికి చెందినవాడిని. 1985 - 1990 మధ్య కాలంలో ఉత్తర్?ప్రదేశ్ ప్రభుత్వంలో పర్యటక శాఖ మంత్రిగా పనిచేశాను. రామజన్మభూమి ఉద్యమాన్ని నేను చాలా దగ్గరుండి చూశాను. బీజేపీలో ఉన్నవారందరూ చందా దొంగలు అని నేను అనడం లేదు, కానీ ఎక్కువ చందా దొంగలు మాత్రం బీజేపీలోనే ఉన్నారు." "రామమందిర నిర్మాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు రామ్ లల్లా హమ్ ఆయేంగే; మందిర్ వహీం బనాయేంగే' (రామలల్లా, మేము వస్తాం- అక్కడే మందిరాన్ని నిర్మిస్తాం) అనేది నినాదంగా ఉండేది. ఆ తర్వాత ఉత్తర్?ప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పుడు, మందిరం ఎప్పుడు నిర్మిస్తారని నేను అడిగాను. దానికి బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడని సమాధానం వచ్చింది" అని ఆయన చెప్పారు. "కేంద్రంలో అటల్ బిహారీ వాజ్‌పేయీ ప్రభుత్వం ఏర్పడినప్పుడు, నేను మళ్లీ అదే ప్రశ్న అడిగాను. అప్పుడు 'ప్రస్తుతానికి వేచి చూడండి' అని సమాధానం వచ్చింది. అసలు నిజం ఏమిటంటే - అయోధ్యలో రామమందిరం నిర్మించాలని బీజేపీ ఎప్పుడూ కోరుకోలేదు. కేవలం రామమందిర సమస్యను సజీవంగా ఉంచాలని మాత్రమే భావించింది" అని ఆరోపించారు. మరో నిజమేమిటంటే బీజేపీ రామమందిరాన్ని నిర్మించలేదని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నిర్మాణం జరిగిందని అన్నారు. అయితే రామమందిర నిర్మాణ సమయంలోనే లోక్‌సభ ఎన్నికలు జరిగాయని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మందిరం కంటే ఎన్నికలే ముఖ్యమయ్యాయని ఆరోపించారు. ఫలితంగా, ఆయన అసంపూర్తిగా ఉన్న మందిరానికి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారని, ఇది అశుభకరమైన చర్య అంటూ ఆయన అభిప్రాయపడ్డారు. అసలు పూజా కార్యక్రమాలను శంకరాచార్యులే నిర్వహించి ఉండాల్సింది, కానీ వారిని ఆ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆహ్వానించలేదని ఆయన అన్నారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137